అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

ఆదివారం 24-11-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 325 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00



ఫార్మాసిటీ కాదు.. ఇండస్ట్రియల్ కారిడార్

యువత, మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యం

- కొడంగల్ అభివృద్ధి నా బాధ్యత
- నా నియోజకవర్గ ప్రజలను ఇబ్బంది పెడతానా ?
- కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం
- భూసేకరణ పరిహారం పెంపును పరిశీలిస్తాం : వామపక్ష నేతలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- లగచర్లలో నిర్బంధకాండను నిలిపేయాలి : సీఎంకు లెఫ్ట్ పార్టీల నేతల వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కొడంగల్‌లో ఏర్పాటు చేసేది ఫార్మాసిటీ కాదనీ, ఇండస్ట్రియల్ కారిడార్ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం తన బాధ్యత అని అన్నారు. యువత, మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పించడమే తన ఉద్దేశమని వివరించారు. సొంత నియోజకవర్గ ప్రజలను తానెందుకు ఇబ్బంది పెడతానని చెప్పారు. లగచర్ల ఘటనపై శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వామపక్ష నేతలు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కొడంగల్‌లో కాలుష్య రహిత పరిశ్రమలనే ఏర్పాటు చేస్తామని వివరించారు. భూసేకరణ పరిహారం పెంపును పరిశీలిస్తామని చెప్పారు. కుట్రచేసిన వారిని వదిలిపెట్టబోమని అన్నారు. అమాయక రైతులపై కేసుల విషయంలో పరిశీలిస్తామన్నారు. ఈనెల 21న లగచర్ల ప్రాంతంలో వామపక్ష నేతలు పర్యటించిన విషయం తెలిసిందే. ప్రజలు, రైతులను కలిసి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ...5లో



మహారాష్ట్రలో దహను నుంచి సీపీఐ(ఎం) గెలుపు

వరుసగా రెండోసారి విజయం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో దహను నియోజకవర్గం నుంచి సీపీఐ(ఎం) వరుసగా రెండోసారి విజయం సాధించింది. సీపీఐ(ఎం) అభ్యర్థి వినోద్ భీవ నికోల్ బీజేపీ అభ్యర్థి మేథా వినోద్ సురేష్‌పై 5,133 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. వినోద్ భీవ నికోల్ ఈ ఎన్నికల్లో 1,04,702 ఓట్లు పొందారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఈయన కార్మిక నాయకుడిగా ప్రజాదరణ పొందారు.

కేరళ ఉప ఎన్నికల్లో సీపీఐ(ఎం) అభ్యర్థి ఘన విజయం

కేరళలో జరిగిన ఉప ఎన్నికల్లో సీపీఐ(ఎం) అభ్యర్థి యూఆర్ ప్రదీప్ ఘన విజయం సాధించారు. కేరళలోని చెలక్కర నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయన కాంగ్రెస్ అభ్యర్థి రమ్య హరిదాస్‌పై ...3లో

ఉప ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు

- యూపీ, అసోం, రాజస్థాన్‌లో బీజేపీ
- బెంగాల్‌లో తృణమూల్
- కర్నాటకలో పట్టు నిలుపుకున్న కాంగ్రెస్
- పంజాబ్‌లో సత్తా చాటిన ఆప్ 3లో..
- కేరళలోని చెలక్కరాలో సీపీఐ (ఎం) విజయం

వాయనాడ్‌లో ప్రియాంక విజయం 3లో..



మహాలో ఎన్డీఏ

233 స్థానాలలో విజయం | 48 సీట్లకే పరిమితమైన ఎంవీఏ



జార్ఖండ్‌లో ఇండియా

అధికారాన్ని నిలుపుకున్న జేఎంఎం | బెడిసికొట్టిన బీజేపీ విద్వేషప్రచారం




మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్లో అధికార పార్టీ కూటములకే ఓటర్లు పట్టం కట్టారు. మహారాష్ట్రలో ఎన్డీఏ కూటమి విజయం సాధించగా, జార్ఖండ్‌లో ఇండియా బ్లాక్ ఘన విజయం సాధించింది. రెండు రాష్ట్రాల్లో ఆయా కూటములు భారీ విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ఎగ్జిట్ పోల్స్‌లో రెండు చోట్లా కమల వికాసమేనంటూ ఇచ్చిన ఫలితాలు తారుమారయ్యాయి. ఒక్క మహారాష్ట్రలో మహాయుతి గెలవగా.. జార్ఖండ్‌లో మాత్రం పోల్స్ ఫలితాలు బెడిసికొట్టాయి. ప్రధాని మోడీ జార్ఖండ్‌లో స్వయంగా విస్తృత ప్రచారం చేసినా.. గిరిజన ఓటరు మాత్రం సీఎం హేమంత్ సోరెన్‌కే జై కొట్టారు. జేఎంఎంకు మరోసారి అవకాశమిచ్చారు. బీజేపీని తిరస్కరించారు. కమలం జెండా ఎగురవేయాలనుకున్న ఆశలపై జేఎంఎం నీళ్లు గుమ్మరించింది. మహా ఎన్నికల్లో గెలిచామన్న తృప్తి కమలం పార్టీ నేతల్లో మిగిలిందని ఆ పార్టీ శ్రేణులు అనుకుంటున్నాయి.



ప్రభావం చూపలేకపోయిన శరద్ పవార్, ఉద్ధవ్ థాకరే

- చతికిలబడ్డ కాంగ్రెస్
- ఎన్డీఏకు కలిసొచ్చిన 'లడ్కీ బహిన్'

ముంబయి : మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలలో అధికార మహాయుతి కూటమి ఘన విజయం సాధించింది. శాసనసభలోని మొత్తం 288 స్థానాలలో మహాయుతికి 233 స్థానాలు లభించాయి. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) 50 స్థానాలకే పరిమితమైంది. ఇతరులు 5 సీట్లు గెలుచుకున్నారు. మహాయుతిలో బీజేపీకి 132, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు 57, అజిత్ పవార్ నాయకత్వంలోని ఎన్సీపీకి 41 స్థానాలు వచ్చాయి. ప్రతిపక్ష ఎంవీఏలో కాంగ్రెస్ 16, ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన 20, శరద్ పవార్ నాయకత్వంలోని ఎన్సీపీ 10 స్థానాలలో విజయం సాధించాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో కేవలం 125 శాసనసభ స్థానాలలో మాత్రమే ఆధిక్యత కనబరచిన ఎన్డీఏ ఇప్పుడు ఏకంగా 228 సీట్లను సొంతం ...3లో



జేఎంఎం నేతృత్వంలోని కూటమికి 56 స్థానాలు

- 24 స్థానాలకే పరిమితమైన ఎన్డీఏ
- కాషాయపార్టీకి 21 సీట్లు

రాంచీ : ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ జార్ఖండ్‌లో ఇండియా కూటమి విజయ దుందుభి మోగించింది. శాసనసభలోని మొత్తం 81 స్థానాలలోనూ జేఎంఎం నేతృత్వంలోని ఇండియా కూటమికి 54 సీట్లు లభించాయి. బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ 25 స్థానాలకే పరిమితమైంది. ఇతరులు ఒక స్థానంలో విజయం సాధించారు. ఇండియా కూటమిలోని జేఎంఎంకు 34, కాంగ్రెస్‌కు 16, ఆర్జేడీకి 4 స్థానాలు లభించాయి. ఎన్డీఏలో బీజేపీకి 21 సీట్లు దక్కాయి. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలకు ప్రజలు పట్టం కట్టారు. బంగ్లాదేశ్ చొరబాటుదారుల పేరుతో ముస్లింలను లక్ష్యంగా చేసుకొని బీజేపీ సాగించిన విద్వేష ప్రచారాన్ని వారు తిప్పికొట్టారు. ఆదివాసీలు, ఇతర జార్ఖండ్ సమాజాలు ఇండియా ...3లో

లగచర్లలో జాతీయ మానవ హక్కుల కమిషన్

ఘటనపై స్థానికులను విచారించిన సభ్యులు

నవతెలంగాణ-కొడంగల్

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో కలెక్టర్‌పై జరిగిన దాడి ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ శనివారం విచారణ చేపట్టింది. స్థానిక గిరిజనులపై పోలీసులు దాడి చేసి, అక్రమంగా అరెస్టు చేశారని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు అందడంతో విచారణ చేపట్టింది. ఇప్పటికే లగచర్ల దాడిపై రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని సీఎస్, డీజీపీకి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. విచారణలో భాగంగా శనివారం లా విభాగం డిప్యూటీ రిజిస్ట్రార్ ముఖేశ్, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు రోహిత్‌సింగ్, ప్రకాశ్ శర్మ రోటిబండ తండాలో పర్యటించి, క్షేత్రస్థాయి దర్యాప్తు చేపట్టారు. వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ లగచర్ల గ్రామానికి వచ్చినప్పుడు ఏం జరిగింది, అధికారులపై దాడి, ఆ తర్వాత పోలీసులు అరెస్టు చేసిన తీరును కమిషన్ సభ్యులు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పోలీసులు తమపై చేసిన దౌర్జన్యాలను స్థానికులు వివరించారు. అర్ధరాత్రి తమ



ఇండ్లలోకి చొరబడి పోలీసులు తమ వాళ్లను అరెస్టు చేసి జైలుకు తరలించారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా నిలిపి వేసి మహిళలతో అసభ్యంగా ప్రవర్తించారని కమిషన్ సభ్యుల ఎదుట వాపోయారు. పోలీసులు ఇండ్లకు వచ్చినప్పుడు మహిళా పోలీసులు ఉన్నారా, అరెస్టు చేసిన వారిని కొట్టారా.. అనే అంశాలపై కమిషన్ అధికారులు ఆరా తీశారు. కలెక్టర్ వచ్చిన రోజు పోలీసులు తమపై కూడా దాడి చేశారని, ఇంకా ఆ దెబ్బలకు నొప్పులతో ...13లో

ఎన్నికల వాగ్దానాలను అమలు చేయండి..

పేదలకు 120 గజాల ఇంటిస్థలంతోపాటు రూ.5 లక్షలు ఇవ్వండి

- కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి
- వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు సహాయం చేయాలి
- రైతు భరోసాను తక్షణమే ఇవ్వాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలనీ, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర ప్రతినిధి బృందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పాలడుగు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ వెంకట్రాములు కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం సచివాలయంలో మీడియా సెంటర్ వద్ద వీరయ్య మాట్లాడుతూ అనేక మంది పేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివాసముంటున్నారని చెప్పారు. గుడిసెలు వేసుకున్న సందర్భంలో వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారని వివరించారు. ఆర్టీసీ పరిరక్షణ కోసం సాగిన సమ్మె కాలంలో కూడా అనేక మంది ఉద్యోగులు, ఉద్యోగ ...13లో



హైదరాబాద్ తాగునీటికి గోదావరి జలాలు

20 టీఎంసీల తరలింపుపై సీఎం సమీక్ష

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం గోదావరి జలాలను వాడుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు 20 టీఎంసీల తరలింపుపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. శనివారం జూబ్లీహిల్స్ నివాసంలో సమావేశమైన జలమండలి, ఇరిగేషన్ ఉన్నతాధికారులు సీఎంతో భేటీ అయ్యారు. హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాలకు సంబంధించి సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కొండపోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల నుంచి నీటి తరలింపుపై సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఏ ప్రాజెక్టు నుంచి నీటి తరలింపునకు ఎంత వ్యయం అవుతుంది, నీటి లభ్యతపై పూర్తి అధ్యయనం చేయాలని సూచించారు. డిసెంబర్ ఒకటో తేదీ వరకు టెండర్లకు వెళ్లేలా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. ఈమేరకు మిషన్ భగీరథ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షలో పట్టణ, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి బి దానకిషోర్, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, సాగునీటి శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్ పాల్గొన్నారు.

ఆరుగాలం కష్టపడి పండించే పంటలకు గిట్టుబాటు ధర పెరగట్లేదు. కానీ..! ఎరువులు, డీజిల్ ఇతర వస్తువుల ధరలు మాత్రం ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నాయి. యాసంగి సీజన్‌లో డీఏపీ ధరలు విపరీతంగా పెరగడంతో అన్నదాతలపై భారాలు భారీగానే పడనున్నాయి. ఏటేటా సాగు వ్యయం పెరగడం వల్ల రైతులు నష్టాల పాలవుతున్న పరిస్థితి ఉంది. బస్తా డీఏపీపై రూ.300 ధర పెరగడంతో రైతులపై వందల కోట్ల భారం పడనుంది. మరోపక్క డీఏపీ ఎరువుల ధరలు పెరగడంతో బ్లాక్ మార్కెట్ పెరిగింది. పాత సరుకును కొత్త ధరలకు అమ్ముతూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. యాసంగి సీజన్‌కు సరిపడా ఎరువుల్ని స్టాక్ చేయాల్సిన మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖలు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నాయి.

ఎరువుల పిడుగు

బస్తా ధర రూ.1350 నుంచి రూ.1650కి పెంపుదల

- రాష్ట్రవ్యాప్తంగా డీఏపీ భారం రూ.100 కోట్లు
- నిల్వలు అంతంతమాత్రమే..
- బ్లాక్ మార్కెట్‌లో వ్యాపారుల విక్రయాలు
- కేంద్రం వైఖరిపై అన్నదాతల ఆగ్రహం
- ఎరువుల ధరలు తగ్గించాలి : రైతు సంఘం

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి (కృష్ణ)

యాసంగి సీజన్‌లో విశాఖ, అనురాధ కార్తెలు ముగిసేలోపు వరి నార్లు పోస్తారు. డిసెంబర్ 15 నుంచి వరినాట్లు షురూ అవుతాయి. ఆరుతడి పంటలు సైతం ఇదే సమయంలో సాగవుతాయి. ఇప్పటికే బోర్లు, బావుల కింద సాగు చేసే వరి పంటలకు సంబంధించి నార్లు పోసే పనులు ప్రారంభమవ్వగా ఇతర మెట్ట పంటల సాగుకు దుక్కుల్ని సిద్ధం చేస్తున్నారు. యాసంగి సీజన్‌లో వరి, మొక్కజొన్న, కూరగాయలు, పండ్లతోటలు, చెరకు వంటి పంటల సాగులో ఎరువుల్ని వినియోగిస్తారు. అందులో డీఏపీ ఎరువు వాడకం అధికంగా ఉంటుంది. సీజన్ ప్రారంభానికి ముందే డీఏపీ ఎరువుల ధరలు పెరగడంతో రైతుల నెత్తిన పిడుగు పడినట్టయింది. ఇప్పటికే యాసంగి సీజన్




సాగు ప్రణాళికల్ని వ్యవసాయ శాఖ ప్రకటించింది. ఆయా పంటల వారీగా సాగు విస్తీర్ణానికి అవసరమైన విత్తనాలు, ఎరువుల్ని అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.

యాసంగి ప్రణాళికలు

రాష్ట్ర వ్యాప్తంగా యాసంగి సీజన్‌లో వివిధ రకాల పంటలు కలిపి 63.34 లక్షల ఎకరాల్లో సాగవ్వనున్నట్టు అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే 3.15 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగైనట్టు కూడా అధికారుల రికార్డుల్లో పేర్కొన్నారు. ఇందులో వరి పంట విస్తీర్ణమే అధికంగా ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో సైతం వివిధ రకాల పంటలు కలిపి 8.35 లక్షల ఎకరాల్లో సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. మెదక్ 3.33 లక్షల ఎకరాలు, సిద్దిపేట జిల్లాల్లో 3.20 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవ్వనున్నాయి. రెండు ...13లో

గౌతమ్ అదానీ, సాగర్‌లకు అమెరికా సెక్ సమన్లు

21 రోజుల్లోగా సమాధానమివ్వాలని ఆదేశాలు



న్యూయార్క్ : సౌర విద్యుత్ కాంట్రాక్టుల కోసం రూ.2200కోట్ల ముడుపులు చెల్లించారంటూ అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (సెక్) చేసిన అభియోగాలపై తమ వైఖరి వెల్లడించాలని కోరుతూ అదానీ గ్రూపు వ్యవస్థాపకుడు, చైర్మెన్ గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీలకు అమెరికా నుంచి సమన్లు అందాయి. ఈ మేరకు అహ్మదాబాద్‌లోని అదానీ శాంతివన్ ఫార్మ్ నివాసానికి, సాగర్ నివాసానికి కూడా సమన్లు వెళ్లాయి. న్యూయార్క్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ కోర్ట్ ద్వారా అందిన ఈ సమన్లకు 21 రోజుల్లోగా సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. "ఒకవేళ సమాధానమివ్వటంలో విఫలమైతే ఫిర్యాదులో పేర్కొన్న రిలీఫ్ కోసం మీకు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వబడుతుంది" అని ఆ నోటీసులు పేర్కొన్నాయి. అమెరికా న్యాయ విభాగం కోర్టులో దాఖలు చేసిన నేర అభియోగ పత్రం కాకుండా సెక్ విడిగా గౌతమ్ అదానీ, సాగర్‌లపై అలాగే అజూర్ పవర్ గ్లోబల్ ఎగ్జిక్యూటివ్ సిరిల్ కెబనీస్‌పై కూడా కేసు నమోదు చేసింది.

కరుగుతున్న విదేశీ మారకం నిల్వలు

నాలుగు నెలల కనిష్టానికి పతనం



ముంబయి : భారత విదేశీ మారకం నిల్వలు కరిగిపోతున్నాయి. వరుసగా ఏడో వారంలోనూ క్షీణించి.. నాలుగు నెలల కనిష్టానికి పడిపోయాయి. అమెరికా డాలర్‌కు డిమాండ్ పెరగడం.. రూపాయి విలువ పడిపోవడంతో మారకం నిల్వలపై ఒత్తిడి పెరిగింది. ట్రంప్ ఎన్నిక తర్వాత ఇటీవల పడిపోతున్న రూపాయి విలువ కట్టడికి ఆర్‌బిఐ వద్ద ఉన్న డాలర్లను విడుదల చేస్తోంది. ఈ ...13లో

మిల్లుకు వెళ్లిన ధాన్యం వెనక్కి రావడంతో రైతు దంపతుల ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ- తుంగతుర్తి

ధాన్యం కొనుగోలు కేంద్రంలో కాంటా అయ్యి మిల్లుకు వెళ్లిన ధాన్యం మళ్లీ వెనక్కి రావడంతో తీవ్ర మనస్తాపానికి చెందిన రైతు దంపతులు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. ఈ ఘటన శనివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల పరిధిలోని అన్నారం ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరిగింది. స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నారం గ్రామానికి చెందిన మట్టపల్లి వీరయ్య 58 బస్తాలు, పూసపల్లి శ్రీనివాస్ 205 బస్తాలు, పోగుల ...13లో

అద్దెబస్సులు తీసుకొనేందుకు సిద్ధంకండి

- తొలివిడతలో నాలుగు ఉమ్మడి జిల్లాల్లో...
- ఆర్టీసీ అధికారులకు మంత్రి పొన్నం ఆదేశాలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీలో స్వయం సహాయక బృందాల ద్వారా అద్దె బస్సుల్ని స్వీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారుల్ని ఆదేశించారు. తొలి విడతలో మహబుబ్‌నగర్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లోని మహిళా స్వయం సహాయక బృందాలకు అద్దె బస్సులను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల్లో మండల సమాఖ్యకు ఒక్కటి చొప్పున అద్దె బస్సులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని రవాణా శాఖ ప్రధాన కార్యాలయంలో శనివారంనాడాయన సమీక్షా సమావేశం నిర్వహించారు. మహాలక్ష్మి-మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, కొత్త బస్సుల కొనుగోలు, లాజిస్టిక్స్, ఆర్థిక పరమైన అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఈ అంశాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. మహాలక్ష్మి స్కీం ద్వారా ఈ నెల 20 వరకు ఆర్టీసీ 111 కోట్ల జీరో టికెట్లను జారీ చేసిందనీ, దీనివల్ల మహిళలు రూ.3,747 కోట్లను ఆదా చేసుకున్నారని మంత్రి తెలిపారు. మహాలక్ష్మి పథకానికి సంబంధించిన టికెట్ల రీయింబర్స్‌మెంట్‌ను ఆర్టీసీకి ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తున్నదనీ, దీనివల్ల ఆర్టీసీ లాభాల్లోకి వెళ్లిందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుకు ముందు ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) 69 శాతం ఉండగా, ఇప్పుడు 94 శాతానికి పెరిగిందని చెప్పారు. గత ఏడాది డిసెంబర్ నుంచి ప్రభుత్వం ఆర్టీసీకి 1,389 కొత్త బస్సుల్ని కొనుగోలు చేసిందనీ, రద్దీకి అనుగుణంగా మరిన్ని బస్సుల కొనుగోలుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. బస్టేషన్లను ఆధునీకరించాలనీ, కార్గో హోం డెలివరీ సదుపాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నాని చెప్పారు. మరణించిన, మెడికల్ అన్‌ఫిట్ అయిన సిబ్బంది జీవిత భాగస్వాములకు, పిల్లలకు ఇచ్చే కారుణ్య ఉద్యోగాల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.

ఈవీని ప్రోత్సహించండి

రవాణాశాఖలో ఆదాయాన్ని పెంచేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలని చెప్పారు. 15 ఏండ్లు నిండిన స్కూల్ బస్సుల్ని సీజ్ చేయాలనీ, దానికోసం నిరంతర తనిఖీలు చేపట్టాలన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు అదనపు ఆదాయ సముపార్జనకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలనీ, ఈవీ పాలసీపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. రోడ్డు భద్రతపై పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహనా తరగతులు నిర్వహించాలని సూచించారు. డ్రైవింగ్ స్కూల్స్ పనితీరుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక ఇవ్వాలని కోరారు. సమావేశంలో రవాణా, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, టీజీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్, జాయింట్ డైరెక్టర్ అపూర్వరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, వినోద్ కుమార్, ఫైనాన్స్ అడ్వయిజర్ విజయపుష్ప, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, జేటీసి రమేష్, మమత తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహం నింపేలా విజయోత్సవాలు

- సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో సమీక్ష



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రజాపాలన వచ్చి ఏడాది పూర్తవుతున్నందున డిసెంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రమంతటా పండుగ వాతావరణం వెల్లివిరిసేలా విజయోత్సవాలు జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అన్ని శాఖలు ఈ ఉత్సవాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ ఏడాదిలో ప్రభుత్వం సాధించిన విజయాలు, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాల ప్రణాళికను ప్రజలకు వివరించాలని సూచించారు. శనివారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ప్రజాపాలన-విజయోత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, ఉన్నతాధికారులతో సీఎం సమావేశమయ్యారు. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు కే కేశవరావు, వేం నరేందర్‌రెడ్డి, శ్రీనివాసరాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసే రైతు సదస్సుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రెండు రోజుల ముందు నుంచే రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలనీ, ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. రైతు రుణమాఫీ, రైతు భరోసాతో పాటు పంటల బీమా, సన్న వడ్లకు బోనస్ వంటి రైతు సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. డిసెంబర్ 4వ తేదీన పెద్దపల్లి జిల్లాల్లో నిరుద్యోగ యువతతో విజయోత్సవ సభ జరపాలనీ, అదే వేదికపై గ్రూప్-4తో పాటు వివిధ రిక్రూట్‌మెంట్ల ద్వారా ఎంపికైన 9 వేల మందికి నియామక పత్రాలు అందించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి శాఖల వారీగా నిర్దేశించిన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలు, శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలన్నీ ఈ వారం రోజుల్లో జరిగేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. శాఖల వారీగా రోజుకో మంత్రి తొలి ఏడాదిలో చేపట్టిన కార్యక్రమాల ప్రగతి నివేదికతో పాటు భవిష్యత్ ప్రణాళికను మీడియా ద్వారా ప్రజలకు వివరించాలని చెప్పారు. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు సెక్రెటేరియట్ పరిసరాలు, ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్ ప్రాంతమంతా తెలంగాణ వైభవం వెల్లివిరిసేలా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, హాస్టళ్లు, కాలేజీల్లోనూ ప్రజాపాలన విజయోత్సవ వేడుకలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. డిసెంబర్ 9వ తేదీ సెక్రెటేరియట్ ముఖద్వారం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరణ ఉంటుందనీ, ఆరోజు తెలంగాణ ఉద్యమకారులు, మేధావులు, విద్యావంతులు, వివిధ రంగాల్లో ప్రతిభ సాధించిన వారందరినీ ఆహ్వానించాలని సూచించారు. నియోజకవర్గానికి వెయ్యి మంది మహిళా శక్తి ప్రతినిధులను ఆహ్వానించి, లక్ష మంది తెలంగాణ తల్లుల సమక్షంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించాలనీ, దానికి తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

విజయోత్సవాల్లో భాగస్వాములు కావాలి

- రూ. 2750 కోట్లతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యేల శంకుస్థాపన : ఎమ్మెల్యేలకు మంత్రి సీతక్క లేఖలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క. ఎమ్మెల్యేలకు లేఖలు రాశారు. ఈ నెల 26న గ్రామ పంచాయతీల్లో జరిగే ప్రజా పాలన- ప్రజా విజయోత్సవాల్లో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. అధికార, విపక్ష ఎమ్మెల్యేలు అనే తారతమ్యం లేకుండా అందరికి ప్రత్యేకంగా లేఖలు పంపారు. తెలంగాణలో నూతన ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ప్రజా పాలన- ప్రజా విజయోత్సవాలను అన్ని గ్రామ పంచాయతీలలో నిర్వహిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 2,750 కోట్ల నిధులతో గ్రామ పంచాయతీల్లో పనులను చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ పనుల్లో స్థానిక ఎమ్మెల్యేలను భాగస్వామ్యం కావాలని కోరారు. 95 గ్రామీణ నియోజకవర్గాల్లో 95 మంది ఎమ్మెల్యేలకు వేరు వేరుగా లేఖలు రాశారు. ఇందిరా మహిళా శక్తి ఉపాధి భరోసా (పశువుల పాకలు, కాంపోస్ట్ గుంతలు, కోళ్ళ ఫారాలు), పొలం బాటలు (వ్యవసాయ పొలాలకు బాటలు), నర్సరీలు, జలనిధి (చెక్ డ్యాములు, కుంటలు), గ్రామీణ మౌళిక వసతులు (సిసి రోడ్లు, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ భవనాలు), గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణ పనులను చేపట్టనున్నారు.

చదువంటే చాందసత్వం కాదు..అదో విజ్ఞానం..

- తెలంగాణ బాలోత్సవాల్లో నినదించిన చిన్నారులు
- శాస్త్రీయ ఆలోచనకు ప్రతీకగా నిర్వహణ
- అన్ని రంగాల్లోనూ పిల్లలను ప్రోత్సహిస్తాం
- బాలోత్సవ నాలుగో పిల్లల జాతర ముగింపు సభలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చదువంటే చాందసత్వం కాదనీ, అదో విజ్ఞానమని తెలంగాణ బాలోత్సవాలు నొక్కి చెప్పాయి. శాస్త్రీయ ఆలోచనను రేకెత్తించే విధంగా పిల్లల మనసులను తీర్చి దిద్దాలని సూచించాయి. సమాజం, తల్లిదండ్రులు ఆ దిశగా కృషి చేయాలని దిశా నిర్దేశం చేశాయి. అందుకోసమే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పిల్లలందరినీ ఒకే చోట చేర్చి ఆట పాటలతో వారికి ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఇస్తున్నామని తెలిపాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా చిన్నారులు తమ తల్లిదండ్రుల వృత్తులైన రైతులు, కూలీలు, కార్మికుల ఈతి బాధలను కండ్లకు కట్టినట్టు వివరించారు. తద్వారా సమాజాన్ని ఆలోచనలో పడేశారు.. 'నాన్నగారి బామ్మగారి భావాలకు దాసులం కాబోమంటూ..పావన నవ జీవన బృందావన నిర్మాతలం' అంటూ నినదించారు. రెండు రోజుల పాటు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రకాల పోటీలు సభికులను అలరించాయి. శనివారం ఉత్సవాల ముగింపు సభను నిర్వహించారు. ఆ సభలో జాతీయ పిల్లల అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ విద్యాసాగర్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కార్యదర్శి ఎస్ వినయ్‌కుమార్, టీపీఎస్‌కే కన్వీనర్ జి రాములు, తెలంగాణ బాలోత్సవ కమిటి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూపతి వెంకటేశ్వర్లు, ఎన్ సోమయ్య మాట్లాడారు. చొక్కాపు వెంకటరమణ మాట్లాడుతూ తెలంగాణ బాలోత్సవం నిర్వహణ తీరు ప్రశంసనీయమని కొనియాడారు. డిజిటల్ యుగంలో విద్యార్థులకు వివిధ రకాల సాంస్కృతిక, ఎకడమిక్ పోటీలను నిర్వహించటం అభినందనీయమన్నారు. విద్యాసాగర్ మాట్లాడుతూ పిల్లల గురించి ఆలోచించటమంటేనే దేశ భవిష్యత్ గురించి ఆలోసించటం అన్నారు. మార్పు ఏదైనా పిల్లల నుంచే రావాలన్నారు. పిల్లలను అజ్ఞానంగా పెంచకుండా విశాల ఆలోచనలను రేకెత్తించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ విలువల గురించి తెలుసుకోవాలన్నారు. వినయ్‌కుమార్ మాట్లాడుతూ పిల్లలను ఆట పాటలకు దూరంగా ఉంచొద్దన్నారు. అలా ఉంచితే ఆరోగ్యానికి దూరంగా ఉంచటమేనని చెప్పారు. నేటి విద్యా విధానంలో పిల్లలు ఎదుర్కొంటున్న ఒత్తిడి నుంచి బయట పడాలంటే బాలోత్సవాలు ఒక సాధనంగా ఉపయోగపడుతున్నాయన్నారు. అందుకు బాలోత్సవాలకు విశేష ప్రాచుర్యం వస్తున్నదని చెప్పారు. చాందసత్వం, కులం, మతం, ప్రాంత విద్వేషపు దురభిప్రాయాలను ఏమీ తెలియని ఆ పసి పిల్లల మెదళ్లలోకి జొప్పిస్తున్నారనీ, వారు చెప్పిందే నిజమైన చరిత్ర అంటూ.. 'ప్రశ్న'ను చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సనాతన ధర్మం పేరుతో బూజు పట్టిన భావాలను సమాజం రుద్దాలను కొందరు పదేపదే ఉచ్చరిస్తున్నారన్నారు. విద్యార్థులుగా ప్రతి అంశాన్ని తర్కించి నిర్ణయానికి రావాల్సిన అవశ్యకత పెరిగిందని సూచించారు. భూపతి, సోమయ్య మాట్లాడుతూ చదువులంటే పరీక్షలు, మార్కులు, ర్యాంకులు మాత్రమే కాదన్నారు. సమాజ పరిస్థితులను అధ్యయనం చేయటమే నిజమైన జ్ఞాన సముపార్జన అన్నారు. తెలంగాణ బాలోత్సవాలు ఒకరినొకరు ప్రేమించుకునే గుణాన్ని అభివృద్ధి చేస్తుందని చెప్పారు. ప్రశ్నించే తత్వాన్ని పెంచుతున్నదని వివరించారు. పురోగామి భావాలు, మహనీయుల మంచి మాటలు, అందవిశ్వాసాలు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా వారిలో ప్రశ్నించే ధైర్యాన్ని నెర్పుతున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో కాకతీయ రుద్రమ్మ, వీరనారి ఐలమ్మ, అల్లూరి సీతారామరాజు లాంటి ఎందరో జాతీయోద్యమ, శాస్త్రవేత్తల, షీ హీరోల వేషధారణలో పిల్లలు తమ ఏకపాత్రాభినయాలు ప్రదర్శించారన్నారు. 87 పాఠశాలల నుంచి 4,120 మంది పిల్లలు, 210 మంది ఉపాధ్యాయులు, 400 మంది తల్లిదండ్రులు, 110మంది వాలంటీర్లు, 45 మంది న్యాయ నిర్ణేతలు పాల్గొన్నారు. సాహిత్య ,సాంస్కృతిక పరమైన 26 అంశాల్లో పిల్లలు పాల్గొన్నారని తెలిపారు. ప్రతిభా పాటవాలను ప్రదర్శించిన విద్యార్థులకు, పాఠశాలలకు జ్ఞాపికలను అందజేశారు. బాలోత్సవ సంబురాల విజయానికి తోడ్పాటునందించిన ఎల్‌ఐసీ, రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, సింగరేణి కంపెనీకి, దాతలు, ప్రోత్సాహకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం కమిటీ ఉపాధ్యక్షులు కె.సుజావతి,జి బుచ్చిరెడ్డి మమత,రూప రుక్మిణీ, కె.శాంతారావు, వీఆర్ శర్మ శాంతారావు, టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కంట్లో కట్టెపేడు గుచ్చుకుందని వస్తే కాటికి పంపారు

- వైద్యం వికటించి ఐదేండ్ల చిన్నారి మృతి
- హబ్సిగూడ ఆనంద్ కంటి ఆస్పత్రిలో ఘటన
- ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల ఆందోళన



నవతెలంగాణ-ఓయూ

కంటిలో నలుసు పండిందని ఆస్పత్రికెళ్లిన పసి హదయం వైద్యం వికటించి మృతిచెందింది. ఈ విషాద ఘటన హైదరాబాద్ హబ్సిగూడలో జరిగింది. కంటిలో కట్టెపేడు గుచ్చుకుందని ఆస్పత్రికి వస్తే ఆపరేషన్ పేరుతో ఐదేండ్ల చిన్నారి ప్రాణం తీశారు.. పైగా చేసిన తప్పును కప్పి పుచ్చుకోవడానికి అనేక ప్రయత్నాలు చేసి కనీసం కుటుంబ సభ్యులకు వివరాలు చెప్పకుండా గోప్యంగా ఉంచారు. ఇందుకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం ఉగ్గంపల్లికి చెందిన రవి-మౌనిక దంపతులు కుమార్తె అన్విక(5), రెండేండ్ల కుమారుడితో చందానగర్ ఆర్సీపురంలో నివాసం ఉంటున్నారు. రవి బోర్‌వెల్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. అన్విక స్థానిక పాఠశాలలో యూకేజీ చదువుతోంది. కాగా రెండ్రోజుల కిందట అన్విక ఇంటి ముందర ఆడుకుంటూ ఓ చిన్న కట్టెపుల్లను విరుస్తున్న క్రమంలో కట్టె పేడు ఆమె కంటిలో గుచ్చుకుంది. వెంటనే తల్లిదండ్రులు ఆమెను చందానగర్‌లోని ఆనంద్ కంటి ఆస్పత్రికి తీసుకువెళ్లి పరీక్షలు చేయించారు. వైద్యులు పాప కంట్లో డ్రాప్స్ వేసినా కన్ను ఎరుపుగా మారింది. రోజంతా అలాగే ఉంచిన వైద్యులు ఏమీ కాదని చెప్పారు. కంటినొప్పి తీవ్రం కావడంతో ఆపరేషన్ చేయాలంటూ హబ్సిగూడలోని ఆనంద్ కంటి ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. దాంతో వారు బాలికను తీసుకుని ఈనెల 22న హబ్సిగూడ ఆనంద్ కంటి ఆస్పత్రికి మధ్యాహ్నం 12గంటలకు తీసుకురాగా, అన్ని పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఒంటిగంటకు ఆపరేషన్‌కు సిద్ధం చేశారు. ముందుగా మత్తుమందు ఇచ్చారు. అది డోసు ఎక్కువ కావడంతో పాప అపస్మారక స్థితికి వెళ్లింది. ఇది గమనించని డాక్టర్లు పాపకు ఆపరేషన్ చేసే సమయంలో గుండె సరిగ్గా కొట్టుకోవడం లేదని ఒకసారి, బాగానే పనిచేస్తుంది.. పాప కోలుకుంటుందని మరోసారి ఇలా కుటుంబ సభ్యులకు చెబుతూ వచ్చారు. మరోవైపు వైద్యం వికటించిందని గమనించి తార్నాక సురక్ష ఆస్పత్రి నుంచి, ఎల్బీనగర్ చింతకుంటలోని రెయిన్‌బో ఆస్పత్రి నుంచి స్పెషలిస్టులను రప్పించారు. అయినా ఫలితం లేకపోవడంతో పాప కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండానే ఆమెను ఎల్బీనగర్ చింతకుంటలోని రెయిన్‌బో ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అపస్మారక స్థితిలో ఉన్న బాలిక పరిస్థితి విషమించి శనివారం మృతిచెందింది. అయితే, పాపకు రెయిన్ బో ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నామంటూ వైద్యులు నమ్మబలికారు. తమకు తెలియకుండానే ఆస్పత్రికి మార్చడం.. వైద్యం చేస్తున్నారంటూ చెప్పడంతో తల్లిదండ్రులకు అనుమానం ఏర్పడింది. దాంతో నేరుగా రెయిన్‌బో ఆస్పత్రిని సంప్రదించగా.. పాపను వెంటిలేటర్‌పై ఉంచామని, ఆమె బ్రెయిన్‌డెడ్ అయినట్టు అక్కడి వైద్యులు చెప్పారు. దాంతో కుటుంబసభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యమే తమ బిడ్డ ప్రాణం తీసిందని తల్లిదండ్రులు, బంధువులు విలపించారు.విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు, ఓయూ విద్యార్థులు, ఎమ్మార్పీఎస్ నాయకులు హబ్సిగూడలోని ఆనంద్ కంటి ఆస్పత్రికి చేరుకుని ఆందోళనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారే అవకాశం ఉండటంతో ఆస్పత్రి వద్ద భారీగా బెటాలియన్ పోలీసులు మోహరించారు.

బాధిత కుటుంబం, ఆస్పత్రి యాజమాన్యం మధ్య చర్చలు..

ఇదిలా ఉండగా, ఆస్పత్రి యాజమాన్యంపై కేసు నమోదు చేయాల్సిన పోలీసులు అందుకు భిన్నంగా కుటుంబ సభ్యులు, యాజమాన్యంతో సుదీర్ఘ చర్చలు జరిపారు. పాప కుటుంబానికి నష్టపరిహారం ఇప్పించేందుకు ప్రయత్నాలు చేసినట్టు సమాచారం. పోలీసుల ప్రయత్నాలు ఫలించడంతో బాధిత కుటుంబీకులు రెయిన్ బో ఆస్పత్రికి వెళ్లినట్టు తెలిసింది. అనంతరం బాలిక మృతదేహాన్ని తీసుకుని వారి సొంతూరికి వెళ్లిపోయారు. కాగా, ఆస్పత్రి యజమాన్యంపై ఏమైనా కేసు నమోదు చేశారా అని మల్కాజిగిరి ఏసీపీని ప్రశ్నించగా, తనకు అర్జంటు పని ఉందని వెళ్లిపోయారు. ఆస్పత్రి వర్గాల నుంచి వివరణకు ప్రయత్నించగా, వారు అందుబాటులో లేకపోవడంతోపాటు సెల్‌ఫోన్స్ స్విచ్ఛాఫ్‌లో ఉన్నాయి. శనివారం పూర్తిస్థాయిలో ఆస్పత్రిని మూసేశారు.

నేడు ఆందోళన

పాప మృతికి కారణమైన వారిని శిక్షించాలని, చర్యలు చేపట్టాలని ఓయూ జేఏసీ నేతలు కోరారు. ఆదివారం ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేస్తామని ఒక ప్రకటనలో తెలిపారు.

సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంచండి

- వేసవి కరెంటు డిమాండ్‌కు ఇప్పటి నుంచే ఏర్పాట్లు : సమీక్షా సమావేశంలో విద్యుత్‌శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సమ్మర్ డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ సంస్థలు పటిష్టచర్యలు తీసుకోవాలని ఆ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అధికారుల్ని ఆదేశించారు. శనివారంనాడిక్కడ విద్యుత్ సౌధలో టీజీట్రాన్స్‌కో, జెన్‌కో బోర్డుసమావేశాలతో పాటు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నదనీ, వేసవిలో మరింత పెరిగే అవకాశాలు ఉన్నందున ఈహెచ్‌టీ, 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం వేసవిలో రాష్ట్రవ్యాప్తంగా 5 శాతం, గ్రేటర్ హైదరాబాద్‌లో 15 శాతం విద్యుత్ డిమాండ్ అధికంగా నమోదయ్యిందని గుర్తుచేశారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. సమ్మర్ యాక్షన్‌ప్లాన్ పనులు జనవరి 31 నాటికి పూర్తిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఆర్సీపురం, బౌరంపేట ప్రాంతాల్లో ట్రాన్స్‌కో ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంచాలన్నారు. నిర్మాణంలో ఉన్న జడ్చర్ల, నారాయణపూర్ 132 కేవీ సర్క్యూట్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, దక్షిణ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు ముషారఫ్ ఫారూఖీ, వరుణ్‌రెడ్డి, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు తదితరులు పాలొన్నారు.

నిలిచిన వందే భారత్ ట్రైన్ల తుది డిజైన్

మరిన్ని మార్పులను కోరిన భారత రైల్వే

14 నెలల క్రితమే ఒప్పందం

న్యూఢిల్లీ : వందే భారత్ ట్రైన్ల గురించి మోడీ సర్కారు తీవ్ర ప్రచారాన్నే కల్పించింది. తమ పాలనలో భారత రైల్వే రూపు రేఖలు మారి, కొత్త రూపు సంతరించుకున్నాయని గొప్పలు చెప్పుకుంటున్నది. అయితే, స్లీపర్ కోచ్‌లను కలిగి ఉండే కొత్త ట్రైన్ల తుది డిజైన్‌కు ఇంకా పూర్తి కాలేదు. భారత్, రష్యా కంపెనీల జాయింట్ వెంచర్(జేవీ)లో భాగంగా 14 నెలల క్రితమే ఈ ఒప్పందం కుదిరింది. ఇప్పటికీ ఒక తుది రాకపోవటం గమనార్హం. అయితే, భారతీయుల అవసరాలకు తగ్గట్టుగా ప్రతి కోచ్‌లోనూ మరిన్ని టాయ్‌లెట్లు, కొత్త లగేజీ జోన్లు, ప్రతి ట్రైన్‌లోనూ పాంట్రీ కార్ల అవసరం కారణంగానే డిజైన్లు నిలిచిపోయిందనీ, భారత రైల్వే ఈ మార్పులను కోరిందని తెలుస్తున్నది. "భారత రైల్వే ఈ ప్రక్రియను నిలుపుదల చేస్తే, ప్రాజెక్టు పూర్తయ్యే షెడ్యూల్‌పై దాని ప్రభావం పడుతుంది. ఉత్పత్తిని త్వరగా ప్రారంభించటానికి మేము ఆసక్తితో ఉన్నాం. మేం చర్చించే అంశం రెండు గంటల్లో పరిష్కారం కాగలదు. కానీ, లేఖలు పంపటానికి, వివరణల కోసం ఎదురు చూడటానికే మేము నెలల సమయం వెచ్చించాల్సి వస్తున్నది" అని జాయింట్ వెంచర్‌లో మేజర్ వాటాదారు అయిన టీఎంహెచ్ సీఈఓ కిరిల్ లిపా తెలిపారు. 1920 వందే భారత్ స్లీపర్ కోచ్‌ల తయారీ కోసం టీఎంహెచ్ కాంట్రాక్టు పొందింది. ప్రాజెక్టు ఎగ్జిక్యూట్ కోసం వందే భారత్ స్లీపర్ ట్రైన్ల తయారీకి రూ. 55 వేల కోట్ల కాంట్రాక్టును కైనెట్ రైల్వే సొల్యూషన్స్, ఆర్‌వీఎన్‌ఎల్‌లు దక్కించుకున్నాయి. గతేడాది సెప్టెంబరులో ఒప్పందం కుదిరింది. ఈ ఏడాది ముగిసేనాటికి తొలి ప్రోటోటైప్ ట్రైన్ ప్రారంభానికి నోచుకుంటుందని తాము భావించామనీ, అయితే, కోచ్‌ల డిజైన్‌లో భారత రైల్వే మార్పులను కోరటంతో తాము మళ్లీ పని చేయాల్సి వచ్చిందని కిరిల్ లిపా చెప్పారు. ఈ మార్పుల కోసం సమయం, అదనపు బడ్జెట్ అసరమవుతుందని తెలిపారు. కాంట్రాక్టు ఒప్పందం ప్రకారం 'సాంకేతిక మార్పులను' కోరామని భారత రైల్వే అధికార ప్రతినిధి ఒకరు చెప్పారు. అయితే, నాలుగు, ఐదు నెలల తర్వాత కైనెట్ స్పందించిందని అన్నారు. వారి స్పందన పరిశీలనలో ఉన్నదని తెలిపారు.

మణిపూర్‌కు కేంద్ర సాయుధ పోలీసు బలగాలు

- అదనంగా 70 కంపెనీల సీఏపీఎఫ్

ఇంఫాల్ : హింసతో అట్టుడుకుతున్న మణిపూర్‌కు మరిన్ని కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఏపీఎఫ్) తరలనున్నాయి. సీఏపీఎఫ్‌కు చెందిన 70 కంపెనీలు రాష్ట్రానికి రానున్నాయి. సాయుధ మిలిటెంట్ గ్రూపుల నుంచి సాధారణ పౌరులను రక్షించటానికి ఈ బలగాలు మోహరించనున్నాయి. హింసాత్మక ఘర్షణల నేపథ్యంలో రాష్ట్రంలో శాంతి భద్రతల రక్షణకు ఇప్పటికే రాష్ట్రంలో కొన్ని బలగాలు మోహరించి ఉన్నాయి. తాజాగా, మరిన్ని బలగాలు వచ్చి చేరుతుండటంతో రాష్ట్రంలో భద్రతా సిబ్బంది సంఖ్య దాదాపు 39 వేలకు చేరుకోనున్నది. జిరిబామ్‌లోని నింగ్‌సింగ్‌కుల్ బయోడైవర్సిటీ పార్క్‌లో ముగ్గురు మహిళలు, కొందరు చిన్నారులు.. మొత్తం తొమ్మిది మంది అంత్యక్రియలు జరిగాయి. ఈ నేపథ్యంలో సెక్యూరిటీ అడ్వైజర్ కులిదీప్ సింగ్ నుంచి ఈ ప్రకటన రావటం గమనార్హం.

తిలక్ విశ్వరూపం

- 67 బంతుల్లో 151 బాదిన తిలక్ వర్మ
- 179 పరుగులతో హైదరాబాద్ గెలుపు

రాజ్‌కోట్ (గుజరాత్): హైదరాబాద్ స్టార్ తిలక్ వర్మ (151, 67 బంతుల్లో 14 ఫోర్లు, 10 సిక్స్‌లు) విశ్వరూపం చూపించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నమెంట్‌లో శనివారం మేఘాలయపై శతకబాదిన తిలక్ వర్మ.. టీ20 క్రికెట్‌లో హ్యాట్రిక్ సెంచరీ బాదిన తొలి క్రికెటర్‌గా నిలిచాడు. దక్షిణాఫ్రికాతో చివరి రెండు టీ20ల్లో సెంచరీలు సాధించిన తిలక్ వర్మ.. అదే జోరు దేశవాళీలోనూ కొనసాగించాడు. తొలి ఓవర్లోనే క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. బౌండరీల రూపంలోనే తిలక్ వర్మ శతకం సాధించాడు. 10 సిక్సర్లు, 14 ఫోర్లతో 116 పరుగులు పిండుకున్నాడు. టీ20ల్లో 150 ప్లస్ పరుగులు సాధించిన తొలి భారత క్రికెటర్ రికార్డును సైతం తిలక్ ఖాతాలో వేసుకున్నాడు. మేఘాలయతో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 248 పరుగులు చేసింది. తన్మయ్ అగర్వాల్ (55), రాహుల్ బుద్ధి (30) రాణించారు. ఛేదనలో మేఘాలయ చేతులెత్తేసింది. 15.1 ఓవర్లలో 69 పరుగులకే కుప్పకూలింది. అనికెత్ రెడ్డి (4/11), తనయ్ త్యాగరాజన్ (3/15) కీలక వికెట్లు పడగొట్టారు.



179 పరుగుల తేడాతో హైదరాబాద్ ఏకపక్ష విజయం సాధించింది. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీ గ్రూప్-ఏలో ఆడుతున్న హైదరాబాద్.. సోమవారం బెంగాల్‌ను ఢీకొట్టనుంది.

సాత్విక్ జోడీకి నిరాశే

సెమీస్‌లో పోరాడినా తప్పని ఓటమి

చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ 2024



షెంజెన్ (చైనా) : భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్స్ సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి పోరాటానికి సెమీఫైనల్లో తెరపడింది. చైనా మాస్టర్స్ సూపర్ 750 టోర్నమెంట్‌లో ఆరో సీడ్ భారత జోడీ సెమీఫైనల్లో పరాజయం పాలైంది. దక్షిణకొరియా షట్లర్లు జిన్ యాంగ్, సియోలు 21-18, 14-21, 21-16తో సాత్విక్, చిరాగ్‌లపై పైచేయి సాధించారు. 75 నిమిషాల పాటు ఉత్కంఠగా సాగిన సెమీస్ సమరంలో తొలి గేమ్‌లో మనోళ్లు ఆఖరు వరకు పోటీపడినా నిరాశ తప్పలేదు. రెండో గేమ్‌ను 21-14తో అలవోకగా గెలిచిన సాత్విక్, చిరాగ్‌లు నిర్ణయాత్మక మూడో గేమ్‌లో తేలిపోయారు. ద్వితీయార్థంలో నిరాశపరిచారు. 16-21తో మూడో గేమ్‌తో పాటు ఫైనల్ బెర్త్‌ను కోల్పోయారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్, మహిళల సింగిల్స్‌లో పి.వి సింధు సైతం పరాజయం పాలవటంతో చైనా మాస్టర్స్‌లో భారత షట్లర్ల టైటిల్ వేట ముగిసింది.

టైటాన్స్‌పై జెయింట్స్ గెలుపు

28-31తో

తెలుగు టైటాన్స్ పరాజయం



న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్‌లో హ్యాట్రిక్ విజయాల జోరు మీదున్న తెలుగు టైటాన్స్‌కు గుజరాత్ జెయింట్స్ బ్రేక్ వేసింది. ఆఖరు వరకు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ చేతిలో తెలుగు టైటాన్స్ 3 పాయింట్ల తేడాతో ఓటమి పాలైంది. టైటాన్స్ స్టార్ రెయిడర్లు విజయ్ మాలిక్, ఆశీష్ నర్వాల్‌ను ఆఖరు రెండు నిమిషాల్లో సూపర్ ట్యాకిల్ చేసిన గుజరాత్ జెయింట్స్ సీజన్లో మూడో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. 31-28తో తెలుగు టైటాన్స్‌పై మెరుపు విజయం సాధించింది. ప్రథమార్థంలో 17-15తో ముందంజలో నిలిచిన టైటాన్స్.. ద్వితీయార్థంలో డీలా పడింది. గుజరాత్ జెయింట్స్ తరఫున పర్తీక్ దహియ (11), గుమన్ సింగ్ (5) రాణించారు. తెలుగు టైటాన్స్ తరఫున విజయ్ మాలిక్ (15), ఆశీష్ నర్వాల్ (7) ఆకట్టుకున్నారు. పీకెఎల్ 11వ సీజన్లో 13 మ్యాచుల్లో తెలుగు టైటాన్స్‌కు ఐదో ఓటమి. విజయంతో జెయింట్స్ ఐదు పాయింట్లు ఖాతాలో వేసుకోగా.. స్వల్ప తేడాతో పరాజయం పాలైన తెలుగు టైటాన్స్ సైతం ఓ పాయింట్ దక్కించుకుంది.

మహాలో ఎన్డీఏ



(మొదటిపేజీ తరువాయి)

చేసుకోగలిగింది. రాష్ట్రంలో మొత్తం 48 పార్లమెంటరీ స్థానాలు ఉండగా ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో ఎన్డీఏకు కేవలం 17 మాత్రమే లభించిన విషయం తెలిసిందే.

లోక్‌సభ ఎన్నికలలో పేలవమైన ప్రదర్శన కనబరచిన స్థానాలలో ఇప్పుడు మహాయుతి కూటమి గణనీయమైన విజయాలను నమోదు చేసుకోవడం గమనార్హం. ఒకవైపు గతంలో ఆధిక్యత కనబరచిన స్థానాలను నిలుపుకుంటూనే మరోవైపు ఎంవీఏకు గట్టి పట్టున్న ప్రాంతాలలో కూడా మహాయుతి పాగా వేసింది. మహారాష్ట్రలో ముస్లింల ప్రాబల్యం అధికంగా ఉన్న 31 నియోజకవర్గాలలో కూడా ఎన్డీఏ తన ఆధిక్యతను చాటుకుంది.

మహారాష్ట్ర ఎన్నికలలో మహాయుతి కూటమి ఘన విజయం సాధించడానికి ప్రధానంగా లడ్కీ బహిన్ పథకం దోహదపడిందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఈ పథకం మహిళా ఓటర్లను విశేషంగా ఆకర్షించింది. లోక్‌సభ ఎన్నికలలో ఎదురు దెబ్బలు తిన్న తర్వాత మహాయుతి ప్రభుత్వం ఓటర్లను ఆకర్షించేందుకు అనేక పథకాలను ప్రకటించింది. వాటిలో లడ్కీ బహిన్ కీలకమైనది. రాష్ట్రంలోని ప్రతి మహిళకూ ఈ పథకం ద్వారా రూ.1,500 ఆర్థిక సాయం అందుతోంది. అదీకాక లోక్‌సభ ఎన్నికలలో పరాజయాలు చవిచూసిన తర్వాత ఎన్డీఏలో కదలిక మొదలైంది. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు కలిసికట్టుగా సమన్వయంతో పని చేశాయి. రాష్ట్రంలో దేవేంద్ర ఫడ్నవీస్, ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ కీలక నేతలుగా తమ స్థానాలను సుస్థిరం చేసుకోవడంతో ఎన్డీఏ సునాయాసంగా విజయం సాధించగలిగింది. మరోవైపు శివసేన (యూబీటీ), ఎన్సీపీ (శరద్ పవార్) పార్టీలు తమ ప్రాభవాన్ని కోల్పోయాయి. ఈ పరిణామం ఉద్ధవ్ థాకరే, శరద్ పవార్‌లకు గట్టి ఎదురు దెబ్బగా భావించవచ్చు. భవిష్యత్తులో రాష్ట్ర రాజకీయాలలో వీరు నిర్వహించబోయే పాత్రపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఈ ఎన్నికలలో సమర్థవంతమైన వ్యూహాన్ని రూపొందించుకోవడంలో కాంగ్రెస్ పార్టీ, దాని అగ్రనేత రాహుల్ గాంధీ దారుణంగా విఫలమయ్యారు. లోక్‌సభ ఎన్నికలలో ప్రజలు అందించిన విజయాలను శాసనసభ ఎన్నికలలో అందిపుచ్చుకోలేకపోయారు. ఈ ఫలితాలు మహారాష్ట్రలో కాంగ్రెస్ బలహీనతలను బయటపెట్టాయి. ఎన్డీఏకు దీటైన ప్రత్యామ్నాయాన్ని ప్రజల ముందు ఉంచడంలో కూడా ప్రతిపక్ష పార్టీలు విఫలమయ్యాయి.

తదుపరి సీఎంపై మంతనాలు

ముఖ్యమంత్రి ఎవరనే విషయంలో అధికార మహాయూతి కూటమిలో అప్పుడే భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. ఎక్కువ స్థానాలు గెలుచుకున్న పార్టీకి చెందిన వారే ముఖ్యమంత్రి కావాలని ఎక్కడా లేదని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి లడ్కీ బహిన్ యోజన పథకం అధికార కూటమికి ఓట్ల వర్షం కురిపించిందని అంటూ మహిళలకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి పదవి కోసం తీవ్రంగా పోటీ పడుతున్న బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ మాత్రం మూడు పార్టీలు కలిసి నిర్ణయం తీసుకుంటాయని చెప్పారు. 'ముఖ్యమంత్రి పదవిపై కూటమిలో విభేదాలేవీ లేవు. మొదటి రోజు నుండే మేమంతా స్పష్టతతో ఉన్నాం. మూడు పార్టీల నేతలు కూర్చొని సీఎంను నిర్ణయిస్తారు' అని ఆయన తెలిపారు. 'ప్రజలు తీర్పు ఇచ్చారు. ఎన్సీపీ అసలైన వారసత్వం అజిత్ పవార్‌దేనని వారు స్పష్టం చేశారు. శివసేన కూడా ఏక్‌నాథ్ షిండేదేనని తేల్చి చెప్పారు. మా ట్రాక్ రికార్డు బాగుంది. దానిని చూసి ప్రజలు మాకు ఓటేశారు' అని అన్నారు. మరాఠాలు, ఓబీసీలు తమ వెంటే ఉన్నారని చెప్పారు. తాము ఎవరి పైనా ప్రతీకారం తీర్చుకోబోమని, ప్రతిపక్షాలను గౌరవిస్తామని తెలిపారు. కాగా ఫడ్నవీస్‌ను తదుపరి ముఖ్యమంత్రిని చేయాలని బీజేపీ ఎమ్మెల్సీ ప్రవీణ్ దారేకర్ డిమాండ్ చేశారు. బీజేపీ అతి పెద్ద పార్టీగా అవతరించిందని, కాబట్టి ఫడ్నవీస్‌నే సీఎంను చేయాలని ఆయన కోరారు.

ఇదిలావుండగా తన తండ్రిని ముఖ్యమంత్రిగా చూడాలని మహారాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ కుమారుడు జే పవార్ వ్యాఖ్యానించారు. బారామతిలోని ప్రతి ఒక్కరూ తన తండ్రిని సీఎం కుర్చీలో చూడాలని ఆశిస్తున్నారని చెప్పుకొచ్చారు. ఇది అభివృద్ధికి లభించిన విజయమని, కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకొని పోయిందని బీజేపీ జాతీయ కార్యదర్శి అరుణ్ సింగ్ చెప్పారు. చారిత్రక విజయం సాధించిన ఫడ్నవీస్‌ను కేంద్ర మంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ అభినందించారు.

ప్రభావం చూపలేకపోయిన చిన్న పార్టీలు

మహారాష్ట్ర ఎన్నికల సమరంలో తలపడిన చిన్న చిన్న పార్టీలు ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయాయి. రాజ్ థాకరే నేతృత్వంలోని మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్‌ఎస్), ప్రకాష్ అంబేద్కర్ నాయకత్వంలోని వంచిత్ బహుజన్ అఘాడీ (వీబీఏ) పార్టీలు ఓటర్లను ఆకట్టుకోలేక చతికిలపడ్డాయి. ఎంఎన్‌ఎస్ నుండి 125 మంది, వీబీఏ నుండి 200 మంది పోటీ చేసినా ఒక్కరూ శాసనసభలో ప్రవేశించలేకపోయారు. రాజ్ థాకరే కుమారుడు అమిత్ థాకరే ముంబయిలోని మహిమ్‌లో మూడో స్థానానికే పరిమితమయ్యారు. రాజు షెట్టి నాయకత్వంలోని స్వాభిమాని పక్ష 19 మందిని పోటీకి నిలిపినా ఒక్కరినీ గెలిపించుకోలేకపోయింది. పశ్చిమ మహారాష్ట్రలో రైతులపై ఆ పార్టీ కొంతమేర ప్రభావం చూపుతుందని భావించినప్పటికీ అలా జరగలేదు.

అధికార మహాయుతి కూటమిలో బీజేపీ 149, షిండే సేన 81, అజిత్ పవార్ ఎన్సీపీ 59 స్థానాలకు పోటీ చేశాయి. ఎంవీఏలో కాంగ్రెస్ 101, శివసేన (యూబీటీ) 95, ఎన్సీపీ (ఎస్పీ) 86 స్థానాలలో అభ్యర్థులను నిలిపాయి.

జార్ఖండ్‌లో ఇండియా

(మొదటిపేజీ తరువాయి)

కూటమికే జై కొట్టాయి. ముఖ్యమంత్రి మయా సమ్మాన్ యోజన పథకం, విద్యుత్ బిల్లుల బకాయిల రద్దు, వ్యవసాయ రుణాల మాఫీ వంటి నిర్ణయాలు ప్రజలను విశేషంగా ప్రభావితం చేశాయి. మయా సమ్మాన్ యోజన పథకం కింద రాష్ట్రంలోని 18-50 సంవత్సరాల మధ్య వయస్కులైన మహిళలకు ప్రభుత్వం నెలకు వెయ్యి రూపాయల ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. అధికారంలోకి వస్తే ఈ మొత్తాన్ని డిసెంబర్ నుండి రూ.2,500కు పెంచుతానని హామీ ఇచ్చింది. రాష్ట్రంలో 6.6 లక్షల మందికి అందుతున్న సామాజిక భద్రతా పథకాలను 30 లక్షల మందికి విస్తరింపజేయడం కూడా ఇండియా కూటమికి కలిసొచ్చింది. అదీకాక కోవిడ్ కష్టకాలంలో వలస కార్మికులకు హేమంత్ ప్రభుత్వం అన్ని విధాలా బాసటగా నిలిచింది. జార్ఖండ్‌లో బంగ్లాదేశ్ చొరబాటుదారుల ప్రవేశంపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ చేసిన ప్రచారం బీజేపీకి ఉపకరించకపోగా బెడిసికొట్టింది. ముస్లింలను చొరబాటుదారులుగా అభివర్ణించడం, ఆదివాసీల భూములను దోపిడీ చేయడానికి వారిని మైనారిటీలు వివాహం చేసుకుంటున్నారని ప్రచారం చేయడం వంటి ఎత్తుగడలు విద్వేషాలను రెచ్చగొట్టడానికి, విభజనకే దారితీస్తాయని ప్రజలు అర్థం చేసుకున్నారు.

జార్ఖండ్‌లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీజేపీ ప్రచారం విద్వేష పూరితంగా సాగింది. బీజేపీ నేతలు విష ప్రచారం సాగించిన సాంతల్ పరగణాలో కూడా జేఎంఎంకు మంచి విజయాలు లభించాయి. పాత తరం నేతలైన బాబూలాల్ మరాండీ, అర్జున్ ముండాలనే ఇప్పటికీ బీజేపీ ముందు పెట్టుకొని ప్రచారం చేయడం ఆ పార్టీ ఓటమికి కారణమైంది.



మహారాష్ట్రలో దహను నుంచి సీపీఐ(ఎం) గెలుపు

(మొదటిపేజీ తరువాయి)

12,201 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

సీపీఎంఎల్ (లిబరేషన్) రెండు స్థానాల్లో గెలుపు

జార్ఖండ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలో సీపీఎంఎల్ (లిబరేషన్) రెండు స్థానాల్లో ఘన విజయం సాధించింది. ఇండియా బ్లాక్ కింద మొత్తం నాలుగు స్థానాల్లో పోటీ చేసిన ఆ పార్టీ రెండు స్థానాలను సొంతం చేసుకుంది. సింద్రి నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి తారా దేవిపై సీపీఎంఎల్ అభ్యర్థి చంద్రదేయో మహతో (1,05,136 ఓట్లు) 3,448 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నిర్సా నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి అపర్ణ సంగీతపై సీపీఎంఎల్ అభ్యర్థి అరుప్ చటర్జీ (1,04,855 ఓట్లు) 1,808 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

మహారాష్ట్ర, జార్ఖండ్‌లో సీపీఐ(ఎం) అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

మహారాష్ట్రలో కల్యాన్ నియోజకవర్గంలో సీపీఐ(ఎం) అభ్యర్థి గవిట్ జీవ పండు 1,10,759 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. సోలపూర్ సిటి సెంట్రల్‌లో సీపీఐ(ఎం) అభ్యర్థి ఆదం నరసయ్య నారాయన్ 6,816 ఓట్లు సాధించారు. జార్ఖండ్‌లో సురేష్ ముండా (తమర్) 5,030 ఓట్లు, సపన్ మహతో (బహరగోర) 4,518 ఓట్లు, మధువా కచప్ (సిసాయి) 3,994, పున్ భూయియో (చత్ర) 3,016, లఖన్ లాల్ మండల్ (జమ్తారా) 3,553, షేక్ సైఫుద్దీన్ (పాకుర్) 3,652, గోపిన్ సోరెన్ (మహేశ్‌పూర్) 5,329, సనాతన్ డెహ్రీ (జామా) 1,677, కీర్తి ముండా (మహిళ) (మందర్) 2,821 ఓట్లు సాధించారు.

వాయనాడ్‌లో ప్రియాంక విజయం



వాయనాడ్ : కేరళలోని వాయనాడ్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంక గాంధీ వాద్రా తన సమీప సీపీఐ ప్రత్యర్థి సత్యన్ మొకేరీని 4,10,931 ఓట్ల మెజారిటీతో ఓడించారు. ప్రియాంకకు 6,22,338 ఓట్లు లభించగా సత్యన్‌కు 2,11,407 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి నవ్యా హరిదాస్ 1,09,939 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. మహారాష్ట్రలోని నాందేడ్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి డాక్టర్ సంతుక్‌రావ్ మరోత్‌రావ్ హంబర్డే గెలుపొందారు.

తప్పుల్లేకుండా డాటా ఎంట్రీ చేయండి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలశ్రీఱ కంప్యూటరీకరణలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. ఆమె ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్లు శనివారం నుంచి డాటా ఎంట్రీని ప్రారంభించారు. గణకులు వివరాలను డేటా ఎంట్రీ కేంద్రంలోకి తీసుకెళ్లే సమయంలో ఫారాలను గోప్యంగా ఉంచడంతో పాటు, ఆ డేటాను ఇతరులతో పంచుకోకుండా జాగ్రత్త వహించాలని ప్రభుత్వం ఆదేశించింది.

ప్రతి రోజూ నిర్వహించిన సర్వే వివరాలు, పురోగతిని సాయంత్రం 6 గంటల లోపు ప్రణాళికశాఖకు పంపాలని సూచించింది. సర్వే వివరాలు లీకైతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎస్ హెచ్చరించారు. కాగా శనివారం వరకు రాష్ట్రంలోని 1,05,03,257 కుటుంబాల సర్వేను పూర్తి చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది.

కమ్యూనిస్టులే దిక్సూచి

ఓటింగ్ శాతం తగ్గినా బీజేపీ రెచ్చగొడుతోంది..

- ప్రాంతీయ పార్టీలు లేకుండా చేయడమే ఆ పార్టీ లక్ష్యం
- సనాతనం అంటే హిందుత్వ స్థాపనకు కుట్రలు
- ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తిగా అమలు చేయాలి..
- మూసీ సుందరీకరణ అంటూ ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు
- ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తే చూస్తూ ఊరుకోం : సీపీఐ(ఎం) సౌత్ జిల్లా 4వ మహాసభలో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ - ధూల్ పేట్/సంతోష్‌నగర్

ప్రపంచం కమ్యూనిస్టుల వైపు చూస్తున్నదని, భావి ప్రపంచానికి కమ్యూనిస్టులే దిక్సూచి అనే సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. కమ్యూనిస్టులకు భవిష్యత్తు ఉందా?.. అని కొందరు ప్రశ్నిస్తారు కానీ కమ్యూనిస్టులు లేకుండా ప్రపంచానికి భవిష్యత్తు ఉందా? అనే పరిస్థితి వచ్చిందని తెలిపారు. సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సౌత్ జిల్లా నాలుగో మహాసభలు పాతబస్తీ హుస్సేని అలంలోని కామ్రేడ్ సయ్యద్ ఇబ్రహీంనగర్ పాల్కీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా పురాణపూల్ నుంచి పాల్కీగార్డెన్ వరకు భారీర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా ఎర్రజెండా తోరణాలు స్వాగతం పలికాయి. మహాసభలకు ముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కామ్రేడ్ సీతారామ్ ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి మహాసభలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. ఒకనాడు అమెరికా చుట్టూ తిరిగిన దేశాలు ఈరోజు చైనా వైపు చేరుతున్నారని తెలిపారు. బంగ్లాదేశ్‌లో అక్కడి విద్యార్థుల నాయకత్వంలో జరిగిన ఉద్యమం దేశ అధ్యక్షున్ని పారిపోయే పరిస్థితికి తీసుకువచ్చిందన్నారు. శ్రీలంకలో జరుగుతున్న రాజకీయ సంక్షోభం తీవ్రస్థాయికి పోవడంతో అక్కడి అధ్యక్షులు కనిపించకుండా పోయాడన్నారు. అక్కడి ప్రజలు వామపక్ష నాయకుడిని అధికారానికి తెచ్చిన పరిస్థితిని మనం చూస్తున్నామని చెప్పారు. ప్రపంచమంతా ఒకవైపు పోతుంటే మనదేశంలో బీజేపీ, ఎన్డీఏ ప్రభుత్వాలు దేశాన్ని అనాగరిక సంస్కృతిలో నెట్టేయ్యడానికి ప్రయత్నం చేస్తున్నాయన్నారు. హిందుత్వ శక్తులతో వెనుకబడ్డ తరగతులపై బహిరంగదాడులు చేయిస్తూ.. ప్రజల్లో గొడవలు రేపుతోందని అన్నారు. నిరుద్యోగ సమస్యల్లో నెట్టేస్తూ ప్రజలకు కనీస వసతులకు దూరం చేస్తున్నారన్నారు. రాజ్యాంగంలోని ముఖ్యమైన చట్టాలను మారుస్తూ హిందుత్వ రాజ్యాంగాన్ని ముందుకు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నేడు బీజేపీ చెప్తున్న సనాతనధర్మం కులవివక్షను పెంచి పోషించే ధర్మంగా ఉంటుందన్నారు. భూస్వామ్య సమాజంలో ఉన్న అనాగరిక సంస్కృతిని తిరిగి ముందుకు తెచ్చి తామే నిజమైన దేశభక్తులం, ఈ దేశం కేవలం హిందువులదే అంటారని.. కానీ హిందువులదైతే మంచిదే కానీ, హిందుత్వవాదులది కాకూడదన్నదే తాము ప్రజల ముందు ఉంచుతున్నామని అన్నారు. మనుధర్మశాస్త్రాన్ని దేశ రాజ్యాంగంగా ముందుకు తీసుకురావాలని తహతహలాడుతున్నారని, దీన్ని ప్రజలు గ్రహించారు.. కనుకనే ఈసారి ఎన్నికల్లో బీజేపీని దూరం చేశారని తెలిపారు. గతంతో పోలిస్తే బీజేపీకి ఓట్ల శాతం పూర్తిగా తగ్గింది కానీ కొన్ని ప్రాంతీయ పార్టీలు మద్దతు ఇవ్వడంతో ఎన్డీఏ కూటమిగా ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగిందని అన్నారు. బీజేపీకి మద్దతిస్తున్న ప్రాంతీయ పార్టీలు భవిష్యత్తులో స్థానం లేకుండా పోయే పరిస్థితి వస్తుందనేది గమనించడం లేదన్నారు. ప్రాంతీయ అధికార పార్టీలను నాశనం చేయడమే బీజేపీ లక్ష్యంగా ఎంచుకున్న విషయం అని వారు గ్రహించాలని అన్నారు.



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలలో ఏ ఒక్కదాన్ని అమలు చేయడం లేదన్నారు. ప్రజా సమస్యలను పక్కకు నెట్టి మూసీ నది సుందరీకరణ పేరుతో రాష్ట్రాన్ని గందరగోళ పరుస్తున్నారని విమర్శించారు. మూసీనది సుందరీకరణ అంటే పేదలను అక్కడి నుంచి తరిమేసి వాళ్ల ఇల్లు వాకిలి కూల్చేయడం సుందరీకరణ కాదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపార కేంద్రాల కోసం పేదల భూములను సేకరించడం అన్యాయమన్నారు. గతంలో ఉన్న టీడీపీ, బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన కంటే మెరుగ్గా ఈ పాలన ఉండాలని కోరుకుంటున్నామన్నారు. భవిష్యత్తులో ప్రజా వ్యతిరేక విధానాలకు అమలు చేస్తే సీపీఐ(ఎం) చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. అసంఘటిత కార్మికులు రోజురోజుకు పెరిగిపోతున్నారని తెలిపారు. హైదరాబాద్‌లో వలస కార్మికులు కూడా పెరుగుతున్నారని వారికి కనీస సౌకర్యాలు కల్పించలేని దుస్థితి ఈ ప్రభుత్వ విధానాల వల్ల ఎదురవుతోందని తెలిపారు. కార్మికులు, కర్షకులు , విద్యార్థి యువజనులు, మహిళలు ఐక్య ఉద్యమాలు, పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.... 400 చరిత్ర గల హైదరాబాద్ పాత నగరంలో మతోన్మాదుల కారణంగా నిరుద్యోగం, విద్య, వైద్యం పూర్తిగా అందకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణాలతో సీపీఐ(ఎం) స్థానికుల సమస్యలపై ఉద్యమిస్తూ ముందుకెళ్లడం హర్షనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సౌత్ కమిటీ కార్యదర్శి మహ్మద్ అబ్బాస్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నరసింహారావు, ప్రభాకర్, హైదరాబాద్ నగర మాజీ కార్యదర్శి పీఎస్ఎన్ మూర్తి, ప్రస్తుత హైదరాబాద్ నగర కార్యదర్శి ఎం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా నాయకులు జి. విఠల్, పి. నాగేశ్వరరావు, శశికళ, లక్ష్మమ్మ, ఎల్.కోటయ్య, ఎం.మీనా, ఎం.శ్రావణ్ కుమార్, కిషన్, జంగయ్య, కృష్ణ పాల్గొన్నారు.

రాబోయే కాలంలో ప్రమాద ఘంటికలు

- సింగరేణి కనుమరుగైపోతే రాష్ట్ర భవిష్యత్ అగమ్యగోచరం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు టి.జ్యోతి
- ప్రారంభమైన సీపీఐ(ఎం) పెద్దపల్లి జిల్లా మూడవ మహాసభలు
- ఎన్టీపీసీ రెండవ నెంబర్ గేట్‌నుంచి భారీ ప్రదర్శన



నవతెలంగాణ - గోదావరిఖని

దేశ ప్రధాని, కేంద్ర మంత్రులు మాట్లాడుతున్న తీరును బట్టి చూస్తే దేశంలో రాబోయే కాలంలో ప్రమాద ఘంటికలు మోగనున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు టి.జ్యోతి అన్నారు. పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ ఏరియాలో సీపీఐ(ఎం) పెద్దపల్లి జిల్లా మూడవ మహాసభలు శనివారం ప్రారంభం అయ్యాయి. మహాసభలకు ముందు ఎన్టీపీసీ రామగుండం రెండవ నెంబర్ గేట్ నుంచి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన మహాసభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పి.జ్యోతి, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ మాట్లాడారు. మూడవసారి కేంద్రంలో అధికారంలోకి బీజేపీ వచ్చాక అణిచివేత, నిరంకుశ విధానాలతో పాలన కొనసాగుతున్నదని అన్నారు. సింగరేణి ప్రమాదకర పరిస్థితుల్లో ఉందని, కేంద్రంలో బీజేపీ మూడవ సారి అధికారంలోకి వచ్చాక బొగ్గు బ్లాక్‌లను వేలం వేస్తూ కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నదన్నారు. సింగరేణి కనుమరుగైపోతే రాష్ట్ర భవిష్యత్ ఆగమ్యగోచరం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి భవిష్యత్‌కు సీపీఐ(ఎం) కట్టుబడి పని చేస్తుందన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణకు నిధులు తేవడం మాని సింగరేణి బొగ్గు గనులను వేలం వేసే ప్రక్రియలో పాల్గొంటున్నారని, దీన్ని వ్యతిరేకించాల్సిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బొగ్గు గనుల వేలంకు వత్తాసు పాడుతూ వేలంలో పాల్గొన్నారన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి, కార్మిక హక్కులు లేకుండా కనీస వేతనాలు కూడా అమలు కాకుండా ప్రయత్నం చేస్తుందని, దాన్ని తీవ్రంగా సీపీఐ(ఎం) వ్యతిరేకిస్తోం దన్నారు. మతం పేరుతో మైనార్టీలపైన దాడులు చేస్తూ ప్రజలను విభజించి తన పదవిని కాపాడుకుంటుందన్నారు. విభిన్న జాతులు, మతాలు ప్రాంతాలు ఉన్న ఈ దేశంలో భిన్నత్వం లో ఏకత్వాన్ని పాటించాలని తప్ప ఏకపక్షంగా రుద్దితే సీపీఐ(ఎం) ఊరుకోదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పాలనలో ఆరు గ్యారెంటీలలో ఉచిత బస్సు ప్రయాణం తప్ప మిగతా ఏ గ్యారెంటీలు ఎవరికి అందుతున్నాయో తెలియని పరిస్థితి ఉందన్నారు. వాటి అమలుకు సీపీఐ(ఎం) పోరాటాలు చేస్తుందని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇండ్ల పట్టాలివ్వాలని, రూ.10లక్షలు ఇండ్ల నిర్మాణానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపైన పోరాటాలకు సిద్ధం చేయడానికి ఈ మహాసభల్లో ప్రణాళికలపై చర్చిస్తామని, తీర్మానాలు చేస్తామని తెలిపారు. ఈ మహాసభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎర్రవెల్లి ముత్యంరావు, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, ఐలుమహిళా విభాగం కన్వీనర్ చందాల శైలజ, అనుమల మహేశ్వరీ, వేల్పుల కుమారస్వామి, సీపీఐ(ఎం) జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు నాంసాని శంకర్, కోశాధికారి ఎస్.బిక్షపతి, నాగలక్ష్మి, కాదాసి మల్లేష్, తుంగపిండి మల్లేష్, మంచిర్యాల జిల్లా సీపీఐ(ఎం) పార్టీ కార్యదర్శి శంకరయ్య, మెండే శ్రీనివాస్, సీపీఐ(ఎం), సీఐటీయూ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఉప ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు

యూపీ, అసోం, రాజస్థాన్‌లో బీజేపీ...బెంగాల్‌లో తృణమూల్

- కర్నాటకలో పట్టు నిలుపుకున్న కాంగ్రెస్
- పంజాబ్‌లో సత్తా చాటిన ఆప్
- కేరళలోని చెలక్కరాలో సీపీఐ(ఎం) విజయం

న్యూఢిల్లీ : వివిధ రాష్ట్రాల శాసనసభలకు జరిగిన ఉప ఎన్నికలలో మిశ్రమ ఫలితాలు లభించాయి. మొత్తం 48 శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలు జరగగా బీజేపీ 20 స్థానాలలో గెలుపొందింది. కాంగ్రెస్ 7, తృణమూల్ కాంగ్రెస్ 6, ఆమ్‌ఆద్మీ 3, సమాజ్‌వాదీ పార్టీ 2 స్థానాలు గెలుచుకున్నాయి. అస్సాంలోని ఐదు స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించగా వాటిలో మూడింటిని బీజేపీ గెలుచుకుంది. ధోలాయ్, బెహాలీ, సామాగురి స్థానాలలో ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. సిడ్లీలో యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్, బొంగైగాన్‌లో అసోం గణ పరిషత్ అభ్యర్థులు గెలుపొందారు. బీహార్‌లోని నాలుగు స్థానాలకు ఉప ఎన్నికలు జరగగా వాటిలో తరారీ, రామ్‌ఘర్ స్థానాలను బీజేపీ గెలుచుకుంది. ఇమాంగంజ్‌లో హిందుస్థాన్ అవామ్ మోర్చ (సెక్యులర్), బెలగంజ్‌లో జనతాదళ్ (యునైటెడ్) గెలిచాయి.

ఛత్తీస్‌గఢ్‌లో రాయ్‌పూర్ సిటీ సౌత్ స్థానానికి ఉప ఎన్నిక జరగగా బీజేపీ గెలుపొందింది. గుజరాత్‌లోని వావ్ స్థానాన్ని కూడా బీజేపీయే గెలుచుకుంది. కర్నాటకలోని మూడు స్థానాలనూ కాంగ్రెస్ పార్టీ చేజిక్కించుకుంది. షిగ్గాన్, సందూర్, చెన్నపట్న స్థానాలు కాంగ్రెస్ ఖాతాలో చేరాయి. కేరళలో పాలక్కడ్ స్థానాన్ని కాంగ్రెస్, చెలక్కరా స్థానాన్ని సీపీఐ (ఎం) గెలుచుకున్నాయి. సీపీఐ (ఎం) అభ్యర్థి యూఆర్ ప్రదీప్ తన సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి రమ్య హరిదాస్‌ను 12,201 ఓట్ల మెజారిటీతో ఓడించారు. మధ్యప్రదేశ్‌లోని విజయపూర్‌లో కాంగ్రెస్, బుధ్నీలో బీజేపీ అభ్యర్థులు గెలిచారు. మేఘాలయలోని గంబెగ్రే స్థానంలో నేషనల్ పీపుల్స్ పార్టీ విజయం సాధించింది.



పంజాబ్‌లో నాలుగు స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. వీటిలో డేరాబాబా నానక్, ఛబ్బేవాల్, గిద్దర్‌బహా స్థానాలను ఆప్ కైవసం చేసుకుంది. బర్నాలాలో కాంగ్రెస్ గెలిచింది. రాజస్థాన్‌లోని ఏడు శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. వీటిలో ఝుంఝునూ, రామ్‌ఘర్, దియోలీ-యునియారా, ఖిన్వ్‌సార్, సాలంబర్, చోరాసీ స్థానాలలో బీజేపీ విజయం సాధించింది. దౌసాలో మాత్రం కాంగ్రెస్ గెలుపొందింది. సిక్కింలోని సొరెంగ్-ఛకుంగ్, నామ్చి-సింఘితాంగ్ స్థానాలలో సిక్కిం క్రాంతికారి మోర్చా గెలిచింది.

ఉత్తరప్రదేశ్‌లోని తొమ్మిది శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. వీటిలో ఆరు స్థానాలను...కుందర్కీ, ఘజియాబాద్, ఖయిర్, ఫుల్‌పూర్, కతేహరీ, మఝావన్...బీజేపీ గెలుచుకుంది. మీరాపూర్‌లో రాష్ట్రీయ లోక్‌దళ్, కార్‌హాల్, సిషామవూలో సమాజ్‌వాదీ పార్టీలు గెలుపొందాయి. పశ్చిమ బెంగాల్‌లోని ఆరు స్థానాలలోనూ తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించింది. సితాయ్, మదారిహాట్, నైహతి, హరోవా, మెదీనీపూర్, తాల్‌దాన్‌గ్రా స్థానాలు ఆ పార్టీ ఖాతాలో చేరాయి. ఉత్తరాఖండ్‌లో ఎన్నికలు జరిగిన కేదార్‌నాథ్ స్థానాన్ని బీజేపీ గెలుచుకుంది.

సీపీఐ(ఎం) భూపాలపల్లి జిల్లా కార్యదర్శిగా బందు సాయిలు

- నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-భూపాలపల్లి

సీపీఐ(ఎం) భూపాలపల్లి జిల్లా కార్యదర్శిగా బందు సాయిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కృష్ణ కాలనీలోని సింగరేణి ఫంక్షన్ హాల్‌లో ఈనెల 21, 22 తేదీల్లో సీపీఐ(ఎం) జిల్లా 3వ మహాసభ జరిగింది. ఈ మహాసభకు కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు జె.వెంకటేష్ హాజరయ్యారు. గత మూడు సంవత్సరాల కాలంలో నిర్వహించిన పోరాటాలపై సమీక్షించారు. భవిష్యత్ కార్యాచరణ రూపొందించారు.

నూతన కమిటీ

మహాసభలో కార్యదర్శిగా రెండోసారి బందు సాయిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా చెన్నూరి రమేష్, పొలం రాజేందర్, గుర్రం దేవేందర్ ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా వెలిశెట్టి రాజయ్య, ఆత్కూరి శ్రీకాంత్, సంగం ప్రీతి, రజనీకాంత్, సూదుల శంకర్, పోలం చిన్న రాజేందర్, కుంజం బుదారం, ఆకుదారి రమేష్, వంగాల విజయలక్ష్మి, గడప శేఖర్ ఎన్నికయ్యారు.



భావ విధ్వంసకులు

సాంస్కృతికపరమైన భిన్న ఆలోచనలను ధ్వంసం చేయటం నిరాటంకంగా కొనసాగుతోంది. ఇది భిన్నత్వంలో ఏకత్వ భారతీయ జీవన విధానానికి తీవ్ర విఘాతం. ఇవే సంస్థలు మన హైదరాబాద్‌లో 'లోక్ మంథన్' పేరిట అంతర్జాతీయ సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తున్నాయి. మన సంస్కృతీ సంప్రదాయాలను పునరుద్ధరిం చేందుకు, విశ్వ ఐక్యత ప్రాశస్త్యాన్ని ప్రతిపాదించేందుకు నిర్వహిస్తున్నామని చెబుతున్న వీరు దేశంలోని భిన్న ఆలో చనను వినేందుకే ఇష్టపడటం లేదు, అంటే సంఘ పరివారం చెప్పే విషయాలను అందరూ అంగీకరించాలనే ఆ రకంగా ఏకీకృత సాంస్కృతిక నియంతృత్వాన్ని అమలు చేయాలన్నది వారి ఆలోచన.

ప్రపంచంలోని అన్ని దిక్కుల నుండీ వచ్చే ఆలోచనలను ఆహ్వానించాలి అని ఉపనిషత్‌కారులు అంటారు. 'వందపుష్పాలు పుష్పించనీయండి, వేయి ఆలోచనలు తలెత్తనీయండి' అని ప్రసిద్ధ విప్లవకారుడు మావో అంటాడు. ఈ ప్రపంచం గురించి, సమాజ జీవనం గురించి ఆలోచన చేసిన చింతనాపరులందరూ విభిన్న ఆలోచనలను, అభిప్రాయాలను ఆహ్వానించిన వారే. వాదానికి, చర్చకు, పెట్టింది పేరు మన భారతీయ తాత్విక సంప్రదాయం. ఎదుటివారి ఆలోచనను, అభిప్రాయాన్ని విన్నప్పుడే, అందులోని మంచి చెడ్డలు తెలిసి వచ్చేది. అసలు వినటానికి, చూడటానికి సమ్మతించక అసహనంతో విధ్వంసానికి పాల్పడటం నియంతృత్వ చర్యే అవుతుంది. గతంలో రాజ్యాలూ రాజులు చేసిన పనే ఇది. కానీ ఇప్పుడు మనం ప్రజాస్వామిక వ్యవస్థలో ఉన్నాం. ప్రతిఒక్కరికీ తమ భావాలను వ్యక్తం చేసుకునే స్వేచ్ఛ, హక్కు ఉంటుంది. ఈవ్యవస్థలోనే స్వేచ్ఛను హరించడమంటే, వారి ఆలోచనలు, ఆచరణ ఎంత వెనక్కి మళ్లీ ఉన్నాయో అర్థమవుతుంది.

అలాంటి ఘటనే ఇటీవల రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో జరిగింది. ఈనెల 15 నుండి 17వరకు 9వ ఫిలిం ఫెస్టివల్‌ను, సినిమా ఆఫ్ రెసిస్టెన్స్, ఉదయపూర్ ఫిలిం సొసైటీవారు సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్స వాలను, ఇటీవల మరణించిన పౌరహక్కుల పోరాట నేత ప్రొఫెసర్ సాయిబాబా, ఇజ్రాయిల్ దాడుల్లో మరణించిన పాలస్తీనా పిల్లల స్మృతిలో వీటిని జరుపుతున్నారు. ఈ కారణంగా ఎక్కడలేని ఆవేశాన్ని విద్వేషాన్ని నింపుకున్న రాష్ట్రీయ స్వయం సేవకులు (ఆర్.ఎస్.ఎస్) ఉత్సవాన్ని అడ్డుకుని భావ విధ్వంసాన్ని కొనసాగించారు. స్థానిక రవీంద్ర నాథ్ వైద్య కళాశాలలో అన్ని అనుమతులు తీసుకుని నిర్వహిస్తున్న ఫిలిం ఫెస్టివల్‌పై దాడికి పాల్పడటం అత్యంత అరాచక చర్య. చనిపోయిన సాయిబాబా, ఇంకా వీళ్లను భయపెడుతూనే ఉన్నాడనడానికి ఇదో ఉదాహరణ. ఏ నేర రుజువులు లేకుండానే జైళ్లో నిర్బంధించి, అతని మరణానికి కారకులైన వారి వారసులు, అతని పేరు వింటేనే బెంబేలెత్తుతున్నారు.

ప్రపంచంలోని మానవీయులందరూ పాలస్తీనా విధ్వంసంలో పసిబాలల మరణాలపై తీవ్ర నిరసనను వ్యక్తం చేస్తున్నారు. పాలస్తీనా నరమేధం ఆపాలని ప్రపంచమంతా గొంతెత్తుతూ ఉంది. కానీ ఆ అమానవీయులకు స్పందన లేకపోగా, నరమేధాన్ని బలపరుస్తున్నారు. సాయిబాబాను ఉగ్రవాదిగా భావిస్తున్నారు. వీళ్లు, పాలస్తీనా ప్రజలు అంతమవ్వాలని కోరుకుంటున్నారు. అందుకే, వారి స్మృతిలో జరుగుతున్న చిత్రోత్సవాన్ని అడ్డుకున్నారు. ప్రజా స్వామిక వ్యవస్థలో భావప్రకటనా స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు. దాన్ని అడ్డుకోవటం ఫాసిస్టు లక్షణం. ఒక ప్రత్యామ్నాయ సినిమాను ప్రజలకు అందించాలనే ఆశయంతో ఏర్పాటు చేస్తున్న సినీ ఉత్సవాన్ని అడ్డుకోవటమే కాకుండా, దానికి సంబంధించిన ఫేస్‌బుక్ ప్రకటనలను కూడా నిలుపుదల చేశారు. అక్కడినుండి ఆ ఉత్సవాన్ని వేరే చోటికి తరలించారు. కానీ అల్లరి చేసిన మూకపై ఎలాంటి చర్యలూ అక్కడి అధికారులు తీసుకోలేకపోయారు.

సాంస్కృతికపరమైన భిన్న ఆలోచనలను ధ్వంసం చేయటం నిరాటంకంగా కొనసాగుతోంది. ఇది భిన్న త్వంలో ఏకత్వ భారతీయ జీవన విధానానికి తీవ్ర విఘాతం. ఇవే సంస్థలు మన హైదరాబాద్‌లో 'లోక్ మంథన్' పేరిట అంతర్జాతీయ సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తున్నాయి. మన సంస్కృతీ సంప్రదాయాలను పునరుద్ధరిం చేందుకు, విశ్వ ఐక్యత ప్రాశస్త్యాన్ని ప్రతిపాదించేందుకు నిర్వహిస్తున్నామని చెబుతున్న వీరు దేశంలోని భిన్న ఆలో చనను వినేందుకే ఇష్టపడటం లేదు, అంటే సంఘ పరివారం చెప్పే విషయాలను అందరూ అంగీకరించాలనే ఆ రకంగా ఏకీకృత సాంస్కృతిక నియంతృత్వాన్ని అమలు చేయాలన్నది వారి ఆలోచన. ఇక సంప్రదాయాలను సంస్కృతీ పునరుద్ధరణ అంటే మనువాద వర్ణవ్యవస్థ, అసమానతల, అనాగరిక ఆధిపత్య వ్యవస్థను కొత్తగా మళ్లీ నిర్మించు కోవడం. ఇదీ వీరి పథకం.

అందుకే వీరికి ప్రజాస్వామ్యమన్నా, ప్రగతిశీలమన్నా వెర్రెత్తుకొస్తుంది. భావ ప్రకటనా స్వేచ్ఛ అన్నా కూడా వీళ్లు సహించరు. అంబేద్కరు అందించిన రాజ్యాంగమంటే వీరికి కంటగింపు. ఆలోచనలను అణచివేయాలని వీరు చేసే ప్రయత్నం సఫలం కాదు. ఎందుకంటే అలా చేయాలని ప్రయత్నించిన నియంతలెందరో చరిత్ర కాలగర్భంలో కలిసిపోయారు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అడ్డుకోవాలని చేసే ప్రతిచర్యనూ ప్రజలు తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉంటారు. పైకి ప్రజాస్వామ్యమనే ముసుగువేసి, లోపల ఫాసిస్టు తరహా చర్యలకు పూనుకొంటున్న పగటి వేషాలను ప్రజలు పసిగట్టి ప్రతిఘటిస్తారు!

సంపాదకీయం

మోడీ నీడలో వేళ్లుతన్నిన అదానీ అవినీతి



తెలకపల్లి రవి

ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో భారతీయుల ప్రభ వెలిగిపోతోందనీ, విశ్వగురుగా అవతరించిందనీ సుప్రభాత గీతాలతో మేల్కొంటున్నాం. అవినీతిని, నల్లధనాన్ని తరిమికొట్టడమే లక్ష్యంగా మోడీజీ మహత్తర విజయాలు సాధించారనీ కీర్తిస్తున్నారు. అసలు అవినీతిపై ఇంతగా సమరం చేస్తున్నాను గనకే తనను ప్రత్యర్థులు వేటాడుతున్నారనీ ఆయన స్వయంగా ప్రజ్ఞలు పలకడమూ ఆలకించాం. తీరా ఇప్పుడు అంతర్జాతీయంగా ఆయన ఆప్తుడైన అదానీ(గౌతమ్) అవినీతి భాగోతం అమెరికాలో బయటపడినా ఆయన పరివారం పెదవి మెదపని, చిటికెన వేలు కదల్చని వైనం. ఇందుకు విస్తుపోతే అది వారి తప్పే గానీ మోడీ, అదానీల తప్పు ఎంత మాత్రం కాదు.ఎందుకంటే తమ ప్రాధాన్యతలూ, పద్ధతులూ వారెప్పుడూ దాచిపెట్టుకోలేదు. ఆరోపణలు, అవమానాలు, విమర్శలూ ఖాతరు చేసిందీ లేదు. ఆ మాటకొస్తే ఒక అటవిడుపుతో మళ్లీ అధ్యక్ష భవనంలోకి ప్రవేశించనున్న డోనాల్డ్ ట్రంప్ హౌడీ మోడీకి అమెరికాలో ఈ ఉదంతం బయటపడటం పెద్ద సవాలే కాదు.ఇప్పటికే చూడండి- అదానీ గ్రూపు అక్రమాలపై ఎలాంటి కథనాలు, విషయాలు వచ్చినా భారత అమెరికా సంబంధాలు (అంటే మోడీతో అనుబంధాలు) సుస్థిరంగానే వుంటాయని వైట్‌హౌస్ పత్రికా కార్యదర్శి కరీన్ జీన్ పియర్ ప్రకటించేశారు. ఈ సంక్షోభం సమిసిపోతుందని తాము నమ్ముతున్నామని ఆమె ఆశాభావం వెలిబుచ్చారు.ఇక ఇటు వైపున చూస్తే ఈ ఆరోపణలకు కేంద్ర బిందువుగా వున్న సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ) డైరెక్టర్ ఆర్‌సి గుప్తా మాట్లాడుతూ ఈ కుంభకోణంలో తమ సంస్థ పేరు ఎక్కడా రాలేదు గనక తాము స్పందించాల్సిందేమీ లేదని తేల్చేశారు.

జగన్ సరే, అదానీ ఊసేది?

ఈ సందర్భంగా తన హయాంలో రూ.1750 కోట్లు ముడుపులు తీసుకుంటున్నట్టు ఆరోపణలు ఎదు ర్కొంటున్న ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి, వైఎస్‌ఆర్‌పార్టీ నాయకులు తాము సెకీతో ఒప్పందం చేసుకున్నాము తప్ప అసలు తమకు అదానీకి ఎలాంటి ఒప్పందమే లేదు పొమ్మంటున్నారు. జగన్‌కూ ఆయన పార్టీకీ ప్రధాన శత్రువుగా ప్రస్తుత ముఖ్యమంత్రిగా వున్న నారా చంద్రబాబునాయుడు కూడా అందివచ్చిన అవకాశంగా దీన్ని ఉపయోగించుకుని అవసరమైన తీవ్ర చర్యలు ప్రారంభించకపోగా మరింత సమాచారం సేకరించి స్పందిస్తామంటున్నారు. అదైనా జగన్ గురించి తప్ప మోడీ, అదానీల పేరే ఎత్తడానికి నిరాకరిస్తున్నారు. దీనిపై సుదీర్ఘ సంచలనాత్మక కథనాలు ప్రచురించిన మీడియా సంస్థలు కూడా మోడీ అనుబంధాన్ని చల్లగా దాటేశాయి. అసలు మహారాష్ట్ర ఎన్నికల ముందు ఈ కుంభకోణం వస్తే భిన్నంగా వుండేదని చాలామంది అంటున్నారు గానీ అలా రాకపోవడం కూడా యాదృచ్ఛికం కాదు. గతంలో అదానీ కంపెనీలపై పరిశోధనాత్మక కథనాలు ఇచ్చిన పలువురు విలేకరులు, పత్రికలు, సైట్లు కూడా ఎన్ని సవాళ్లనెదుర్కొన్నదీ మర్చిపోలేము.ఇప్పుడు కూడా ఎన్‌డిటివి వంటి పలు మీడియా వేదికలు తాము అదానీ గ్రూపునకు సంబంధించిన సంస్థలమని కింద గమనిక తగిలించి మరీ అనుకూల వార్తలు ప్రచురించాయి. అదేమీ లేకుండానే రిపబ్లిక్ టీవీ వంటివి అదానీ పక్షం వహించాయి.

కేంద్ర రాష్ట్రాల రక్షణ

కేంద్రంలో పాలకపార్టీగా వున్న బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర ఈ కుంభకోణంలో బయటకొచ్చిన ఐదు రాష్ట్రాలు-ఏపీ, తమిళనాడు, ఒరిస్సా,ఛత్తీస్‌గఢ్, కాశ్మీర్ బీజేపీయేతర పార్టీల ఏలుబడిలో వున్నాయి గనక తమకు సంబంధమే లేదు పొమ్మంటున్నారు. మరి మీవి కానప్పుడు మరింత దూకుడుగా దర్యాప్తు జరిపించవచ్చు కదా.. తెల్లవారి లేస్తే ఈడి, సిబిఐ అంటూ హడావుడి చేసేవారు కన్నంలో దొంగలా దొరికిన అదానీ గ్రూపు అవినీతిని ఎందుకు విస్మరిస్తున్నట్టు? అదానీ గ్రూపు షేర్ల మాయాజాలం చేసినట్టు ఎన్నికల ముందు హిడెన్‌బర్గ్ నివేదిక వచ్చింది. దానిపై విచారణ జరిపించాలని ఎంతగా కోరినా, పార్లమెంటు స్తంభించిపోయినా మోడీ సర్కారులో చలనం రాలేదు. సుప్రీంకోర్టు కూడా 'సెబి'కి అప్పగించి వారి నివేదికతో సరిపెట్టింది. సెబీ ఛైర్‌పర్సన్‌గా వున్న మాధుబీపురి బుచ్ భర్తకు అదానీ కంపెనీలతో సంబంధాలున్నాయనీ,ఈ విషయాలు తెలిసినా తగుచర్యలు తీసుకోలేదని ఆరోపణలు వస్తే చాలా ఆలస్యంగా రాజీనామా చేయించారు. కానీ ఇప్పటికీ పూర్తి విచారణ జరిపి అన్నీ బయటపెట్టింది లేదు. ఈలోగా అన్నీ సర్దుబాటు చేసుకున్న అదానీ కంపెనీ వ్యాపారాలు వాటాల అమ్మకం మళ్లీ ఊపందుకున్నట్టు కథనాలు వచ్చాయంటే అంతా ఏలినవారి చలవే! తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈమధ్య కాలంలో అదానీ ఆయన ప్రతినిధులు పర్యటించి పలు చర్చలు జరిపి కొత్తగా ఒప్పందాలు చేసుకున్నారు. వాటి గురించి పాలకులు గొప్పగా చెప్పుకున్నారు కూడా. తెలంగాణలో స్కిల్ యూనివర్సిటీ స్థాపించేందుకు ఆయన రూ.వంద కోట్ల విరాళం ఇవ్వడం,తాను అదానీ జేబులోంచి డబ్బు రాబట్టగలిగానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గొప్పగా చెప్పుకోవడం చూశాం. ఏపీ మంత్రి లోకేశ్ కూడా విశాఖలో డేటా సెంటర్‌కు అదానీ ముందుకు రావడం ఉద్యోగాల కల్పనకు బాట వేస్తుందన్నారు. అంటే అదానీ ప్రభ కొనసాగుతూనే వున్నదని ఈ ఉదాహరణలన్నీ చెబుతాయి. ఇలాంటి నేపథ్యంలో అమెరికా న్యాయ విభాగం నుంచి ఈ లంచాల కథ రావడం సంచలనం అయినా,అది తమ ప్రత్యర్థులను ఇబ్బందిలో పెట్టేదైనా అంతకన్నా ఎక్కువగా తమ కూటమికే సవాలు గనక కావాలని కాలయాపన చేయడం ఊహించదగిందే.దీనిపై 'ప్రింట్' ఒక వ్యాసం ప్రచురిస్తూ చంద్రబాబుకు ఇది చాలా ఇబ్బందికరమైన అంశంగా పరిణమించిందని వ్యాఖ్యానించింది. జగన్ కూడా సగం ఎన్డీయే సన్నిహితుడు కావడం,మూల విరాట్టులైన అదానీ, మోడీల చుట్టూ ఈ కథ తిరగడం వల్ల ఏం చేస్తే ఏమవుతుందోనని తటపటాయించవలసిన స్థితిని వివరించింది.



అమెరికాలో 300 కోట్ల డాలర్ల నిధులు సేకరించిన అదానీ గ్రూపు తాను వ్యాపారం పెంచుకోవడానికి రూ.2వేల కోట్లు లంచంగా ఇచ్చాననేది దాచిపెట్టడం నేరం. న్యాయశాఖ అక్కడ నేరుగా కేసులు నమోదు చేయొచ్చు.తర్వాత అవి రెండు దశల్లో విచారణకు వెళతాయి.ఈ కేసు ఆ విధంగా వచ్చిందే. లంచాల నోట్సు కూడా విడుదల చేశారు, కానీ అందులో పేర్లు దాచిపెట్టారు.ఈ వ్యవహారంలో భాగస్వాములైన సాగర్ అదానీ వంటివారి ఫోన్ మెసేజ్‌ల నుంచి పూర్తి వివరాలు సేకరించారు.వీటిపై విచారణ దశలో ఒక పద్ధతి ప్రకారమైతే ఆ శాఖనే వారి వివరణ తీసుకుని మందలింపు లేదా జరిమానా, శిక్షణా చర్యలు, అరెస్టు వంటిది చేయొచ్చు. కొన్నిసార్లు కోర్టుల వరకూ వెళ్లొచ్చు కూడా. ఇప్పుడు నిర్దిష్టంగా ఏమి జరుగుతుందనేది చెప్పలేకున్నా వైట్‌హౌస్ భరోసా ఇస్తున్నది గనక ఎలాగో ముగించవచ్చు.

సెకీ ముసుగులో బుకీలు

ఇంతకూ అసలు కథలోకి వెళితే మామూలు మనుషుల ఊహకు కూడా అందని మలుపులతో నిండివుంది.పునర్వినియోగ ఇంధనాలు (రెన్యూయబుల్) పెంచాలనే ఆలోచన ఇప్పటిది కాదు. పవన,సౌర,బయో విద్యుత్తు ప్రాజెక్టులు కూడా వున్నాయి. అయితే వాటిని ప్రోత్సహించేందుకు సెకీని ఏర్పాటు చేశామని చెప్పినా అదానీకి రాచబాట అయింది. సౌరవిద్యుత్ అమ్మకం కోసం సెకీ ముందు ఒప్పందాలు చేసుకుంది. ఇవే లెటర్ ఆఫ్ అవార్డు(ఎల్‌వోఎ). దాంతో అమ్మకానికి సిద్ధమని వీరు బయలుదేరినా ఆ రేట్ల మోతకు ఎవరూ ముందుకు రాలేదు, రాష్ట్రాల ప్రభుత్వాలు వెనుకాడాయి. అప్పుడు ముందుకొచ్చింది ఏపీ ప్రభుత్వం.(మరినాలుగు ప్రభుత్వాలు కూడా) అధిక రేట్లకు డిస్కమ్‌లతో సెకీకి పవర్ సేల్స్ అగ్రిమెంట్స్(పిఎస్ఎ) చేయించింది. తర్వాత అదానీ, అజూర్ కంపెనీలు సెకీతో అధిక రేట్లకే పవర్ పర్చేజ్ అగ్రిమెంట్స్(పిపిఎ)లు చేసుకున్నాయి. సెకితో ఒప్పందాలు అంటున్నా నిజానికి దానిద్వారా పిఎస్ఎలు, పిపిఎలను కలగలిపి వేల కోట్ల రూపాయలు పిండుకోవడం ఇక్కడ పథకం. అదానీ పవర్ కార్పొరేషన్ ఆ క్రమంలోనే సౌర విద్యుత్ పథకాలు చేజిక్కించుకుంది. అంతకుముందు పిఎస్ఎలు పొందినా లంచాలు ఇవ్వలేక చతికిలబడిన అజూర్ పవర్ కంపెనీని కూడా తనతో కలుపుకుంది. రూ.2వేల కోట్లు ముడుపులు ఇవ్వడం లేదా ఇస్తానని ఆఫర్ చేయడం ఇందుకోసమే. నెంబర్‌వన్ తో సహా ఏపీ ఉన్నతాధికారులకు ఇచ్చినట్టు ఇందులో పేర్కొన్నా పేర్లు ఇవ్వలేదు. నెంబర్‌వన్ ముఖ్యమంత్రి మాత్రమే గనక 2019-2024 మధ్య వున్నది ఆయనే కాబట్టి ఆ సమయంలోనే ఈ ముడుపులు ముచ్చట జరిగివుందనేది ఇక్కడ అంచనా. వైసీపీతో సహా మిగిలిన నాలుగు రాష్ట్రాల ప్రతినిధులైన డిఎంకె, బీజేడీ నాయకులు తాము సెకీతో ఒప్పందం చేసుకున్నాము గనక ఈ ఆరోపణలతో సంబంధమే లేదని వాదిస్తున్నారు. కాశ్మీర్‌లో అప్పుడు రాష్ట్రపతి (గవర్నర్)పాలన నడుస్తున్నది.

కేంద్రంలో పాలకపార్టీగా వున్న బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర ఈ కుంభకోణంలో బయటకొచ్చిన ఐదు రాష్ట్రాలు-ఏపీ, తమిళనాడు,ఒరిస్సా,ఛత్తీస్‌గఢ్, కాశ్మీర్ బీజేపీయేతర పార్టీల ఏలుబడిలో వున్నాయి గనక తమకు సంబంధమే లేదు పొమ్మంటున్నారు. మరి మీవి కానప్పుడు మరింత దూకుడుగా దర్యాప్తు జరిపించవచ్చు కదా.. తెల్లవారి లేస్తే ఈడి, సిబిఐ అంటూ హడావుడి చేసేవారు కన్నంలో దొంగలా దొరికిన అదానీ గ్రూపు అవినీతిని ఎందుకు విస్మరిస్తున్నట్టు? అదానీ గ్రూపు షేర్ల మాయాజాలం చేసినట్టు ఎన్నికల ముందు హిడెన్‌బర్గ్ నివేదిక వచ్చింది. దానిపై విచారణ జరిపించాలని ఎంతగా కోరినా, పార్లమెంటు స్తంభించిపోయినా మోడీ సర్కారులో చలనం రాలేదు.

అయితే అదానీ ఎనర్జీ,అజూర్ ఈ రెండు కంపెనీలు అమెరికాలో నమోదై వున్నాయి.ఆ దేశ చట్టాల ప్రకారం అక్కడ వ్యాపారం చేసే కార్పొరేట్ కంపెనీలు మరో దేశంలో లంచాలు ఇచ్చినా శిక్షార్హమే. ఈ ప్రకారం అమెరికాలో 300 కోట్ల డాలర్ల నిధులు సేకరించిన అదానీ గ్రూపు తాను వ్యాపారం పెంచుకోవడానికి రూ.2వేల కోట్లు లంచంగా ఇచ్చాననేది దాచిపెట్టడం నేరం. న్యాయశాఖ అక్కడ నేరుగా కేసులు నమోదు చేయొచ్చు.తర్వాత అవి రెండు దశల్లో విచారణకు వెళతాయి.ఈ కేసు ఆ విధంగా వచ్చిందే. లంచాల నోట్సు కూడా విడుదల చేశారు, కానీ అందులో పేర్లు దాచిపెట్టారు.ఈ వ్యవహారంలో భాగస్వాములైన సాగర్ అదానీ వంటివారి ఫోన్ మెసేజ్‌ల నుంచి పూర్తి వివరాలు సేకరించారు.వీటిపై విచారణ దశలో ఒక పద్ధతి ప్రకారమైతే ఆ శాఖనే వారి వివరణ తీసుకుని మందలింపు లేదా జరిమానా, శిక్షణా చర్యలు, అరెస్టు వంటిది చేయొచ్చు. కొన్నిసార్లు కోర్టుల వరకూ వెళ్లొచ్చు కూడా. ఇప్పుడు నిర్దిష్టంగా ఏమి జరుగుతుందనేది చెప్పలేకున్నా వైట్‌హౌస్ భరోసా ఇస్తున్నది గనక ఎలాగో ముగించవచ్చు. దేశంలో అవినీతి జరిగితే మీరు అమెరికాలో విడుదల చేయ డం మా సార్వభౌమత్వానికి భంగకరమని మాజీ విదేశాంగ కార్యదర్శి కన్వల్ సిబాల్ ఆగ్రహం వెలిబుచ్చడం గమనించదగింది.

చిన్నదేశాలు చెప్పే పాఠం

గతంలో అదానీ అక్రమంగా రుణాలు సేకరించిందనీ, షేర్ల మాయాజాలం చేసిందనీ ఆరోపణలు వచ్చినపుడు కూడా ఇలాంటి వాదనలతోనూ సాంకేతిక సమర్థనలతోనూ సరిపెట్టారు. ఇప్పుడు ఈ వాదనలన్నీ కూడా అటే నడుస్తున్నట్టు కనిపిస్తుంది. దానివల్ల కూడా దేశానికి నష్టమే, ఎందుకంటే తప్పు చేసిన వాళ్ల పేర్లు బయటపెట్టకుండా కప్పిపుచ్చడమంటే బ్లాక్‌మెయిల్ చేయడానికి అవకాశం.తద్వారా మన ప్రయోజనాలు బలిపెట్టి తమ స్వార్థం సాగించుకోవడం జరగొచ్చు.కనుకనే దీన్ని ఇంతటితో వదలిపెట్టడం ప్రమాదకరం. సమగ్రమైన దర్యాప్తు జరిపి దోషులను శిక్షించడంతో పాటు వ్యవస్థలో లొసుగులు చక్కదిద్దడం అవసరం. ఏపీ వరకూ చూస్తే అదానీలతో ఒప్పందాలను రద్దు చేసుకోవడం, అవినీతి ఎలా జరిగిందో తెలుసుకోవడం కీలకం. వారికి కట్టబెట్టిన వేల ఎకరాలు ,రేవులు, విమానాశ్రయ కాంట్రాక్టులు ఉపసంహరించాలి.సాంకేతిక వివరాలు, సాక్ష్యాధారాలు లేవనే పేరుతో కళ్లముందు కనిపించే ఈ భాగోతాలను కూడా కప్పిపుచ్చడం దారుణం. శ్రీలంక, కెనడా, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ వంటి దేశాల ప్రభుత్వాలు అదానీ ఒప్పందాలు రద్దు చేయడం, తనిఖీ చేయడం చూస్తున్నాం గానీ స్వదేశంలో మాత్రం ఆయన అక్రమాలు నల్లేరుమీద బండిలా నడిచిపోతున్నాయి, అయితే మోడీ సర్కారు కూడా ఎల్లకాలం అవినీతి కొండచిలువలను కాపాడలేదనేది స్పష్టం. ■

ఊరించి... ఉసూరుమనిపించి!

పదేండ్ల గులాబీ పాలనలో జర్నలిస్టుల ఇంటి స్థలాల పరిస్థితి 'వస్తా కూసుండు' అన్నట్టు ఉండేది. ఇండ్ల స్థలాల కోసం ఎదురు చూసిచూసి కండ్లు కాయలు కాశాయి. కొన్ని ప్రాణాలు కూడా పోయాయి. కొంతమంది ఆశ వదిలేసుకున్నారు. మరికొంతమంది ఈ సర్కారు ఇవ్వదని ఛీకొట్టారు. అయినా కొంతమంది ఉత్సాహవంతులు 'మూడోసారి కూడా బీఆర్ఎస్ వస్తుంది...ఇండ్లస్థలాలు ఇస్తుంది' అని నమ్మించే ప్రయత్నం చేసి బొక్కబొర్లా పడ్డారు. ఆ పార్టీ ఓడిపోయింది. ఇంకేముంది, అంతా అయిపాయే.. ఆ చర్చ ఇప్పుడెందుకంటారా? కొన్ని సందర్భాల్లో గతాన్ని గుర్తుచేస్తే తప్ప అసలు ముచ్చట బయటకురాదు. అందుకే ఒక్కసారి జర్నలిస్టులకు గుర్తుచేస్తున్నా.. ఇటీవల రవీంద్ర భారతిలో జేఎస్‌జే సభ్యులకు భూమి హక్కులు పత్రాలిచ్చే సందర్భంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలు పదేండ్లుగా జర్నలిస్టులు పడుతున్న బాధలు, ఆవేదనలు ఒక్కసారిగా మనస్సును తేలికచేశాయి. 'ఫ్యూచర్‌సిటీలో జర్నలిస్టులకు ఇండ్లస్థలాలిస్తాం....ఆ బాధ్యతను ఇద్దరు శీనన్నలకు అప్పగించాం.' అనడంతో మనసులు పడిలేచిన కెరటాల్లా ఎగిసిపడ్డాయి. ఇగ అప్పటినుంచి జర్నలిస్టులకు మంచిరోజులు వచ్చాయనుకుని అందరూ భావించారు. కానీ, అస్సలు కత ఇప్పుడే మొదలైంది. ఖైరతాబాద్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో సీఎం మాట్లాడుతూ రెండోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే జర్నలిస్టులకు ఇండ్లస్థలాలిస్తామని పెద్దబాంబు పేల్చారు. ఆయన మాటలు అక్కడున్న వారినే కాదు, రాష్ట్రంలోని జర్నలిస్టులందరి మనసులను అతలాకుతలం చేశాయి. కొత్త ముఖ్యమంత్రి ఇండ్ల స్థలాల విషయంలో జర్నలిస్టులకు 'నమ్మకాన్ని పెంచారు... వెంటనే బాధ పెట్టారు' ఎందుకబ్బా? అని చర్చించుకుంటున్నారు. ఇదే విషయాన్ని ఢిల్లీ జర్నలిస్టులు సీఎం దృష్టికి తీసుకెళ్లగా... 'గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు మాత్రమే ఇండ్ల స్థలాలి చ్చాయి. ఇప్పుడు కూడా మా ప్రభుత్వమే ఇస్తుంది. ఆ బాధ్యతను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, ప్రెస్ అకాడమీ ఛైర్మెన్ కె.శ్రీనివాసరెడ్డికి అప్పగించాం. వారి ఆ పనిలో నిమగ్నమ య్యారు. కచ్చితంగా ఇచ్చినమాట ప్రకారం ఫ్యూచర్ సిటీలో ఇండ్ల స్థలాలిస్తాం' అని సీఎం మరోసారి ఆయన వాక్‌చాతుర్యాన్ని ప్రదర్శించారు. ఆయన మాటల్ని నమ్మాలో..నమ్మకూడదో అని అసహనంగా చర్చించుకోవడం జర్నలిస్టుల వంతైంది.

- గుడిగ రఘు

వదలనంటే వదల...

'వదల బొమ్మాళీ వదల'... అంటూ అరుంధతి సినిమాలో విలన్ సోనూసూద్ అరిచిన అరుపులు మనందర్నీ భయకంపితులు చేశాయి. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల తర్వాత ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే... సోనూసూద్ స్థాయిలో కాకపోయినా కాస్త గట్టిగానే పొలికేక పెట్టారు. ఆ రాష్ట్రంలో 'మహాయుతి' కూటమి విజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే కూటమి తరఫున బీజేపీ అత్యధిక స్థానాలు దక్కించుకున్న దరిమిలా, ఇప్పటివరకూ శివసేన తరఫున సీఎం పీఠం మీద కూర్చున్న ఆయన ఇప్పుడు కక్కలేక మింగలేక ఉన్నారు. కూటమిలో ఎక్కువ స్థానాలు సంపాదించిన కమలం పార్టీ... ఇప్పటికే ముఖ్యమంత్రి స్థానంపై కన్నేసి, తమ తరఫున ఎవర్ని సీఎం చేయాలనే అంశంపై సమాలోచనలు చేస్తోంది. ఈ క్రమంలోనే షిండే గాండ్రించారు. 'ఎవరెన్ని చెప్పినా, ఎవరేం చేసినా, మేమే సీఎం పదవిని చేపట్టబోతున్నాం, శివసేనకు చెందిన వ్యక్తే ముఖ్యమంత్రిగా ఉంటారు...' అంటూ బీజేపీపై బాంబు పేల్చారు. తద్వారా తాను ముఖ్యమంత్రి పదవిని వదిలే ప్రసక్తే లేదంటూ తేల్చి చెప్పారు. ఆయన చేసిన ఈ కామెంట్లు ఇప్పటికిప్పుడే కూటమిని ఇబ్బంది పెట్టలేవుగానీ, మున్ముందు ఎలా పరిస్థితి ఎలా ఉంటుందో చూడాలంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

-బి.వి.యన్.పద్మరాజు

అదానీ - ఆదర్శం



నజర్



"ఏవండీ నానిగాడికి 12 వేల రూ. కావాలంట'! భోజనం వడ్డిస్తూ అన్నది లక్ష్మి.

ఆనందంగా భోజనం చేస్తున్న ప్రకాష్‌కి పొలమారింది.నీళ్ల కోసం సైగ చేశాడు. భార్య అందించిన నీళ్లు తాగి కొంచెంసేపు స్థిమిత పడ్డాడు!

"పన్నెండు వేలు కావాలని భోజనం టైములో చెబుతావా ఆ..య్!" అని కసురుకోబోయాడు ప్రకాష్, కానీ మళ్లీ పొలమారింది. ఈ సారి మోతాదు ఎక్కువైంది. భర్త అడగకుండానే నీళ్లు తాపి, గుండెల మీద చేత్తో రాసింది. అప్పుడు కుదుటపడ్డాడు.

"మీ కొడుకు ఏదైనా కావాలంటే, భోజనం టైములోనే చెప్పమన్నారు కదా'! అన్నది లక్ష్మి చిరుకోపంతో.

"చాల్చాల్లే! ఏడోతరగతి చదువుతున్న బుడ్డ వెధవకి పన్నెండు వేలు ఎందుకు? ఆ ఫీజు, ఈ ఫీజులంటూ ఇప్పటికీ ఆ ప్రయివేటు స్కూలుకి మూడు లక్షల రూ॥ నా రెక్కల కష్టం ధారబోశాను కదే! ఇంకా ఎక్కడి నుండి తెచ్చేది? అయినా అంత డబ్బు ఎందుకు? ఎక్స్‌కర్షన్ ఏమైనా బోతున్నారా? నాని గాడికైతే ఇస్తాను! కాని వాడి చెల్లెలు అంటే నీ సుపుత్రికకి మాత్రం ఇవ్వను? నీవు కూడా దాచిపెట్టిన డబ్బులు, నీ బిడ్డకు దోచిపెట్టకు"! అన్నాడు ప్రకాష్ ఖరాఖండిగా!

"అబ్బా! ఆడపిల్లలంటే ఎంత చులకన! నా బిడ్డకేమీ అవసరం లేదు గానీ, మీ సుపుత్రుడు పన్నెండు వేలు ఎందుకడిగాడో తెలుసా?" అన్నది లక్ష్మి.

"నీవు చెప్పందే నాకెలా తెలుస్తుంది?" అంటూ లేచాడు ప్రకాష్.

"మార్కులు ఎక్కువగా రావడానికి పేపర్ లీక్ చేయించడం కోసం ఎవరికో లంచం ఇస్తాడంట"! అన్నది లక్ష్మి.

ఈసారి కండ్లు తిరిగి కింద పడబోయి భార్య ఆసరాతో నిలదొక్కుకున్నాడు.

"ఏం మాట్లాడుతున్నావే?" అన్నాడు ప్రకాష్ అయోమయంగా.

"లంచం ఇవ్వటానికి పన్నెండు వేల రూపాయలు అడిగాడు. మీ నాన్న దగ్గర అన్ని డబ్బులు లేవు! అన్నాను. అప్పు తెచ్చి ఇవ్వమన్నాడు." అన్నది లక్ష్మి.

"అంతమాటన్నాడా" ఎక్కడ వాడు?" అన్నాడు ప్రకాష్ కోపంగా.

ఇంతలో నానిగాడు వచ్చాడు.

కొడుకును చూడగానే ప్రకాష్‌కి కోపం కట్టలు తెంచుకున్నది. ఒక్క ఉదుటన వెళ్లి కొడుకు గొంతు పట్టుకున్నాడు.

"చంపేస్తాను వెధవా? మార్కుల కోసం లంచం ఇస్తావా?" అంటూ కొట్టబోయాడు, లక్ష్మి వెళ్లి కొడుకును విడిపించింది!

"చదువుకుని మార్కులు సంపాదించుకోవాలి గాని లంచమిచ్చి పేపర్ లీక్ చేయించడం ఏమిట్రా? అసలు ఇదెక్కడి ఆలోచన? ఎవరిని చూసి నేర్చుకున్నావురా?" అన్నాడు ఆగ్రహంతో ప్రకాష్.

"ఆదానీని చూసి నేర్చుకున్నాను!" అన్నాడు నానిగాడు కాలర్ సరిచేసుకుంటూ.

భార్యాభర్తలు ఇద్దరూ షాక్ తిన్నారు!

"ఏం మాట్లాడుతున్నావ్ రా? నరాలు కట్ అయిపోయినయి!" అన్నాడు ప్రకాష్, సినిమాలో పోసాని కృష్ణలా.

"అవును! కరెంటు అమ్మటానికి రెండు వేల కోట్ల రూపాయలు ఆఫీసర్లకి ఆదానీ లంచం ఇచ్చాడని, టీవీల్లో, పేపర్లలో, మా స్కూలు వాట్సప్ గ్రూపులో కూడా వచ్చింది! నాకు మార్కులు తక్కువ వస్తున్నాయని ఎప్పుడూ నువ్ తిడుతుంటావు కదా డాడీ!" అన్నాడు నానిగాడు.

"ఏంట్రా నీవు మాట్లాడేది! నీకు, ఆదానీకి సంబంధం ఏమిటీ?" అన్నది లక్ష్మి కోపంగా.

"మమ్మీ నీకేమీ తెలియదు! ఆదానీలు, అంబానీలు ఎంతో గొప్పవారనీ, వారి వల్లే దేశం అభివృద్ధి చెందుతుందని, వారిని చూసి నేర్చుకోవాలనీ డాడీ ఎప్పుడూ చెబుతుండేవాడు నీకు గుర్తుందా?" అడిగాడు నానిగాడు.

"వేలెడంత లేవు! వెధవా! ఆదానీ, అంబానీలు ఎక్కడా? నీవెక్కడా? నక్కకూ, నాగలోకానికి ఏమైనా సంబంధం ఉందా?" అంటూ మళ్లీ నానిగాడిని కొట్టబోయాడు.

"డాడీ నీవు చెప్పిందే ఫాలో అవుతున్నాను! నా మీద చేయి వేస్తే బాగుండదు!" అన్నాడు. నానిగాడు తల్లి వెనక దాక్కుని.

"అంతా నీ వల్లే!" అని లక్ష్మి మీద గయ్‌మన్నాడు ప్రకాష్.

"డాడీ! ఇందాకే చెప్పాను కదా! నీవు చెప్పిందే ఫాలో అవుతున్నానని, అయినా మమ్మీని ఎందుకు తిడతావు? నాకు భగత్‌సింగ్, నేతాజీ, రంతిదేవుడు, సత్యహరిశ్చంద్రుడు లాంటి వాళ్ల కథలను మమ్మీ చెబుతుంటే, అలాంటి పాత చింతకాయ కథలు ఎందుకు చెబుతున్నావని మమ్మీని నీవే తిట్టావు గుర్తుందా?" అడిగాడు నానిగాడు.

"అయితే ఏంటి?" అన్నాడు ప్రకాష్.

"భగత్‌సింగ్ లాంటి వాళ్ల కథలు వినటం మానేసే, నీవు చేప్పే ధీరుభాయి అంబానీ, ముఖేష్ అంబానీ, గౌతం ఆదానీ లాంటి వాళ్లవి విన్నాను. నాలాంటి వాళ్లు అంబానీ, ఆదానీలను చూసి నేర్చుకోవాలని, వాళ్లలాగా తయారు కావాలని నీవు చెప్పావు. అంతే కాదు, మోడీ తాత, అంబానీ, ఆదానీలతో ఉన్న ఫొటోలు కూడా చూపించావు! ఆదానీ, అంబానీలు ఎంతో గొప్పవారని, వారు ఈ దేశ ప్రజలకోసం ఎంతో సంపద సృష్టిస్తున్నారని, ఎంతోమందికి ఉద్యోగాలిచ్చి దేశానికి మేలు చేస్తున్నారని మోడీ తాత కూడా అన్నారు. నేను కూడా సంపద సృష్టించాలని, అందుకోసం ముందుగా ఎక్కువ మార్కులు సంపాదించాలని అనుకున్నాను. అందుకే ఆదానీ ఇచ్చినట్లే నేను కూడా లంచం ఇవ్వటానికి పన్నెండు వేలే అడిగాను. డబ్బులు ఇవ్వు డాడీ!" అన్నాడు నానిగాడు.

కండ్లుతిరిగి పడిపోయాడు ప్రకాష్!

- ఉషాకిరణ్

"భగత్‌సింగ్ లాంటి వాళ్ల కథలు వినటం మానేసే, నీవు చేప్పే ధీరుభాయి అంబానీ, ముఖేష్ అంబానీ, గౌతం ఆదానీ లాంటి వాళ్లవి విన్నాను. నాలాంటి వాళ్లు అంబానీ, ఆదానీలను చూసి నేర్చుకోవాలని, వాళ్లలాగా తయారు కావాలని నీవు చెప్పావు. అంతే కాదు, మోడీ తాత, అంబానీ, ఆదానీలతో ఉన్న ఫొటోలు కూడా చూపించావు! ఆదానీ, అంబానీలు ఎంతో గొప్పవారని, వారు ఈ దేశ ప్రజలకోసం ఎంతో సంపద సృష్టిస్తున్నారని, ఎంతోమందికి ఉద్యోగాలిచ్చి దేశానికి ఎంతో మేలు చేస్తున్నారని మోడీ తాత కూడా అన్నారు. అందుకే నేను కూడా సంపద సృష్టించాలని, అందుకోసం ముందుగా ఎక్కువ మార్కులు సంపాదించాలని అనుకున్నాను. అందుకే ఆదానీ ఇచ్చినట్లే నేను కూడా లంచం ఇవ్వటానికి పన్నెండు వేలే అడిగాను. డబ్బులు ఇవ్వు డాడీ!"

బిజినెస్

ఎలన్‌మస్క్‌కు ట్రంప్ దన్ను



- టెస్లా షేర్లు 40 శాతం వృద్ధి

వాషింగ్టన్ : అమెరికా ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయంతో మస్క్ సంపద రాకెట్‌లా దూసుకెళ్తోంది. ఎన్నికల రోజు నుంచి టెస్లా స్టాక్ 40 శాతం పెరిగింది. శుక్రవారం ఒక్క సెషన్‌లోనే 3.8 శాతం లాభపడింది. దీంతో మస్క్ సంపద 320 బిలియన్ డాలర్ల మార్క్‌ను దాటేసింది. ప్రస్తుతం ఆయన 334.3 బిలియన్ డాలర్ల నికర సంపదతో ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడిగా ఉన్నారు. ట్రంప్ తన కార్యవర్గంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ (డోజ్) సంయుక్త సారథులుగా మస్క్, వివేక్ రామస్వామిలను నియమించారు. దీంతో మస్క్ షేర్లు దూసుకుపోతున్నాయి.

జెఫ్ బెజోస్‌పై ఆరోపణలు

ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్‌పై ఎలన్ మస్క్ పలు ఆరోపణలు చేశారు. డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోతారని జెబోస్ ఊహించారని.. దాంతో టెస్లా, స్పేస్‌ఎక్స్ షేర్లు విక్రయించాలని ఆయన ప్రజలకు సూచించారన్నారు. కాగా.. మస్క్ చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి నిజాం లేదని బ్లూ ఆరిజన్ చైర్మన్ బెజోస్ పేర్కొన్నారు.

నాలుగేండ్లలో 39 శాతం పెరిగిన నిర్మాణ వ్యయాలు

న్యూఢిల్లీ : గడిచిన నాలుగేండ్లలో నిర్మాణ వ్యయాలు భారీగా పెరిగాయ నిరియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ కొలియర్స్ ఇండియా ఓ నివేదికలో తెలిపింది. నివాస ప్రాజెక్టులకు సంబంధించిన సగటు నిర్మాణ వ్యయం 39 శాతం పెరిగిందని వెల్లడించింది. 2024 అక్టోబర్‌లో నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు రూ.2,780కి చేరిందని పేర్కొంది. 15 అంతస్తుల గ్రేడ్ ఏ నివాస భవనానికి ఇది సగటు ఖర్చని తెలిపింది. ముఖ్యంగా భవన నిర్మాణ సామగ్రి, నైపుణ్యం గల మానవ వనరుల వ్యయం పెరిగినట్లు పేర్కొంది.

ఐఐటీ బాంబేతో సామ్‌సంగ్ ఆర్‌అండ్‌డీ ఒప్పందం

న్యూఢిల్లీ: డిజిటల్ హెల్త్, ఎఐ ఇతర నూతన సాంకేతికతలపై పరిశోధనలకు గాను సామ్‌సంగ్ అర్‌అండ్‌డి ఇన్‌స్టిట్యూట్ నోయిడా తాజాగా బాంబే ఐఐటితో కీలక ఒప్పందం కుదర్చుకున్నట్లు పేర్కొంది. అత్యాధునిక పరిశోధనలను నిర్వహించడం, డిజిటల్ ఆరోగ్యం, కృత్రిమ మేధస్సులో తదుపరి తరం సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి గాను ఐఐటి బాంబేతో ఐదేళ్ల కాలానికి గాను భాగస్వామ్యం చేసుకున్నట్లు వెల్లడించింది. ఇది విద్యార్థులకు ఆచరణాత్మక అనుభవం, భవిష్యత్తులో సాంకేతిక సవాళ్లను ఎదుర్కోవటానికి దోహదం చేయనుందని తెలిపింది.

క్వాలిజీల్ ' క్యుమెంటిస్ ఎఐ' ఆవిష్కరణ

హైదరాబాద్ : క్వాలిటీ ఇంజినీరింగ్ (క్యుఇ)లో గ్లోబల్ లీడర్‌గా ఉన్న క్వాలిజీల్ ఇటీవల క్యుఇ కాంక్లేవ్ 2024 2వ ఎడిషన్‌ను నిర్వహించినట్లు తెలిపింది. ఎఐ శక్తితో కూడిన క్వాలిటీ ఇంజనీరింగ్ టూల్ క్యుమెంటిస్ ఎఐని ఆవిష్కరించినట్లు పేర్కొంది. "ఏఐ - పవర్డ్ క్వాలిటీ ఇంజనీరింగ్: విజన్ ఫర్ 2025: అంతకు మించి" అనే నేపథ్యంతో నిర్వహించిన ఈ సదస్సుకు 600 మంది పైగా పరిశ్రమల నిపుణులు పాల్గొన్నట్లు పేర్కొంది. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగంలో రాణించడానికి తాజా పరిజ్ఞానం, వ్యూహాలు, ఆచరణాత్మక సాధనాలతో క్యుఇ నిపుణులను శక్తివంతం చేయడానికి ఇందులో చర్చలు జరిగాయని క్వాలిజీల్ కో-ఫౌండర్ అండ్ హెడ్ ఆఫ్ ఇండియా ఆపరేషన్స్ మధు మూర్తి రోనాంకి తెలిపారు.

డిజిటల్ అరెస్ట్ స్కామ్ నుంచి ఎస్‌బీఐ రక్షణ

- చంద్రాయణగుట్ట సిబ్బంది చొరవ

నవ తెలంగాణ - హైదరాబాద్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తమ మరో ఖాతాదారున్ని డిజిటల్ అరెస్ట్ నుంచి కాపాడగలిగింది. హైదరాబాద్ చంద్రాయణగుట్ట శాఖలోని సిబ్బంది చాకచక్యంగా ఖాతాదారుడి రూ.46 లక్షలను సైబర్ మోసం నుంచి రక్షించింది. ఎస్‌బీఐ లోకల్ హెడ్ ఆఫీసు హైదరాబాద్ మార్కెటింగ్, కమ్యూనికేషన్స్ ఎజిఎం జి రామక్రిష్ణ వెల్లడించిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఓ ప్రభుత్వ రంగ సంస్థలో విరమణ పొందిన తమ ఖాతాదారుడు, ఆయన సతీమణి ఆర్‌టీజీఎస్ ద్వారా రూ.46 లక్షల బదిలీ కోసం వచ్చారు. వారి ఆందోళన తీరును గమనించిన సీనియర్ అసోసియేట్ బి ప్రవీణ్ తక్షణమే స్పందించి బ్రాంచ్ హెడ్ శివ కుమార్ వద్దకు తీసుకెళ్లారు. సిబిఐ వాళ్ల పేరుతో తమ కొడుకును రూ.100 కోట్ల ఓ కుంభకోణంలో అరెస్ట్ చేశారని.. ఆయన్ను విడుదల చేయడానికి నగదు డిమాండ్ చేశారని ఆ దంపతులిద్దరు మేనేజర్‌తో వాపోయారు. మూడు రోజులుగా వీడియో కాల్స్‌లో వారిని సైబర్ క్రిమినల్స్ వేదించారు. ఔరంగబాద్‌లోని ఓ ఐసిఐసిఐ బ్యాంక్ ఖాతా మిజాని ఎలక్ట్రాటెక్‌కు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో వారు బ్యాంక్ శాఖకు రావడం వారి.. ఆందోళన గమనించిన సిబ్బంది భారీ స్కామ్ నుంచి తప్పించుకునేలా చేశారు. తమ కుమారిడితో ఫోన్లో మాట్లాడించడంతో పాటుగా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కి ఫిర్యాదు చేయించారు. దీంతో ఆ దంపతులిద్దరు బ్యాంక్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఇదే తరహాలో ఇటీవల మహబూబ్‌నగర్ క్లాక్ టవర్ శాఖలోని సిబ్బంది ఓ ఖాతాదారున్ని రూ.4.20 లక్షల సైబర్ మోసం నుంచి కాపాడగలిగారు.

హైదరాబాద్‌లో 'స్టెల్లార్ రిజర్వ్' కేఫ్ ఏర్పాటు

- దేశంలోనే తొలి నైట్రో కాఫీ బార్

నవ తెలంగాణ - హైదరాబాద్

దేశంలోనే తొలిసారి హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో నైట్రో కాఫీ బార్ అండ్ ఫైన్ డైనింగ్ అయినా స్టెల్లార్ రిజర్వ్ కేఫ్‌ను ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ తెలిపింది. నగరంలోని కేఫ్ సంస్కృతికి మరిన్ని వినూత్న రుచులకు కేంద్రంగా నిలువనుందని పేర్కొంది. అత్యాధునిక సాంకేతికత, కళాత్మక రుచులు, ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధమైన వంటకాల విభిన్న మెనూలతో పాటు, దేశంలోని కాఫీ సంస్కృతిని స్టెల్లార్ రిజర్వ్ కొత్తగా నిర్వహించనుందని తెలిపింది. మార్జోకో బ్రాండ్ ద్వారా తయారీఉ చేసిన "స్ట్రాడా ఎక్స్" అనే అధునాతన ఎస్ప్రెస్సో యంత్రాలను ఉపయోగిస్తున్నట్లు పేర్కొంది. ఈ యంత్రం గరిష్టంగా రోజుకు 500 షాట్లను ఉత్పత్తి చేస్తుందని పేర్కొంది. కాఫీతో పాటు అనేక అహారోత్పత్తులు అందుబాటులో ఉంటాయని పేర్కొంది.

మణిపాల్‌సిగ్నా నుంచి సర్వ బీమా పథకం

న్యూఢిల్లీ : ఆరోగ్య బీమా రంగంలోని మణిపాల్‌సిగ్నా కొత్తగా 'సర్వ'ను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఇందులో సర్వ ప్రథం , సర్వ ఉత్తమ్, సర్వ పరమం పథకాలున్నాయని పేర్కొంది. ప్రజల ఆర్థిక ఆరోగ్యాన్ని సురక్షితంగా ఉంచడానికి కస్టమైజ్డ్ ఆరోగ్య కవరేజీని అందిస్తాయని మణిపాల్‌సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్ సిఇఒ ప్రసూన్ సిక్దర్ పేర్కొన్నారు. ఈ ప్లాన్లతో భారత్‌లో బీమా పాలసీ కవరేజీ లేని వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

మహారాష్ట్ర ఫలితాలు కాంగ్రెస్‌కు గుణపాఠం

- మాజీ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌కు గుణపాఠంలాంటిదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్ వేదికగా విమర్శించారు.మహారాష్ట్రలో ఐదు గ్యారంటీల పేరిట కాంగ్రెస్ చేసిన గారడీని ప్రజలు నమ్మలేదని పేర్కొన్నారు.మహాలక్ష్మి, రైతు భరోసా ఎగ్గొట్టడం, రుణమాఫీ పూర్తి చేయక పోవడం,ఆసరా పింఛన్లు పెంచక పోవడం వంటి చర్యలను పక్క రాష్ట్ర ప్రజలు నిశితంగా గమనించారని అన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ చేస్తున్న మోసాలను గమనించి మహారాష్ట్ర ప్రజలు తగిన తీర్పునిచ్చారని పేర్కొన్నారు. అలాగే జార్ఖండ్‌లో హేమంత్ సోరేన్‌పై బీజేపీ పెట్టిన అక్రమ కేసులు, అరెస్టులు, పార్టీ చీల్చే ప్రయత్నాలను ప్రజలు తిప్పి కొట్టారని గుర్తు చేశారు.

చెరుకు సాగును నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

గిట్టుబాటుకాని ధరలు

- పంట టన్నుకి రూ.500 బోనస్ చెల్లించాలి : చెరుకు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు
- సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-నేలకొండపల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరుకు పంటకు ధర కల్పించకుండా సాగును నిర్వీర్యం చేస్తున్నాయని చెరుకు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం మోటాపురం, మల్లేపల్లి గ్రామాల మధ్య గల బీకేఆర్ గార్డెన్‌లో శనివారం చెరుకు రైతుల రాష్ట్ర సదస్సు రచ్చ నరసింహారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరుకు రైతుల పట్ల ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, దాంతో సాగుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత చెరుకు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. చెరుకు రికవరీ పేరుతో మద్దతు ధరలు తగ్గించి రైతులను దగా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలోనూ కొన్ని పంటలకు బోనస్‌లు ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి చెరుకు పంటకు బోనస్ ప్రకటించకుండా వివక్ష చూపిస్తున్నారన్నారు. ఖమ్మం జిల్లాలో చెరుకు సాగుకు అనుకూలమైన నేలలు అధికంగా ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లాలో అనుకూలమైన భూముల్లోనూ ఫామ్ ఆయిల్ సాగుకు ప్రోత్సాహకాల పేరుతో పురమాయించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికే జిల్లాలో సాగు చేసిన అనేకమంది పామాయిల్ రైతులు ఏండ్లు గడుస్తున్నా దిగుబడులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో చెరుకు సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు అవసరమైన పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం చెరుకు మిల్లులు, పరిశోధన సంస్థల భాగస్వామ్యంతో సస్యరక్షణ చర్యలకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని, చీడపీడలను తట్టుకునే నూతన వంగడాలను రూపొందించి రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం.. చెరుకు టన్నుకు రూ.4 వేలు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చెక్కర ముసాయిదా(నియంత్రణ) ఆర్డర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని, నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని డిమాండ్ చేశారు.

చెరుకు రైతుల సంఘం రాష్ట్ర నాయకులు శోభన్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా చెరుకు సాగు చేసి తీపిని పంచుతున్న రైతన్నలకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేదును చవిచూపిస్తోందన్నారు. మోడీ అనుసరిస్తున్న అసమర్థ విధానాల ఫలితంగా దేశవ్యాప్తంగా అనేక చక్కెర ఫ్యాక్టరీలు మూతపడు తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చక్కెర నూతన పాలసీ పేరుతో చెరుకు రైతులను సాగుకు దూరం చేసి.. విదేశాల నుంచి చక్కెర, బెల్లం దిగుమతి చేసుకునేలా మోడీ కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ప్రధాని మోడీ చెప్పిన విధంగా 9.5 శాతం చెరుకు రికవరీపై టన్నుకి రూ.5500 ఇవ్వాల్సి ఉన్నా అమలు చేయడం లేదన్నారు. ఫ్యాక్టరీకి చెరుకు తరలించిన 14 రోజుల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ కావాల్సి ఉన్నా సకాలంలో అందడం లేదన్నారు. ప్రభుత్వాలనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై రైతులంతా సంఘటితమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ మాట్లాడారు. సదస్సులో చెరుకు రైతుల సంఘం, తెలంగాణ రైతు సంఘం నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మల్లెల సన్మంతరావు, బిక్కసాని గంగాధర్ పాల్గొన్నారు.

చెరుకు రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా చెరుకు రైతుల సంఘం రాష్ట్ర నూతన కమిటీని 12 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా జిఎస్ గోపి(వనపర్తి జిల్లా), బొంతు రాంబాబు(ఖమ్మం జిల్లా)తో పాటు సభ్యులుగా రచ్చ నరహారావు, పి.తోటకూరి రాజశేఖర్ (రాజు), విజయపాల్ రెడ్డి, డి.మోతీరాం నాయక్, ఎం.గంగాధర్, ఇమ్మడి సుధీర్, యలమద్ది లెనిన్, రాసాల కనకయ్యను ఎన్నుకున్నారు.

రేవంత్ అసత్యాలను మహారాష్ట్ర ప్రజలు నమ్మలేదు

- రానున్నది ప్రాంతీయ పార్టీల శకం : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసత్య ప్రచారాలను మహారాష్ట్ర ప్రజలు నమ్మలేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు అమలు చేయకుండానే అన్ని చేసినట్టుగా దొంగ ప్రచారానికి మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని చెప్పారు. తెలంగాణ ప్రజలకు చెందిన రూ.300 కోట్ల సొమ్ముతో పెద్ద ఎత్తున ప్రకటనలు ఇచ్చి మహారాష్ట్రలో తిమ్మిని బమ్మిని చేద్దామనుకున్న రేవంత్ ఆటలు సాగలేదని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ప్రతి మహిళకు రూ.2500 ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చకుండానే మహారాష్ట్రలో మహిళలకు రూ.3000 రూపాయలు ఇస్తామని చెప్పడాన్ని ఆయన తప్పు పట్టారు.

ఎన్నికల ప్రచారంలో అదానీని గజదొంగగా అభివర్ణించి తెలంగాణలో మాత్రం వ్యాపార, వాణిజ్య సంబంధాలు పెట్టుకున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ అన్నారు. ఇకనైనా ముఖ్యమంత్రి పదవికి న్యాయం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసే దిశగా పని చేయాలని సీఎంకు సలహా ఇచ్చారు.

ప్రాంతీయ పార్టీల పొత్తుతోనే బీజేపీ గెలుపు

మహారాష్ట్రలో బీజేపీ గెలిచేందుకు ప్రాంతీయ పార్టీ నేతలు ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌లే కీలకమయ్యారని కేటీఆర్ అన్నారు. ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యత పెరగడం దేశ సమాఖ్య స్ఫూర్తికి, రాష్ట్రాల అభివృద్ధికి ఎంతగానో దోహద పడుతుందని చెప్పారు. భవిష్యత్తులోనూ కేసీఆర్ లాంటి బలమైన ప్రాంతీయ నాయకులను ప్రజలు ఆశీర్వదిస్తారని గుర్తు చేశారు. 2024 లోక్ సభ ఎన్నికల ఫలితాల నాటి నుంచే దేశంలో సంకీర్ణ శకం మొదలైందని అన్నారు. భవిష్యత్‌లోనూ ఇదే ట్రెండ్ కొనసాగటం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ సొంతంగా ఏ రాష్ట్రంలో కూడా ప్రభుత్వాలు ఏర్పాటు చేసే పరిస్థితిలో లేవన్నారు. మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలు బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలకు చెంప పెట్టని వ్యాఖ్యానించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

చిన్న కాళేశ్వరం ఎత్తిపోతలకు రూ.571 కోట్లు కేటాయింపు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

మంథని శాసనసభ నియోజకవర్గం పరిధిలోని 63 గ్రామాలను సస్యశ్యామలం చేసే చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2007లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు పనులు ఇప్పటిదాకా 75 శాతం పూర్తయ్యాయి. శనివారం ఎర్రమంజిల్‌లోని జలసౌధలో నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ఉన్నతాధి కారులతో సమీక్ష జరిగింది.

చిన్న కాళేశ్వరం (ముక్తేశ్వర్) ఎత్తిపోతల పథకం పనులకు రూ.571.57 కోట్ల పరిపాలన అనుమతి లభించినట్టు సమీక్ష అనంతరం మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు. మొత్తం 45 వేల ఎకరాలకు సాగునీరు, అర టీఎంసీ నీటిని మంచినీటి సరఫరా కోసం వినియోగించనున్నట్టు ఆయన తెలిపారు. గోదావరి నుంచి అప్రోచ్ కెనాల్ ద్వారా నీటిని తరలించి కన్నెపల్లి వద్ద ఒకటో పంపుహౌజ్ ద్వారా 4.2 టీఎంసీల నీరు దిగువన రెండో పంపుహౌజ్‌కు నీరు సరఫరా అవుతుంది. మొదటి పంపుహౌజ్ సెకనుకు 600 క్యూబిక్ ఫీట్ల నీటిని ఎత్తిపోస్తుంది. అక్కడి నుంచి మందిరం చెరువు, ఎర్ర చెరువుకు నీటి సరఫరా జరుగుతుంది. మిగిలిన నీరు రెండో పంపుహౌజ్‌కు చేరుతుంది. కాటారంలో ఏర్పాటు చేసే రెండో పంపుహౌజ్ ద్వారా గారెపల్లి, పోలారం, తాండ్ర, యెల్లాపూర్, కొత్తపల్లి, రుద్రారం, ధన్వాడ, ఆదివారంపేట, గుమ్మలపల్లి, వీరాపూర్, గూడూర్ చెరువులకు గోదావరి జలాలు చేరతాయి. ఈ పథకంలో భాగంగా ఎర్ర చెరువు సామర్థ్యాన్ని పెంచనున్నారు. వరదకు తెగిపోయిన రుద్రారం చెరువు గండిని పూడ్చి బలోపేతం చేసే పనులు కూడా పూర్తి కావచ్చాయి. రానున్న రెండేండ్లల్లో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి చెరువుల ద్వారా సాగునీరు అందించాలని నీటి పారుదల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఎత్తిపోతల పథకాన్ని తక్షణం పూర్తి చేయాల్సిన ప్రాజెక్టుల జాబితాలో చేర్చినట్టు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

రెండేండ్లల్లో 45 వేల ఎకరాలకు సాగునీరు

శ్రీరాంసాగర్ నీటితో 28 వేల ఎకరాల ఆయకట్టు

ప్రస్తుతం మంథని నియోజకవర్గంలో శ్రీరాంసాగర్ జలాలతో 28,800 ఎకరాలకు సాగునీరు అందుతోంది. డి-83 డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ద్వారా గుండారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు చేరుకుంటాయి. అక్కడి నుంచి 24 మైనర్ కాల్వల ద్వారా మొత్తం 28,800 ఎకరాలకు సాగునీరు అందేది. కాలక్రమేణా మైనర్లలో పూడిక చేరడం లాంటి పలుకారణాలతో నిర్దేశిత ఆయకట్టుకు నీరు అందడం లేదు. గుండారం చెరువు నుంచి మైనర్ల చివరి వరకు మరమ్మతులు జరిపి నీటి సామర్థ్యాన్ని పెంచాలని మంత్రి శ్రీధర్ బాబు శ్రీరాంసాగర్ ఇంజినీర్లను ఆదేశించారు.

ఫార్మాసిటీ కాదు..ఇండస్ట్రియల్ కారిడార్

(మొదటిపేజీ తరువాయి)



ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె రమ, నాయకులు ఎస్‌ఎల్ పద్మ, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పాపయ్య ఆరెస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మురహరి, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న ఉన్నారు. అనంతరం మీడియా సెంటర్‌లో వారు మాట్లాడారు.

పరిశ్రమల కోసం వ్యవసాయ భూములు తీసుకోవద్దు : తమ్మినేని

లగచర్లలో ఫార్మాసిటీని పెట్టడం లేదనీ, ఇండస్ట్రియల్ పార్క్ మాత్రమే పెడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. ఇండస్ట్రియల్ పార్క్ కోసమైనా పంటలు పండే భూములను రైతుల నుంచి తీసుకోవద్దని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో లగచర్లలో పర్యటించి అక్కడి పరిస్థితులను పరిశీలించి నివేదికను సీఎంకు అందజేశామన్నారు. అక్కడ శాంతియుత వాతావరణాన్ని ఏర్పాటు చేసేందుకు సీఎం సానుకూలంగా స్పందించారని చెప్పారు. అక్కడ వరికోత కోసేందుకు అనుమతివ్వాలని కోరారు. సీఎం వెంటనే స్పందించి వరి కోత కోసేందుకు అనుమతివ్వాలంటూ కలెక్టర్‌ను ఆదేశించారని అన్నారు. భూసేకరణలో బీడు భూములతోపాటు పంట భూములున్నాయని వివరించారు. కాలుష్యం కాని ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తామంటూ సీఎం హామీ ఇచ్చారని చెప్పారు. అక్కడ సీలింగ్, దొరల భూములున్నాయని గుర్తు చేశారు. లగచర్ల వద్ద మహిళలపై పోలీసులు దారుణంగా ప్రవర్తించారనీ, దాడిని ఖండిస్తున్నామని అన్నారు. స్వార్థ రాజకీయాల కోసం కుట్రల కోసం రైతులకు అన్యాయం చేయొద్దని కోరారు. ఆ ప్రాంతంలో వామపక్ష పార్టీల తరఫున మరోసారి పర్యటిస్తామన్నారు.

గిరిజనులపై కేసులను ఎత్తేయాలి : కూనంనేని

లగచర్ల ఘటనపై విచారణ చేపట్టి అమాయకులైన గిరిజనులపై నమోదు చేసిన కేసులను ఎత్తేయాలంటూ సీఎం రేవంత్‌రెడ్డిని కోరామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. లగచర్లలో జరిగిన ఘటనపై ప్రభుత్వం విచారణ చేపట్టొచ్చనీ, కానీ గిరిజనులపై ఎలాంటి కేసుల్లేకుండా విడుదల చేయాలని కోరామని అన్నారు. దానికి సీఎం రేవంత్‌రెడ్డి కూడా అంగీకరించారని చెప్పారు. విషపదార్థాలు వెదజల్లే ఫార్మా కంపెనీలను జనావాసాల మధ్య నెలకొల్పవద్దని కోరారు. అవసరమైతే ఏడారి ప్రాంతాల్లో ప్రజలకు నష్టం జరగని స్థలాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. జనావాసాల్లో ఫార్మాకంపెనీలను ఏర్పాటు చేస్తే వామపక్ష పార్టీలు అంగీకరించబోవని స్పష్టం చేశారు. ఏదైనా పరిశ్రమలు ప్రభుత్వ మిగులు భూముల్లో ఏర్పాటు చేసుకోవాలనీ, గత్యంతరం లేని పరిస్థితులలో మాత్రమే రైతులను స్వచ్ఛందంగా ఒప్పించి రైతులకు పూర్తి నష్టపరిహారం అందించిన తర్వాతే వారి భూములో ఏర్పాటు చేయాలని చెప్పారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో పరిహారం అందలేదని వివరించారు. భూనిర్వాసితుల విధానాన్ని ప్రభుత్వం మార్చాలని కోరారు. వచ్చేనెల తొమ్మిది నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై చర్చిస్తామన్నారు. రైతులు సంతోషపడేలా పరిహారం పెంచాలని సూచించారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె రమ, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పాపయ్య ఆరెస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, ఎస్‌యూసీఐ(సి) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మురహరి, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ మాట్లాడుతూ భూమికి బదులు భూమి వేరే చోట ఇప్పిస్తేనే రైతులు ఒప్పుకుంటారని అన్నారు. పేద ప్రజలకు, రైతులకు, భూ నిర్వాసితులకు ఇబ్బందులు కలిగించొద్దని కోరారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

వామపక్ష పార్టీల డిమాండ్లు :

- లగచర్ల ఫార్మా పరిధిలోని నాలుగు గ్రామాల్లో రైతులపై నిర్బంధకాండను నిలిపేయాలి. పోలీసు క్యాంపులను ఎత్తేయాలి.
- రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలి. జైల్లో ఉన్న రైతులను బేషరతుగా విడుదల చేయాలి.
- మహిళలపై అసభ్యంగా ప్రవర్తించిన పోలీసులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి.
- లగచర్ల ఘటనపై సమగ్ర న్యాయ విచారణ జరపాలి. దోషులను గుర్తించి చర్యలు తీసుకోవాలి. అమాయకులను వదిలేయాలి.
- రైతుల అనుమతి లేకుండా బలవంతంగా భూసేకరణ చేయొద్దు. వ్యవసాయానికి ఉపయోగపడే భూముల్లో ఫార్మా కంపెనీ ఏర్పాటును విరమించుకోవాలి.
- నాలుగు గ్రామాల్లో వరికోత యంత్రాలకు అనుమతివ్వాలి. ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేయాలి.
- ఫార్మా కంపెనీకి పదావుగా ఉన్న కొడంగల్ దొరల సీలింగ్ భూములు 1,156 ఎకరాలను తీసుకునే విషయాన్ని పరిశీలించాలి.
- 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతుల సమ్మతి లేకుండా భూములను తీసుకోవద్దు.
- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలతోపాటు ఏడో గ్యారంటీ స్వేచ్ఛ, ప్రజాస్వామ్య పునరుద్ధరణ చర్యలు లగచర్లలో చేపట్టాలి. ప్రజలకు ధైర్యం ఇచ్చే విధంగా స్వేచ్ఛా వాతావరణం కల్పించాలి.

రామాలయం మాడవీధుల అభివృద్ధికి రూ.70 కోట్లు

- శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్న మంత్రి పొంగులేటి



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం రామాలయ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, దీనిలో భాగంగా ఇప్పటికే రూ.70 కోట్లను మాడవీధుల అభివృద్ధి కోసం విడుదల చేసినట్టు రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారిని శనివారం పొంగులేటి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. మాడవీధుల అభివృద్ధికి సుమారు రెండు ఎకరాలకుపైగా భూమి కావాలని, ఇప్పటికే అధికారులు దానికి సంబంధించిన భూమిని గుర్తించినట్టు తెలిపారు. త్వరలోనే రామాలయం అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. అనంతరం ఆలయ అధికారులతో కలిసి మాడవీధుల అభివృద్ధి పనులపై మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులం కూడా రామాలయం అభివృద్ధిలో ముందుంటామని చెప్పారు. రామాలయం మీద ప్రేమ ఉంది కనుకనే భద్రాచలంలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించినట్టు గుర్తు చేశారు. ఆయన వెంట కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

పేదల అనుకూల ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు

- కూటమి అభ్యర్థులకు అభినందనలు
- రాంచీలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఝర్ఖండ్‌లో పేదల అనుకూల ప్రభుత్వాన్ని ఎన్నుకున్నదుకు ఆ రాష్ట్ర ఎన్నికల సీనియర్ పరిశీలకులు, స్టార్ క్యాంపెయినర్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ధన్యవాదాలు తెలిపారు. కూటమి అభ్యర్థులకు అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర ప్రజలకు తనకు బాధ్యతలు అప్పగించిన అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు. ఝర్ఖండ్‌లో ఇండియా కూటమికి సానుకూల ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో శనివారం ఉదయం ఆయన హైదరాబాద్‌లో నుంచి ప్రత్యేక విమానంలో రంచీకి చేరుకున్నారు. సీఎం హేమంత్ సోరేన్‌తో ఆయన చర్చలు జరిపారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజలు ఇండియా కూటమిపై విశ్వాసం ఉంచారని తెలిపారు. ఇది చారిత్రాత్మక తీర్పు అన్నారు. ఈ అద్భుత తీర్పు కోసం శ్రమించిన ఇండియా కూటమి అభ్యర్థులందరికీ అభినందనలు తెలిపారు. ఏడు హామీల ద్వారా ఝర్ఖండ్ హక్కుల పరిరక్షణ కోసం, వారి భవిష్యత్తు భద్రతకు కట్టుబడి ఉన్నట్టు చెప్పారు. తనకు ఈ బాధ్యతను అప్పగించినందుకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య

- మియాపూర్‌లోని ఓ కార్పొరేట్ కాలేజీలో ఘటన
- ఏఐడీఎస్‌ఎఫ్ నిరసన





నవతెలంగాణ-మియాపూర్

రంగారెడ్డి జిల్లా మియాపూర్‌లోని ఓ కార్పొరేట్ కాలేజీలో ఇంటర్మీడియట్ విద్యార్థి తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్‌కు చెందిన కౌశిక్ రాఘవ(17) మియాపూర్‌లోని ఓ కార్పొరేట్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆయన చదువుల్లో ఎప్పుడూ ముందు ఉండేవాడు. ఇటీవల తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. ఈ క్రమంలోనే హాస్టల్‌లోని తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. తన కొడుకు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని, అతని మృతిపై అనుమానాలు ఉన్నాయని విద్యార్థి తల్లి ఆరోపించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలేజీ ఎదుట ఏఐడీఎస్‌ఎఫ్ నిరసన

విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐడీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కాలేజీ ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి మాట్లాడుతూ.. విద్యార్థుల ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. విద్యార్థులను మార్కుల చట్రంలో బంధించడం వల్లనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. విద్యార్థి ఆత్మహత్యపై పూర్తి విచారణ జరిపించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అరుణ్, వంశీ, ప్రసాద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మరణాలు పట్టని సర్కార్

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో నిత్యకృత్యంగా మారిన విద్యార్థుల మరణాలంటే ప్రభుత్వానికి లెక్కలేకుండా పోయిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు.కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను శనివారం ఆమె పరామర్శించారు.అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతినెలా ముగ్గురు చొప్పున ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు విషాహారం తిని మృత్యువాత పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 11 నెలల కాంగ్రెస్ పాలనలో 42 మంది విద్యార్థులు మరణించారని గుర్తు చేశారు. చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ ముఖ్యమంత్రి వద్దే ఉండటంతో సరైన సమయం కేటాయించడం లేదని విమర్శించారు. వెంటనే విద్యాశాఖపై సమీక్ష నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

దేశ ప్రజలముందు కాంగ్రెస్ నవ్వుల పాలైంది

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశ ప్రజల ముందు కాంగ్రెస్ పార్టీ మరోసారీ నవ్వుల పాలైందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని నాంపల్లిలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక రాజధాని మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా, అక్కడి ప్రజలు మోడీ నాయకత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్ కే అత్యధిక సీట్లు కట్టబెట్టారని గుర్తు చేశారు. బీజేపీ వస్తే రిజర్వేషన్లు పోతాయనీ, మరాఠీలకు అన్యాయం జరుగుతుందని చేసిన ప్రచారాన్ని సైతం ప్రజలు తిప్పి కొట్టారన్నారు. కులం, మతం పేరుతో ప్రజలను విడగొట్టాలని రాహుల్‌గాంధీ విద్వేష ప్రసంగాలను తిరస్కరించారన్నారు. గ్యారంటీలంటూ ఎంత మభ్యపెట్టినా, కర్నాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకే కాంగ్రెస్ పరిమితమైందని వ్యాఖ్యానించారు. మరాఠా ప్రజలను మోసం చేశారని ఎంత విష ప్రచారం చేసినా శివసేనను అక్కడి ప్రజలు నమ్మలేదని అన్నారు. బాల్‌ఠాక్రే వారసత్వం ఉద్ధవ్‌ఠాక్రేకు లేదని ఈ ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయని చెప్పారు. శరద్ పవార్‌ను సైతం అక్కడి ప్రజలు తిరస్కరించారని వివరించారు. దేశ వ్యాప్తంగా ఎక్కడ ఓడినా ఈవీఎంలను ట్యాంపరింగ్ చేశారని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు.



సామాజిక విప్లవ సాహిత్యం యువతరానికి స్ఫూర్తి

- ప్రతిఘటన మాసపత్రిక ఆవిష్కరణలో జాన్‌వెస్లీ, డీజీ నర్సింహారావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహనీయులు మార్క్స్, పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో సామాజిక విప్లవ సాహిత్యాన్ని నేటి యువతరం అధ్యయనం చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ, కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు డిజి నరసింహారావు పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని కేవీపీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం ప్రచురించిన ప్రతిఘటన మాస పత్రికను వారు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సమకాలీన పరిస్థితులు, రాజ్యాంగ రక్షణ, దళితులు, బలహీన వర్గాల చట్టాలు వంటి కీలక అంశాలతో ప్రతిఘటన మాసపత్రికను ప్రచురించామని తెలిపారు. నేటి యువతరం పుస్తక పఠనశక్తిని మరింత పెంచుకోవాలని సూచించారు. సాహిత్యంతో సాన్నిహిత్యం చేస్తే సమర్థవంతమైన మనుషులుగా మారుతారని విశదీకరించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు మాట్లాడుతూ కేవీపీఎస్ నిర్మించిన ఉద్యమాలు సామాజిక చైతన్యానికి బాటలు వేస్తాయన్నారు. దళితులపై పెరుగుతున్న దౌర్జన్యాలకు వ్యతిరేకంగా యువతరాన్ని ప్రతిఘటన పత్రిక సిద్ధం చేస్తుందని తెలిపారు.కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.కురుమయ్య పాలడుగు నాగార్జున, నందిపాటి మనోహర్, పల్లెర్ల లలిత, డి రాధాకృష్ణ, సహాయ కార్యదర్శులు తిప్పారపు సురేష్, దుర్గం దినకర్, కోట గోపి, మంద సంపత్, దుడ్డేల రామ్మూర్తి, ఎం ప్రకాష్ కరత్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి రిటైర్డ్ కార్మికులకు రూ.18.27 కోట్ల దీపావళి బోనస్


- 27న ఖాతాల్లో జమ : సీఎమ్‌డీ ఎన్ బలరామ్ వెల్లడి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి సంస్థలో 2023- 24 ఆర్థిక సంవత్సరంలో మరియు ఏప్రిల్ 1, 2024 నుంచి అక్టోబరు 24, 2024 మధ్యలో పనిచేసి రిటైర్ అయిన కార్మికులకు సంబంధించిన పెరఫార్మెన్స్ లింక్డ్ రివార్డు స్కీమ్(దీపావళి బోనస్) సొమ్ము రూ.18.27 కోట్లను విడుదల చేశామని ఆ సంస్థ సీఎమ్‌డీ ఎన్ బలరామ్ తెలిపారు. ఈనెల 27వ తేదీన వారి ఖాతాల్లో ఈ బోనస్ సొమ్ము జమ అవుతుందన్నారు. పై సమయంలో 2,754 మంది కార్మికులు రిటైర్ అయ్యారనీ, వారికి దీపావళి బోనస్ కింద ఒక్కొక్కరికి గరిష్టంగా రూ.93,750 చొప్పున మొత్తం రూ.18.27 కోట్లు విడుదల చేశామన్నారు.

కమిషన్ నివేదిక అనంతరం మాదిగ ఉపకులాల వర్గీకరణ

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- మాదిగ, మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనంలో వెల్లడి
- నల్లగొండలో ఎన్‌జీ కళాశాల ఆవరణలో సభ



నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

కమిషన్ నివేదిక అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం మాదిగ ఉప కులాల వర్గీకరణకు సిద్ధమవుతుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. రాష్ట్రాలు ఉపకులాల వర్గీకరణ చేసుకోవచ్చన్న సుప్రీంకోర్టు తీర్పు కనుగుణంగా.. తాము చేవెళ్ల డిక్లరేషన్‌కు కట్టుబడి ఉన్నామని అన్నారు. బురుగుల రామకృష్ణన్ భవన్‌లో కమిషన్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తోందని చెప్పారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున డిగ్రీ కళాశాల ఆవరణలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సారథ్యంలో శనివారం జరిగిన మాదిగ మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాదిగ ఉపకులాల వర్గీకరణ ఎవరికీ వ్యతిరేకం కాదని చెప్పారు. సమాజంలో ఉన్న ఉప కులాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. డిసెంబర్ 14 వరకు కమిషన్ అర్జీలను స్వీకరిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ వాదనను రాతపూర్వకంగా కమిషన్‌కు చెప్పుకోవచ్చని సూచించారు. ఉపకులాల వర్గీకరణ ద్వారా విద్య, ఉద్యోగాలు, ఉపాధిలో మెరుగైన అవకాశాలు లభిస్తా యని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు నల్లగొండ పట్టణ శివారు రైల్వే బ్రిడ్జి నుంచి ఎన్‌జీ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం, వరంగల్ కాకతీయ కళాశాల ప్రొఫెసర్ మల్లేష్, ఎమ్మెల్యేలు మందుల సామెల్, మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణ, చేవెళ్ల ఎమ్మెల్యే లక్ష్మణ్, మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు, చాలా యాదయ్య ఇతర నాయకులు పాల్గొన్నారు.

టెన్త్ మూల్యాంకనం రెమ్యూనరేషన్ చెల్లించాలి

- ఎమ్మెల్సీ నర్సిరెడ్డి డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షలు-2024 జవాబు పత్రాల మూల్యాంకనం రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలనీ, అందుకు అదనపు బడ్జెట్‌ను కేటాయించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2023-24 విద్యాసంవత్సరం పదో తరగతి వార్షిక పరీక్షల జవాబుపత్రాల మ్యూలంకనం ఏప్రిల్‌లో జరిగిందని వివరించారు. మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రెమ్యూనరేషన్ ఇప్పటి వరు చెల్లించలేదని పేర్కొన్నారు. 2024-25 వార్షిక బడ్జెట్‌లో ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్‌కు తక్కువ బడ్జెట్ కేటాయించడం వల్ల రెమ్యూనరేషన్ చెల్లించలేకపోయినట్టు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణ ఏర్పడిన తర్వాత నాలుగేండ్ల వరు పరీక్షల మూల్యాంకనం ముగిసిన రోజే ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్‌ను చెల్లించేవారని గుర్తు చేశారు. ఆరేండ్ల నుంచి రెమ్యూనరేషన్ చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నదని పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా ఇప్పటికే ఐదు నెలలు జాప్యం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్‌కు అదనపు బడ్జెట్‌ను వెంటనే విడుదల చేసేందుకు తగు ఆదేశాలివ్వాలనీ, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు ఆయన లేఖ రాశారు.

'బాలల హక్కులు.. మీడియా కవరేజీ' పై రవికుమార్‌కు డాక్టరేట్



నవతెలంగాణ-హైదరాబాద్

నేడు సమాజంలో మీడియా పాత్ర ఎంతో కీలకమైనది. భవిష్యత్ తరానికి నిర్మాతలైనటువంటి చిన్నపిల్లలకు మీడియా ఇస్తున్న ప్రాముఖ్యత ఏ స్థాయిలో ఉందనే విషయంపై పరిశోధన జరిగింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి జర్నలిజం విభాగంలో "బాలల హక్కులు - మీడియా కవరేజీ" అంశంపై నల్లగొండ జిల్లా దేవరకొండకు చెందిన తూటుపల్లి రవి కుమార్ సీనియర్ ప్రొఫెసర్ పి.ఎల్ విశ్వేశ్వర్‌రావు పర్యవేక్షణలో డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. రోజురోజుకు చిన్న పిల్లలపై సమాజంలో జరుగుతున్న అకత్యాలు, ప్రభుత్వాల నుంచి వారికి కల్పిస్తున్న విద్యా వైద్య సౌకర్యాలు, ఇతర విషయాలలో వారికి ఇస్తున్న ప్రాధాన్యత ఏ స్థాయిలో ఉందో సవివరంగా పరిశోధించారు. సమాజానికి దిక్సూచిగా ఉంటున్న మీడియా భవిష్యత్తు తరానికి ప్రాధాన్యత ఇస్తుందనే విషయంపై కూడా చర్చించారు.

హిందీ మహావిద్యాలయ గుర్తింపు రద్దు

- ఉస్మానియా యూనివర్సిటీ సంచలన నిర్ణయం
- ఓయూ అధికారుల సంతకాలు ఫోర్జరీ జరిగినట్టు నిర్ధారించిన విచారణ కమిటీ
- స్వయం ప్రతిపత్తి రద్దు చేయాల్సిందిగా యూజీసీకి సిఫారసు
- ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల కోర్సు ఓయూ పర్యవేక్షణలో పూర్తి

నవతెలంగాణ-ఓయూ



నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల విద్యార్థుపీకరణ పత్రాలను ఫోర్జరీ చేసిన కళాశాలపై ఉస్మానియా యూనివర్సిటీ కఠిన చర్యలు తీసుకుంది. ఉత్తీర్ణులైన విద్యార్థులను ఫెయిలైనట్టు, ఫెయిలైన విద్యార్థులు ఉత్తీర్ణులైనట్టు తప్పుడు సమాచారాన్ని అందించిన హిందీ మహావిద్యాలయం గుర్తింపును రద్దు చేస్తూ ఉస్మానియా విశ్వవిద్యాలయం సంచలన నిర్ణయం తీసుకుంది. 2019 -2022 విద్యాసంవత్సరానికి సంబంధించి యూజీ ఆరో సెమిస్టర్ పరీక్షల్లో ఫెయిలైన 49 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్టుగా, ఉత్తీర్ణులైన ఐదుగురు విద్యార్థులు ఫెయిలైనట్టుగా తారుమారు చేసిన జాబితాను ఓయూ పరీక్షల నియంత్రణ కార్యాలయానికి హిందీ మహావిద్యాలయం సమర్పించింది. సదరు విద్యాసంస్థ టీఆర్(ట్యాబులేషన్ రికార్డ్స్) రికార్డులపై అనుమానం రావటంతో ఓయూ అధికార యంత్రాంగం సమగ్ర విచారణకు కమిటీ వేసింది. మూడు దఫాలుగా హిందీ మహావిద్యాలయ విద్యాసంస్థను సందర్శించిన కమిటీ విస్తుపోయే అంశాలను గుర్తించింది. స్వయంప్రతిపత్తి కలిగిన హిందీ మహావిద్యాలయం పరీక్షల నిర్వహణ, పేపర్ ఎవాల్యూషన్ వారి అధ్యాపకులతోనే నిర్వహిస్తోంది. ఇదే అదనుగా అక్రమాలకు పాల్పడ్డట్టు కమిటీ గుర్తించింది. కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు కామర్స్ సమాధాన పత్రాలను దిద్దినట్టుగా తేలింది. విద్యార్థుల మార్కుల జాబితాలన్నీ ఫోర్జరీ చేసినట్టుగా గుర్తించింది. పరీక్ష పత్రాలు, ఎవాల్యుయేషన్, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు సంబంధించిన నోటిఫికేషన్ వివరాలు కళాశాల యాజమాన్యం కమిటీకి సమర్పించకపోవటం గమనార్హం. యూనివర్సిటీ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కిన కళాశాల నిర్లక్ష్యంపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాల్సిందిగా కమిటీ అభిప్రాయపడింది. మరో దఫా కళాశాలను సందర్శించిన ఓయూ విచారణ కమిటీ యూజీ 2023 -24 బ్యాచ్ టీఆర్ రికార్డుల్లో ప్రిన్సిపాల్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సంతకాలు, స్టాంపులు లేనట్టు గుర్తించింది. యూనివర్సిటీ తుది నిర్ణయం తీసుకునే వరకు కళాశాల స్వయం ప్రతిపత్తిని అబయన్స్‌లో పెట్టాలని కమిటీ సిఫార్సు చేసింది. తుది నిర్ణయం కోసం వేసిన మరో కమిటీ సైతం అక్టోబర్ 4,న సమగ్ర విచారణ చేపట్టింది. యూనివర్సిటీకి సమర్పించిన 2022 యూజీ 6వ సెమిస్టర్ ఫలితాలు తప్పని, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సంతకాన్ని ఫోర్జరీ చేశారని తేల్చారు. హిందీ మాహా విద్యాలయ యాజమాన్యం 13 మంది బీకాం, 27 మంది బీఎస్సీ, 9 మంది బీబీఏ విద్యార్థులు పాసైనట్టుగా యూనివర్శిటీకి తప్పుడు సమాచారాన్ని ఇచ్చినట్టు తేలింది. నలుగురు బీకాం, బీబీఏ విద్యార్థి ఉత్తీర్ణులైన ప్పటికీ ఫెయిలైనట్టుగా రికార్డులు తారుమారు చేశారు. ఈ విషయమై వివరణ ఇచ్చిన కళాశాల యాజమాన్యం.. తమ పరీక్షల విభాగం రికార్డుల్లో పొరపాట్లు జరిగినట్టు ఒప్పుకుంది. అయినప్పటికీ తప్పు చేసిన వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఓయూ పరీక్షల విభాగం ఈ విషయమై పదే పదే హెచ్చరించినప్పటికీ హిందీ మహావిద్యాలయం పెద్దగా స్పందించలేదు. దీంతో విచారణ కమిటీ నివేదికలను యూనివర్శిటీ స్థాయి సంఘానికి నివేదించింది . ఈ విషయమై తీవ్రంగా స్పందించిన ఓయూ స్థాయి సంఘం (స్టాండింగ్ కమిటీ) సంబంధిత రికార్డులను సత్వరమే సీజ్ చేయాల్సిందిగా ఓయూ పరీక్షల నియంత్రణాధికారి, డీన్ సీడీసీలను ఆదేశించింది. ఓయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసినందుకుగాను క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలిపింది. కళాశాల స్వయం ప్రతిపత్తిని రద్దు చేయాల్సిందిగా యూజీసీ, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ అధికారులను కోరాలని సిఫార్సు చేసింది. ప్రస్తుత విద్యార్థులకు మినహాయింపు ఓయూ పరిధిలో మరెక్కడా హిందీ మీడియం కళాశాలలు లేనందున విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ప్రస్తుతం చదువు తున్న విద్యార్థులకు విద్యాబోధన చేసేందుకు మినహాయింపు ఇచ్చింది. వచ్చే విద్యాసంవత్స రం 2025-2026 నుంచి ఎలాంటి యూజీ అడ్మిషన్లు చేపట్టొద్దన్నారు. సాధారణంగా పీజీ తరగతులు నాన్ అటానమస్ స్టేటస్‌తో కొన సాగించుకోవచ్చని సూచించారు. తుది సెమిస్ట ర్ పరీక్షలను స్వయంగా యూనివర్శిటీ నిర్వ హించనుంది. స్టాండింగ్ కమిటీ సిఫార్సుల మేరకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు యూనివర్శిటీ ప్రకటించింది. ఓయూ వీసీ ప్రొ.కుమార్ మొలుగరం మాట్లాడుతూ.. అనుబంధ, స్వయం ప్రతిపత్తి కలిగిన విద్యాసంస్థలు యూనివర్శిటీ, యూజీసీ నిబంధనలను ఖచ్చితంగా పాటించాల్సిందేనని తెలిపారు. విద్యా ప్రమాణాలు, పారదర్శకత, నిబంధనల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు.

30న మహబూబ్‌నగర్‌లో 'రైతు సదస్సు'

- అవగాహన కల్పించేలా మూడ్రోజులపాటు కార్యక్రమాలు : వ్యవసాయ శాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఈ నెల 30న మహబూబ్‌నగర్‌లో జరుగనున్న రైతు సదస్సును జయప్రదం చేయాలని సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వ్యవసాయంలో వస్తున్న మార్పులపై రైతులకు అవగాహన కల్గించేలా మూడ్రోజులపాటు కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. దీన్ని బహిరంగ సభగా కాకుండా రైతులకు ఉపయోగపడేలా ఉండాలని కోరారు. శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖపై సీఎం సమీక్షించారు. ముఖ్యమంత్రితోపాటు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని రైతులందరూ మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసే సదస్సులో పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సభను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. మహబూబ్‌నగర్ రైతుల సభను బహిరంగ సభలా కాకుండా... రైతులకు అవగాహన కల్పించే సదస్సుగా నిర్వహించాలని ఆదేశించారు. వ్యవసాయంలో వచ్చిన అధునాతన సాగు పద్ధతులు, మెళకువలను రైతులకు తెలియజేసేలా వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, పశుసంవర్థక శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాట్లు చేయాలని సూచించారు.

యూనివర్సిటీ అభివృద్ధి చేసిన కొత్త వంగడాలు, ఆయిల్ ఫామ్ కంపెనీల నూతన ఆవిష్కరణలు, రైతులకు ఉపయోగపడేందుకు అందుబాటులోకి వచ్చిన వివిధ కంపెనీ వినూత్న ఉత్పాదనలన్నీ ఇక్కడ స్టాళ్లలో ఉంచాలని సూచించారు. అధునాతన పరికరాలు, ఎలక్ట్రిక్ ట్రాక్టర్లు, డ్రోన్లు...అన్నింటినీ అక్కడ ప్రయోగాత్మక ప్రదర్శనకు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. రైతులందరూ 30న జరిగే సభకు అప్పటికప్పుడు వచ్చి వెళ్లే విధంగా కాకుండా రైతులకు అవగాహన కల్పించేలా మూడ్రోజుల పాటు మహబూబ్‌నగర్ రైతు సదస్సు నిర్వహించాలని ఆదేశించారు. 28వ తేదీ నుంచే ఈ స్టాళ్లను అందుబాటులో ఉంచాలని చెప్పారు. దీంతో రాష్ట్రంలోని రైతులు దేశంలో వ్యవసాయ సాగు విధానాల్లో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకునేలా ఈ సదస్సు నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం 23 లక్షల మంది రైతులకు ఇప్పటికే రూ.2 లక్షల రుణమాఫీ చేసిందని తెలిపారు. కొన్ని చోట్ల ఆధార్ నెంబర్ల తప్పులు, బ్యాంకు ఖాతాల్లో పేర్ల తప్పులు, కుటుంబాల నిర్ధారణ కారణాలతో కొందరికి రుణమాఫీ జరగలేదంటూ వచ్చిన ఫిర్యాదులపై అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నివేదికను అందించారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి. సీఎంవో స్పెషల్ సెక్రెటరీ చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.



భూగర్భ సంపుల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

- ప్రయోగాత్మకంగా 12 చోట్ల నిర్మాణాలు : రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిషోర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిర్మాణంలో ఉన్న భూగర్భ సంపులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ అధికారులను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిషోర్ ఆదేశించారు. హైదరాబాద్ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని రాజ్‌భవన్ రోడ్డులోని లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ ప్రవేశ మార్గంలో భూగర్భ సంపు (రెయిన్ వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్) నిర్మాణ పనుల పురోగతిని శనివారం హెచ్ఎండీఏ, జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో క్షేత్రస్థాయిలో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం సచివాలయం ఎదురుగా నిర్మిస్తున్న భూగర్భ సంపు నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 10 నుంచి 40 లక్షల లీటర్ల సామర్థ్యంతో ప్రయోగాత్మకంగా 12 చోట్ల భూగర్భ సంపుల నిర్మాణాలు చేపట్టామని, వీటిలో 4 పూర్తి అయ్యాయని జీహెచ్ఎంసీ అధికారులు ముఖ్య కార్యదర్శికి వివరించారు. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. వర్షపు నీటిని ఒడిసి పట్టడంతోపాటు రోడ్లపై నీరు నిల్వకుండా చూడటం, ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్‌పెట్టేందుకే భూగర్భ సంపులను నిర్మిస్తున్నట్టు దానకిశోర్ తెలిపారు. భూగర్భ సంపులను త్వరితగతిన పూర్తిచేయాలని, ట్యాంక్‌బండ్ పరిసరాలను అందంగా ముస్తాబు చేయాలని అధికారులను ఆదేశించారు.

'ప్రజాపాలన' ప్రజా విజయోత్సవం' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ ట్యాంక్‌బండ్, సెక్రటేరియట్, నెక్లెస్‌రోడ్ పరిసరాల్లో విజయోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృష్ట్యా ఈ ప్రాంతాలను అనుసంధానం చేసే ప్రధాన మార్గాలను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. వేడుకలను తిలకించేందుకు, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన చోట కొత్తగా తారు వేయడం, మరమ్మతులు చేపట్టడం, మార్కింగ్, సంకేత సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ఉప కార్యదర్శి ప్రియాంక, ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు ఉన్నారు.

పది మంది నకిలీ వైద్యుల గుట్టు రట్టు

- 20 క్లినిక్‌లపై తెలంగాణ వైద్యమండలి దాడులు
- చంపాపేట, కర్మన్‌ఘాట్, సైదాబాద్ ప్రాంతాల్లో తనిఖీలు
- ఎన్ఎంసీ యాక్ట్ 34, 54 ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్టు వెల్లడి



నవతెలంగాణ-సిటీబ్యూరో

పది మంది నకిలీ వైద్యుల గుట్టును తెలంగాణ వైద్య మండలి రట్టు చేసింది. హైదరాబాద్‌లోని చంపాపేట, సైదాబాద్, కర్మన్‌ఘాట్ ప్రాంతాల్లో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మెన్ డాక్టర్ శ్రీనివాస్ నేతృత్వంలో డాక్టర్ ఇమ్రాన్ అలీ, డాక్టర్ రాజీవ్‌తో కూడిన బృందం తనిఖీలు నిర్వహించింది. క్లినిక్‌లు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్స్ కలిపి 20 సెంటర్లలో తనిఖీ చేసి 10 మంది నకిలీ వైద్యులను పట్టుకున్నట్టు తెలంగాణ వైద్యమండలి ప్రకటించింది. ఈ పది మంది నకిలీ వైద్యులు ఫస్ట్ ఎయిడ్ సెంటర్లలో నిబంధనలకు విరుద్ధంగా బెడ్స్ ఏర్పాటు చేయడంతోపాటు, సెలైన్స్ పెట్టడం, యాంటీ బయోటిక్స్, స్టెరాయిడ్స్ ఇంజెక్షన్స్ ఇస్తున్నట్టు గుర్తించారు.

తగు ఆధారాలు సేకరించి వీరిపై ఎన్ఎంసీ యాక్ట్ 34, 54 ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్టు వైద్య మండలి వైస్ చైర్మెన్ తెలిపారు. మహిళా ఆయుర్వేదిక్ వైద్యులు డాక్టర్ రాధా కుమారి గర్భిణులకు పరీక్షలు నిర్వహించడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా అల్లోపతి మందులు ఇస్తున్నట్టు తేలింది.

ఆయుర్వేదిక్ వైద్యులు డాక్టర్ రమేష్, డాక్టర్ వీరేష్ హైడోస్ యాంటి బయోటిక్, స్టెరాయిడ్స్‌తోపాటు ఇతర అల్లోపతి మందులు ఇస్తున్నట్టు గుర్తించామని, వీరిపై ఆయుష్ కౌన్సిల్‌కి ఫిర్యాదు చేయడంతోపాటు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారికి ఫిర్యాదు చేయనున్నట్టు టీజీఎంసీ సభ్యులు డాక్టర్ ఇమ్రాన్ అలీ తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా 350 ఎఫ్ఐఆర్‌లు నమోదు

నకిలీ వైద్యులైన ఆర్ఎంపీ, పీఎంపీలపై ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 350 వరకు ఎఫ్ఐఆర్ ఫైల్ చేశామని, కొన్ని చార్జ్‌షీట్‌లు కూడా ఫైల్ అయ్యి త్వరలోనే కోర్టుకు వెళ్లనున్నట్టు టీజీఎంసీ వైస్ చైర్మెన్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. నకిలీ వైద్యుల వల్ల జరిగే నష్టాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు ఇన్నేండ్లు వీరి వల్ల జరిగిన, జరగబోయే నష్టాలను కోర్టు ముందు డాక్యుమెంట్స్ ద్వారా ఆధారాలతో సమర్పించనున్నట్టు తెలిపారు. నకిలీ వైద్య వ్యవస్థ పూర్తి స్థాయిలో పోయేలా మరిన్ని చర్యలు తీసుకోను న్నట్టు చెప్పారు.

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల నిరసన

- వేధిస్తున్న చీఫ్ వార్డెన్ ఘెరావ్



నవతెలంగాణ-మియాపూర్

రంగారెడ్డి జిల్లా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో కొద్ది కాలంగా విద్యార్థులను ఫైన్‌ల పేరుతో వేధిస్తున్న చీఫ్ వార్డెన్ సువర్ శశి రానాపై విద్యార్థులు ఒక్కసారిగా తిరగబడ్డారు. చాలా కాలంగా విద్యార్థుల హాస్టల్స్ తనిఖీల పేరుతో చీఫ్ వార్డెన్ వేధింపులకు గురి చేస్తున్నారు. దాంతో వార్డెన్ వ్యవహార శైలిపై విద్యార్థులు విసుగుచెందారు. ఈ విషయంపై ఇటీవల ఆందోళన కూడా చేశారు. శనివారం ఉదయం మళ్లీ తనిఖీల పేరుతో వార్డెన్ విద్యార్థుల హాస్టల్‌లోకి ప్రవేశించారు. దాంతో ఆగ్రహానికి గురైన విద్యార్థులు ఆయనను చుట్టుముట్టారు. చీఫ్ వార్డెన్ తమను వేధిస్తున్నారని, ఆయనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ.. ఘెరావ్ చేశారు. చేసేదేమీ లేక ఆయన వెనుతిరిగారు. అయినా విద్యార్థులు నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న గచ్చిబౌలి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులకు నచ్చజెప్పడంతో శాంతించారు.

జైల్లో ఉన్న రైతుల కుటుంబాలు భయపడొద్దు

- మీ వెనుక కేసీఆర్ ఉన్నారు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- చర్లపల్లి జైలులో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి పరామర్శ

నవతెలంగాణ - చర్లపల్లి



"మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డికి, చేయని తప్పునకు జైల్లో ఉన్న 30 మంది అమాయక రైతుల కుటుంబాలకు ఒకటే చెబుతున్నాం.. మీరు భయపడాల్సిన అవసరం లేదు. మీ వెనుక కేసీఆర్ ఉన్నారు. తప్పకుండా న్యాయం, ధర్మం గెలుస్తుంది" అని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శనివారం చర్లపల్లి జైలులో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి కేటీఆర్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పేద, గిరిజన, బలహీనవర్గాల రైతుల తరఫున పోరాటం చేసిన పాపానికి నరేందర్ రెడ్డి జైలు పాలయ్యారని అన్నారు. రేవంత్ రెడ్డి కక్షపూరిత వైఖరి కారణంగా, చేయని తప్పుకు జైల్లో నరేందర్ రెడ్డి శిక్ష అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నరేందర్‌రెడ్డిని కలిసినప్పుడు ఆయన ధైర్యంగా ఉన్నారని.. మహబూబాబాద్‌లో తాము చేపట్టనున్న ధర్నా బాగా చేయాలంటూ తమకు చెప్పారని తెలిపారు. తన గురించి కాకుండా 30 మంది అమాయక రైతులను విడిపించాలని చెప్పారని.. అందుకు ఆయనకు అభినందనలు అన్నారు. సంగారెడ్డి జైలు నుంచి చర్లపల్లి జైలు వరకు తప్పు చేయని అమాయకులు జైల్లో ఉన్నారని.. కొడంగల్ నుంచి కొండారెడ్డిపల్లె వరకు అరాచకాలు చేస్తున్న దుర్మార్గులు గద్దెనెక్కి కూర్చున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్‌లో అర్ధరాత్రి ఇండ్లపై పడి మహిళలు, పిల్లలపై అరాచకాలు చేస్తూ పేద రైతుల భూములు గుంజుకుంటున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి సొంత ఊరు కొండారెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి సీఎం కోసం మొన్నటి ఎన్నికల్లో పనిచేశారని, కానీ ఆయనపై పగబట్టి ఆయన ఇంటికి అడ్డంగా గోడకట్టి తోవ లేకుండా చేశారని అన్నారు. ఆ క్షోభ, అవమానంతో ఆయన ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శిశుపాలుడి తప్పులను ఆనాడు లెక్కించినట్టు.. కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలు, రేవంత్ రెడ్డి పాపాలను ప్రజలు ఇప్పుడు లెక్కిస్తున్నారన్నారు. భూ కుంభకోణాలు, ఫార్మా విలేజ్ పేరుతో దౌర్జన్యాలు, పేద, గిరిజన రైతుల కుటుంబాల మీద అర్ధరాత్రి బందిపోట్ల మాదిరిగా పోలీసులు దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాపాలు పండే రోజు దగ్గర్లోనే ఉందని హెచ్చరించారు. అమాయక రైతులను నాలుగు రోజులు జైల్లో పెట్టొచ్చు.. కానీ ఆయనకు మళ్లీ రాజకీయ జీవితం లేకుండా చేసే బాధ్యత మీ మీద ఉందని సూచించారు. ఆయన వెంట మాజీ మంత్రులు మహమ్మద్ అలీ, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, ఉప్పల్, మేడ్చల్ నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

తార్నాక ఘటనపై సమగ్ర రిపోర్టు అందించాలి

- బీసీ కమిషన్ చైర్మెన్ జి నిరంజన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

"తార్నాక రోడ్లపై ఇంటింటి దరఖాస్తులు" పేరిట ఇటీవల సామాజిక మాధ్యమాల్లో ప్రచురితమైన అంశంపై బీసీ కమిషన్ చైర్మెన్ జి నిరంజన్ సమగ్ర రిపోర్టు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కులాల కుటుంబ సర్వే దరఖాస్తులు రోడ్లపై పడడమేంటని ప్రశ్నించారు. వెంటనే కమిషన్‌కు నివేదిక అందించాలని జవహర్ నగర్ మున్సిపల్ కమిషనర్, మేడ్చల్ జిల్లా కలెక్టర్‌లను ఆయన ఆదేశించారు.

7

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఎల్బీనగర్ -మహేశ్వరం

ఆదివారం | నవంబర్ 24, 2024 | www.navatelangana.com

భూగర్భ డ్రయినేజీని పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-హయత్‌నగర్

మార్నింగ్ వాక్‌లో భాగంగా కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి.. హయత్‌నగర్ డివిజన్‌లోని మైత్రి విహార్ కాలనీలో జలమండలి అధికారులతో కలిసి శనివారం భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్‌ను పరిశీలించారు. తర్వాత కాలనీలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో కాలనీ అధ్యక్షులు వెంకట రామ్ రెడ్డి, సంక్షేమ సంఘం సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, మూర్తి, జలమండలి మేనేజర్ రాజు, సూపర్‌వైజర్ బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం



నవతెలంగాణ-హయత్‌నగర్

ఓ యువకుడు అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద అంబర్‌పేటకు చెందిన ఏదుల అరుణ్ కుమార్..గత నాలుగు నెలల కిందట పెద్ద అంబర్పేటలోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో శాలరీ క్రెడిట్ అయిందని, తెచ్చుకుంటానని చెప్పి రాంనగర్ నుండి పెద్ద అంబర్పేటకు వచ్చాడు. అప్పటి నుండి అరుణ్ కుమార్ పెద్ద అంబర్పేట్‌లోనే ఉంటూ డ్రైవింగ్ పని చేస్తున్నాడు. ఆ తర్వాత గత కొద్ది రోజులుగా అరుణ్ కుమార్‌కు ఫోన్ చేయగా ఫోన్ తీయడం లేదు. దీంతో ఆయన ఆచూకి కోసం వెతికారు. కానీ ఫలితం లేకపోయింది. వెంటనే అరుణ్ కుమార్ తల్లి ఏదుల లత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పేదల సంక్షేమానికి
అధిక ప్రాధాన్యతనిస్తున్న కాంగ్రెస్



- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 4వ డివిజన్ బీఆర్ఆర్ ఎంక్లైవ్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ సంరెడ్డి స్వప్న వెంకట్ రెడ్డితో కలిసి శనివారం మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం ఎంతో కృషి చేస్తుందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అన్ని డివిజన్లలో ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల కృషి మరువలేనిది

నేటి సమాజంలో అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం వైద్యులు చేస్తున్న కృషి అభినందనీయమని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కార్పొరేటర్ సూర్లగంటి అర్జున్‌తో కలిసి శనివారం మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం



సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. శీతాకాలంలో ప్రజలు అనేక రకాల రోగాల బారిన పడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వారి ఆరోగ్య సంరక్షణ కోసం వైద్యులు చేస్తున్న కృషి మరువలేనిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పి.సరస్వతి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, వైద్యాధికారి సుమిత్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల స్థలాన్ని కాపాడండి

- తహసీల్దార్‌కు వినతి



నవతెలంగాణ-నాగోల్

నాగోలు డివిజన్‌లోని బండ్లగూడ ప్రాథమిక పాఠశాల స్థలాన్ని కాపాడాలని కోరుతూ శనివారం బండ్లగూడ ప్రాథమిక పాఠశాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఉప్పల్ మండల తహసీల్దార్ వాణి రెడ్డికి శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. బండ్లగూడ ప్రాథమిక పాఠశాల పక్క భవన నిర్మాణం కోసం 1998 సంవత్సరంలో ఒక ఎకరా స్థలాన్ని కేటాయించారని ఈ స్థలంలో 278 గజాల స్థలం తమకు చెందినదని కొందరు ప్రైవేటు వ్యక్తులు వివాదాన్ని సృష్టించి కోర్టులో దావా వేసినట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అప్పటి రెవెన్యూ అధికారులు ఈ వివాదంలో ఉన్న స్థలం పాఠశాలకు కేటాయించిన స్థలంలో నీ దేనని నివేదికలు అందజేయక కోర్టులో పాఠశాలకు అనుకూలంగా తీర్పు వచ్చిందని తెలిపారు. దీంతో కోర్టులో అనుకూలంగా రావడం పట్ల పాఠశాల నిర్మాణానికి పూనుకోగా సదర్ ప్రైవేట్ వ్యక్తి హైకోర్టులో దావా దాఖలు చేసి పాఠశాల నిర్మాణాన్ని నిలుపుదల చేశారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రస్తుతం బండ్లగూడ ప్రాథమిక పాఠశాల ఒక ప్రైవేటు భవనంలో 2 ఇరుకు గదుల్లో 120 మంది విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన ప్రభుత్వ భూమిని మోఖా మీద సర్వే చేయించి..ఆ భూమిని పాఠశాలకు కేటాయించి, ఆ స్థలంలో పాఠశాల భవన నిర్మాణం చేపట్టాలన్నారు. నిరుపేద పేద విద్యార్థులకు విద్య అందించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సహకరించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో బండ్లగూడ ప్రాథమిక కోటేశ్వర పరిరక్షణ సమితి సభ్యులు సహదేవ్, రాందాసు గణేష్ ఎమ్మెస్ చారి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల విధానం,
మూల్యాంకనం అనే అంశంపై సెమినార్



- హాజరైన ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల యంవీయస్సార్, మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలు సంయుక్తంగా స్వయం ప్రతిపత్తి కలిగిన కళాశాలలో పరీక్షల విధానం, మూల్యాంకనం అనే అంశంపై ఒకరోజు సెమినార్‌ను శనివారం నిర్వహించినట్టు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్లోబలైజేషన్, లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, డిజిటలైజేషన్ (జీఎల్‌పీడీ) విద్యా వ్యవస్థలపై చాలా ప్రభావాన్ని చూపాయన్నారు. కోవిడైజేషన్ అనే కొత్త భావనను పరిచయం చేస్తూ, కోవిడ్-19 మహమ్మారి సమయంలో స్వీకరించిన డిజిటల్ అధ్యయనం, మూల్యాంకన మార్పుల గురించి వివరించారు. కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబిలిటీ(ఏఎస్‌ఆర్) వంటి అంశాలను చర్చిస్తూ, విద్యా వ్యవస్థల్లో డిజిటల్ పాలన, నిరంతర మూల్యాంకన పాత్రను వివరించారు. ఈ సెమినార్ ప్రస్తుత పరీక్షా విధానాలలో ఎదురవుతున్న సవాళ్లు, వాటి పరిష్కారాలపై చర్చించి, ఆవశ్యకమైన ఆవిష్కరణలను ప్రపంచ విద్యా ప్రమాణాలకు అనుగుణంగా అమలు చేయడమే లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. డా. సి.పి. వర్ధని, సీనియర్ డీన్ (పరీక్షలు), సెమినార్ లక్ష్యాలను పరిచయం చేస్తూ, భవిష్యత్తు విద్యను నిర్మించడంలో పరీక్షా సంస్కరణల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. డా. విజయ గుంటూరు, యంవీయస్సార్ ప్రిన్సిపల్, విద్యార్థుల పరిశ్రమ తయారీకి అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు మున్ముందు పాఠ్యాంశాలలో మార్పులు, మెరుగైన మూల్యాంకన పద్ధతుల అవసరాన్ని తెలియజేశారు. పి.వి.ఆర్. కశ్యప్, మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మెన్ ఈ కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ, సమాజం ఎదుర్కొంటున్న కీలక సమస్యలపై చర్చకు వేదికగా ఉండే ఇటువంటి సెమినార్లు తరచుగా నిర్వహించడం అవసరమని చెప్పారు.

జూపూడి సుధాకర్, మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ కోశాధికారి, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పరీక్షా సంస్కరణల ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం, ఐఐటీ, హైదరాబాద్, ఎన్ఈపి 2020లోని నూతన పద్ధతులు, ఆచరణాత్మక బోధన విధానాల గురించి తన అభిప్రాయాలను తెలియజేశారు. రామచంద్ర రావు, అభయ్ ఇంటర్నేషనల్, బెంగళూరు, ప్రస్తుత కాలంలో పాఠాలు, పరీక్షా విధానాల్లో ఎదురయ్యే సవాళ్లపై మాట్లాడారు. ప్రొఫెసర్ అప్పారావు ఎన్ఐటీ, వరంగల్, మూల్యాంకన పద్ధతులు, ఫలితాల ఆధారిత విద్యా వ్యూహాలపై తన అనుభవాలను తెలిపారు. ప్రొఫెసర్ ఎం.ఎల్. సాయి కుమార్ (రిటైర్డ్), ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ప్రైజ్ హైదరాబాద్, తన ప్రసంగాన్ని ప్రదర్శించండి, మార్చండి" అనే మంత్రంతో ముగించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, తెలంగాణ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యదర్శి, ప్రొఫెసర్ ఎం. కుమార్ (ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్), ప్రొఫెసర్ కె. శ్యామల, డీన్ (ఎఫ్ఓఈ) ఉస్మానియా యూనివర్సిటీ, ప్రొఫెసర్ పి. చంద్రశేఖర్, ప్రిన్సిపల్, ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల, డా. కె. శశికాంత్ (కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్), ఓయూ డా. కె.పి. శ్రీనివాసరావు, మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటి కార్యదర్శి, కే. హిరణ్మయి, సభ్యులు, మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ సమాప్తి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ- బడంగ్ పేట్

నేటి సమాజంలో విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించి.. ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం



ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్‌గూడలోని సంకల్ప్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల యాజమాన్యం శనివారం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సంకల్ప్ కళాశాల విద్యార్థులు సాధించిన రాష్ట్ర స్థాయి ఫలితాలతో పాటు కళాశాలలో నిత్యం జరిగే యోగా, ధ్యానం వంటి కార్యక్రమాల గురించి వారికి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి చదువుతోనే సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని అన్నారు. సంకల్ప్ కళాశాల యాజమాన్యం విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందిస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం డి.కృష్ణారెడ్డి, ఈ.మాధుకర్ రెడ్డి, డి.పవన్ శ్రీకాంత్ రెడ్డి, కె.రాజేందర్ రెడ్డి, ఈ. రవీందర్ రెడ్డి, మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఆర్కల.కామేష్ రెడ్డి, ఏ. గీత, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడి హత్య కేసు ఛేదన

నవతెలంగాణ - చంపాపేట్

ఓ యువకుడి హత్య కేసును సంతోష్‌నగర్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న ఇద్దరిని అరెస్ట్ చేయగా.. మరో ఏడుగురి ప్రమేయం ఉన్నట్టు గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. సంతోష్ నగర్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం..సంతోష్ నగర్ ఎంబీ హట్స్‌కు చెందిన మహ్మద్ మోహిత్ ఖాన్(18) పండ్ల చిరు వ్యాపారి. బుధవారం రాత్రి ఒవైసీ కాలనీలోని బర్హాన్షా దర్గా ఉర్సు ఉత్సవాలకు తన సోదరుడు అనస్తో కలిసి వెళ్లాడు. ఉర్సు ఊరేగింపు పూర్తికాగానే ఇద్దరు కలిసి ఇంటికి వెళ్తుండగా మహ్మద్ సాజిద్, షేక్ ఫయాజ్‌తోపాటు ఏడుగురు కలిసి ఒవైసీ కమాన్ ఫజల్ కేఫ్ వద్ద అడ్డగించి..మోహిత్ ఖాన్‌ను కత్తితో ఛాతిపై, పలు చోట్ల దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. గమనించిన స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం ఒవైసీ హాస్పిటల్‌కు తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుడి తండ్రి సాబేర్ ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు విచారణ చేపట్టారు. హత్య కేసులో ప్రమేయం ఉన్న నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. వారి వద్ద నుండి ఒక కత్తి, ద్విచక్ర వాహనం, 7 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

టాటా ఏఐఏ
లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ- అబ్దుల్లాపూర్‌మెట్

పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ కోహెడ రోడ్‌లోని రైస్ మిల్ సమీపంలో వీ ఎస్పీ గ్లోబల్ సర్వీసెస్‌ను హయత్ నగర్ సీఐ నాగరాజు, టాటా ఏఐఏ సీనియర్ ఏజెన్సీ డైరెక్టర్ భరణి యారాడ, సంస్థ వ్యవస్థాపకులు కంది కంటి విజయ్కుమార్‌లు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కందికంటి విజయ్ కుమార్ మాట్లాడుతూ.. మారుతున్న జీవన శైలి దృష్ట్యా ఇన్సూరెన్స్ ప్రాధాన్యత పెరిగిందన్నారు. తప్పకుండా ఇన్సూరెన్స్ భద్రతను కలిగి ఉండాలన్నారు. ఇక్కడి నివాస ప్రాంత ప్రజలకు ఇన్సూరెన్సు, దాని ప్రాముఖ్యతను గురించి అవహగాన కల్పించి, వారి కుటుంబాలకు భద్రత కల్పిస్తూ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యాలయ ప్రారంభంలో అధికారులు జితేంద్ర ఫణి కుమార్, శ్యామ్ రావు, శ్రీధర్ మల్యాల, వెంకటేశ్వర్లు, బిజినెస్ అసోసియేట్ లీడర్స్, అడ్వైజర్స్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్ట్

నవతెలంగాణ- నాగోల్

పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను దొంగలించి సొమ్ము చేసుకుంటున్న దొంగలను పట్టుకున్న ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. నాగోల్ పోలీస్ స్టేషన్ సీఐ ఏ. సూర్య నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. షాపింగ్ కాంప్లెక్స్, ఇంటి ఎదుట నిలిపిన వాహనాలను దొంగిలిస్తున్న నాగోలు డివిజన్ పరిధిలోని సాయి నగర్‌కు చెందిన ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిపారు. వారి వద్ద నుండి రెండు యాక్టివా, ఒకటి యమహా, ఒకటి స్ప్లెండర్, రెండు పల్సర్ వాహనాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. వీటిలో నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందినవి నాలుగు వాహనాలు కాగా చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధికి చెందినవి రెండు వాహనాలుగా గుర్తించినట్టు వెల్లడించారు. మైనర్లను జువినల్ పంపించినట్లు తెలిపారు. అనంతరం నిందితులను పట్టుకున్న నాగోల్ ఎస్హెచ్ఓ ఏ. సూర్య నాయక్, ఎస్ఐ వి.రమేష్, సిబ్బంది పిసి కే. సుభాష్, జే సాయిూష్, మహిళా సిబ్బంది ఎన్. హిమబిందులను ఎల్బీనగర్ డీసీపీ సిహెచ్ ప్రవీణ్ కుమార్ ఐపీఎస్, ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్యలు అభినందించారు.



గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో
ప్రాధాన్యతను కోల్పోయిన క్రీడలు



- రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ మల్‌రెడ్డి రాంరెడ్డి

నవాతెలంగాణ-తుర్కయంజాల్

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే తెలంగాణలో క్రీడలు ప్రాధాన్యతను కోల్పోయాయని, కాంగ్రెస్ సర్కార్ ఏర్పడగానే క్రీడలకు అత్యంత ప్రాధాన్యమిస్తోందని, క్రీడల కోసం రూ.300కోట్ల పైచిలుకు నిధులను కేటాయించిందని రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి ఇంజాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 బాలికల ఇంటర్ డిస్ట్రిక్ట్ స్టేట్ కబడ్డీ 2024-25 టోర్నమెంట్‌ని శనివారం రాంరెడ్డి ప్రారంభించారు. తుర్కయంజాల్ మున్సిపల్ వైస్‌చైర్ పర్సన్ హరితాధన్‌రాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ సర్కార్ స్పోర్ట్స్ అథారిటీని మొత్తం భ్రష్టుపట్టించిందని ఆరోపించారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేనారెడ్డి ఆధ్వర్యంలో క్రీడలతో పాటు, స్టేడియాల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మినీ స్టేడియాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. తొర్రూరులోని దేవాదాయ భూమిలో మినీ స్టేడియం ఏర్పాటుకు సిఫారసు చేశామన్నారు. అదేవిధంగా కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న బాలికలు క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలని, త్వరలో జరగబోయే నేషనల్ గేమ్స్‌లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. నేషనల్ ట్రోఫీ గెలిస్తే తాను స్వయంగా రూ.50వేల బహుమతి ఇస్తానని రాంరెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ వైస్ చైర్మెన్, ఉమ్మడి రంగారెడ్డి డీసీసీబీ చైర్మెన్ కొత్తకుర్మ సత్తయ్య, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ కొశికె ఐలయ్య, కౌన్సిలర్ కంబాలపల్లి ధన్‌రాజ్, నాయకులు నారని శేఖర్‌గౌడ్, టోర్నమెంట్ ఆర్గనైజర్ శ్రీనునాయక్, ఎస్‌జీఎఫ్ స్టేట్ సెక్రటరీ రాంరెడ్డి, యెంక్యా నాయక్, జయత్‌రాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

26న ఇందిరా పార్కులో ధర్నా : సీఐటీయూ



నవతెలంగాణ-హయత్‌నగర్

జాయింట్ ప్లాట్ఫారం ఆఫ్ ట్రేడ్ యూనియన్ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా 26న ఇందిరా పార్కులో జరిగే ధర్నాని జయప్రదం చేయాలని శనివారం ఆటో నగర్ ప్రాంతంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. బడ్జెట్ సవరించాలి, దేశంలో అత్యధిక ధనవంతుల కార్పొరేట్ వర్గాలపై ఆదాయ పన్ను, సంపద టాక్స్ పెంచి విద్య, ఆరోగ్య, వ్యవసాయ రంగాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ బిల్లు 2022ను రద్దు చేయాలన్నారు. 73 షెడ్యూల్ పరిశ్రమల జీవోలను సవరించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. బొగ్గు బ్లాక్‌లను వేలం వేయడాన్ని నిలుపుదల చేయాలని, సింగరేణికి నేరుగా గనులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా కనీస వేతనం 26 వేలకు పెంచాలి, పెన్షన్ పదివేల రూపాయలు అందరికీ చెల్లించాలన్నారు. నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ పాలసీని రద్దు చేయాలన్నారు. కాంట్రాక్టు విధానం రద్దు చేసి, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలను భర్తీ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు అయ్యర్ పెన్షన్ చెల్లించాలన్నారు. ఆహార వస్తువులు, నిత్యావసర వస్తువులపై జీఎస్టీని ఉపసంహరించాలన్నారు. పెట్రోల్, డీజిల్, కిరోసిన్, వంటగ్యాసులపై కేంద్ర ఎక్సైజ్ సుంకాన్ని గణనీయంగా తగ్గించాలని కోరారు. తదితర డిమాండ్లపై జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని ఉద్యోగ, కార్మిక వర్గాలకు, ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సిహెచ్ కృష్ణయ్య, బి.భాస్కర్, మెట్టు లింగం, లింగస్వామి, సుధీర్, మెట్టు నరసింహ, మధు తదితరులు పాల్గొన్నారు.

ధోబీఘాట్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్



నవతెలంగాణ- నాగోల్

ఎల్బీనగర్ నియోజకవర్గంలోని నాగోలు డివిజన్‌లో ఉన్న ధోబీఘాట్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. ఈ నెల 19 నుండి నాగోల్ ధోబి ఘాట్ యందు నిర్వహించిన ఈదమ్మ మాత తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ ధోబిగాట్ ప్లాంటును, కమ్యూనిటీ హాల్, కాంపౌండ్ వాల్‌ను పరిశీలించారు. తర్వాత ధోబి ఘాట్‌లో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధోబి ఘాట్‌లో ప్రహరీ గోడ, కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్ల నిర్మాణ పనులు నిధుల కొరతతో అసంపూర్తిగా మిగిలిపోయాయని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనలో భాగంగా నిధుల కొరతతో సగంలో ఆగిపోయిన, కాంపౌండ్ వాల్, కమ్యూనిటీ హాలు పనులను పూర్తి చేసి..సీసీ రోడ్డు నిర్మాణ పనులను, ప్లాంటు అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా స్థానిక మున్సిపాలిటీ అధికారులతో మాట్లాడి అర్ధాంతరంగా ఆగిపోయిన పనులను పూర్తి చేయిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకులు చింతల సురేందర్ యాదవ్, రజక వృత్తిదారులు, రజక సంఘం నాయకులు, రమేష్, మధు, మహేందర్‌నాథ్, భరత్ కుమార్, వినయ్ కుమార్, కార్తీక్, సూరి, బి. లక్ష్మి, బి.రాదా, శ్వేత, బాలమణి, భాగ్యలక్ష్మి, ప్రియ, అఖిల వైష్ణవి, సత్యశ్రీ, మహేశ్వరి పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



నాగోలు డివిజన్‌లోని బాలాజీ ఎన్క్లేవ్ కాలనీకి చెందిన తల కంటి స్వామి రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న సమయంలో బాధిత కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయం కోసం నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్ యాదవ్‌ను సంప్రదించి.. ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.60 వేల చెక్కు మంజూరైంది. ఈ మేరకు శనివారం షామీర్పేటలోని తన క్యాంప్ కార్యాలయంలో మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ మృతుని కుమారుడు తల కంటి ప్రవీణ్ రెడ్డికి ఆ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్, రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేంద్రనాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ హ్యాక్‌తో రెండు క్రెడిట్ కార్డుల్లో నగదు చోరీ

నవతెలంగాణ-హయత్ నగర్

ఫోన్ హ్యాక్ అయి రెండు క్రెడిట్ కార్డుల్లో నగదు మాయం అయిన ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హస్తినాపురానికి చెందిన పల్లా వెంకట్ రెడ్డి. ఈ నెల 22న ఏపీకే ఫైల్ పీఎం కిసాన్ అందుకున్నాడు. అతనికి తెలియకుండానే ఇన్స్టా హ్యాక్ కావడంతో రెండు క్రెడిట్ కార్డుల్లో ఉన్న 1,35,528 నగదు అపహరణ అయిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేస్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వయోజనులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

● మేడిపల్లి తహశీల్దారు షేక్ హసీనా



నవతెలంగాణ-బోడుప్పల్

18 ఏండ్లు నిండిన వయోజనులందరూ తప్పకుండా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని మేడిపల్లి తహశీల్దారు షేక్ హసీనా తెలిపారు. శనివారం మేడిపల్లి మండల తహశీల్దారు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ జనవరి 1, 2025 నాటికి 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఓటు హక్కు నమోదు కోసం తమ తమ డివిజన్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు సెంటర్‌లో బీఎల్వో వద్ద తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలు నడుస్తాయని తెలిపారు.

వెన్నెల గద్దర్‌కు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు



నవతెలంగాణ- మేడ్చల్

రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా ఇటీవల నియామకమైన డాక్టర్ జీవీ వెన్నెల గద్దర్‌ను శనివారం ఆమె నివాసంలో గుండ్లపోచంపల్లి కాంగ్రెస్ నేతలు మారేపల్లి సుధాకర్, కుండా భానుచందర్, డాక్టర్ ప్రభాకర్, బొమ్మల మైసయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ జీవీ వెన్నెల గద్దర్ మాట్లాడుతూ ఈనెల 25న తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ బాధ్యతలను చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గద్దర్, కాంగ్రెస్ పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యల హాజరై విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు కాంగ్రెస్ నేతలు ప్రజా యుద్ధనౌక, ప్రజా గాయకులు గద్దర్ సమాధిని సందర్శించి నివాళులర్పించారు.

విద్యార్థుల కోసం జేవీవీ కృషి అభినందనీయం : ఎంఈవో బాపురెడ్డి



నవతెలంగాణ-కాప్రా

విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేందుకు జేవీవీ చేస్తున్న కృషి అభినందనీయమని కాప్రా మండల ఎంఈఓ బాపురెడ్డి అన్నారు. శనివారం జన విజ్ఞాన వేదిక కాప్రా మండలం కమిటీ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబురాలు -2024 భాగంగా మండల స్థాయి పరీక్ష డాక్టర్ ఎస్‌రావు నగర్‌లో సెంట్ థెరిస్సా హైస్కూల్లో నిర్వహించారు. పరీక్ష సంబంధించిన ప్రశ్న పత్రాన్ని ఎంఈఓ బాపురెడ్డి, సెంట్ థెరిస్సా హై స్కూల్ ప్రిన్సిపాల్ సుధా మేరీతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జన విజ్ఞాన వేదిక విద్యార్థులలో సృజనాత్మక శక్తిని పెంచే విధంగా, ఇలాంటి పోటీ పరీక్షలను నిర్వహించడం అభినందనీయమన్నారు. పరీక్ష అనంతరం జేవీవీ రాష్ట్ర నాయకులు ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. పరీక్షల్లో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి వచ్చిన విద్యార్థులందరినీ అభినందించి విజేతలందరికీ ప్రశంసా పత్రాలను అందజేశారు. పిల్లలు చదువుతోపాటు పెద్దలపట్ల గౌరవంతో ఉంటూ చెడు వ్యసనాలకు గురికాకుండా ఉన్నత విద్యను అభ్యసించాలని ఆకాక్షించారు. జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ..ఇక్కడికి వచ్చిన ప్రతి విద్యార్థి విజేతలేనన్నారు. వారి విజయంలో ప్రోత్సహించిన తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, భాగస్వాములేనన్నారు. పిల్లల్లో నైపుణ్యతను పెంచడం కోసం ఇలాంటి పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. విద్యార్థులందరూ ఇలాంటి వాటిలో ముందుండి మంచి పేరు తీసుకోవాలని తెలిపారు. మండల స్థాయిలో రాణించి, జిల్లా స్థాయి పరీక్షకు అర్హత సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. డిసెంబర్ ఒకటో తారీఖున జరిగే జిల్లాస్థాయి చెక్‌ముకి పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎన్నిక కావాలని ఆకాంక్షించారు. జేవీవీ జిల్లా నాయకులు శివప్రసాద్ మాట్లాడుతూ కాప్రా మండల పరిధిలో ప్రయివేట్ పాఠశాలలో నుండి సెంట్ థెరిస్సా హై స్కూల్, విజయ హై స్కూల్, శ్రీ చక్రి విద్యా నికేతన్ హై స్కూల్, ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నుండి జెడ్పీహెచ్‌ఎస్ కుషాయిగూడ, జెడ్పీహెచ్‌ఎస్ జవహర్ నగర్, జెడ్పీహెచ్‌ఎస్ బాలాజీ నగర్ ప్రభుత్వ తెలుగు మీడియం నుండి జెడ్పీహెచ్‌ఎస్ బాలాజీ నగర్, జెడ్పీహెచ్‌ఎస్ జవహర్ నగర్, జెడ్పీహెచ్‌ఎస్ కుషాయిగూడ పాఠశాలలు జిల్లా స్థాయికి అర్హత సాధించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు నాగరాజు, రామ్మోహన్, అండాలి, శరత్, సెంట్ థెరిసా ఉపాధ్యాయులు రాహుల్ కృష్ణ, ఎం సందీప్ కుమార్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

అమరులు చూపిన దారిలో నడుస్తాం



బడిగే వెంకటేష్, పెర్క సునీత, అమరుల సంస్మరణ సభ

నవతెలంగాణ - జవహర్ నగర్

అమరులు చూపిన దారిలో స్థానిక ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికి పోరాడుదామని ఇఫ్టూ శ్రామిక స్పందన జంట నగరాల కన్వీనర్ బడిగే వెంకటేష్, ఐపీఓడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి పెర్క సునీత పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో మేరకు శనివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో స్థానిక అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జవహర్ నగర్ ప్రాంతంలో అమరులు చూపిన దారిలో స్థానిక ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ఉద్యమించాలన్నారు. అనంతరం సంతాప సూచికంగా రెండు నిముషాలు మౌనం పాటించి, అమరులకు విప్లవ నివాళులర్పించారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, కేంద్ర, రాష్ట్ర మిలటరీ, పోలీసు క్యాంపులను ఎత్తివేయాలన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, డంపింగ్ యార్డు వలన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో మహ్మద్ రషీద్ ద్రావిడ, ఇఫ్టూ శ్రామిక స్పందన జాతీయ కార్యదర్శి షేక్ షావలి, వికలాంగుల హక్కుల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోనార్క్ దుర్గాప్రసాద్, యమునా, సరిత, రమేష్, కుమ్మరి మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా పరిష్కరిస్తాం



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకున్నట్టు ఘట్కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావనీ జంగయ్య యాదవ్ అన్నారు. శనివారం ఘట్కేసర్ మున్సిపల్‌లో విలీన గ్రామాలైన గణపూర్, అవుషాపూర్, అంకుషాపూర్ గ్రామాల్లో సొంత ఖర్చులతో విద్యుత్ లైట్లను వేయించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ గత కొంత కాలంగా విలీన గ్రామాల్లో వోల్టేజ్ సమస్యతో కొన్ని లైట్లలో విద్యుత్ సరఫరా ఆగిపోయిందని తెలిపారు. వాటి స్థానంలో సొంత ఖర్చులతో 54 నూతన విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రానున్న రోజుల్లో ఇంకా కొన్ని విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, ఘనపూర్ మాజీ సర్పంచ్ లు బద్దం గోపాల్ రెడ్డి, రూప్‌సింగ్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ పరమేష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షులు సంజీవ రెడ్డి, నర్సింహా, అవుషాపూర్ నాయకులు మాధవ రెడ్డి, వామన్ రెడ్డి, సల్మాన్, జంగయ్య, శంకర్, కృష్ణ గౌడ్ దామోదర్ రెడ్డి, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్ డాక్టరేట్

అందజేసిన ప్రఖ్యాత హెచ్‌ఎస్సీ యూనివర్సిటీ



నవతెలంగాణ-బోడుప్పల్

రాజకీయ నేతగా, సామాజిక సేవకుడిగా ప్రజాసేవలో అనేక సేవా కార్యక్రమాలు చేసిన పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్‌కు ప్రఖ్యాత హెచ్‌ఎస్సీ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. శనివారం నగరంలోని సికింద్రాబాద్ హెచ్‌ఎస్సీ యూనివర్సిటీ డైరెక్టర్ బిషప్ ఆనంద్ కుమార్, సలహాదారు డాక్టర్ రమేష్‌లు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయస్సులోనే రాజకీయాల్లో వచ్చిన అమర్ సింగ్ తన బాధ్యతగా పేదలకు సేవ చేస్తూ వచ్చారని గుర్తు చేశారు. పీర్జాదిగూడ కార్పొరేటర్‌గా ఉన్న ఆయన అనతి కాలంలోనే పీర్జాదిగూడ మేయర్‌గా బాధ్యతలు చేపట్టి మరింతగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఇలా పలు రంగాల్లో సేవా చేసినందుకు డాక్టరేట్ ప్రదానం చేశారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు, నాయకులు అమర్ సింగ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

పేదలకు అన్యాయం చేయొద్దు

● 50 గజాల్లో ఇండ్లు కట్టుకున్నవారిని ఇబ్బందులు పెడుతూ నాలా ఆక్రమించుకొని బహుళ అంతస్తులు నిర్మించుకున్న వారిని ఉపేక్షిస్తారా : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

యాభై గజాల్లో ఇండ్లు నిర్మించుకున్న పేదలకు అన్యాయం చెయొద్దని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని జేకే కాలనీ, వడ్డెర బస్తీలో మంజూరైన బాక్స్ డ్రైన్ పనులు సరైన ప్రణాళిక లేకుండా అధికారులు మ్యాప్ చేశారని అన్నారు. 50 గజాల ఏర్పాటు చేసుకున్న రేకుల ఇండ్లకు నష్టం జరుగుతుందని, బాక్స్ డ్రైన్ గురించి తవ్వకాలు మొదలుపెడితే పక్కనే ఉన్న ఇండ్ల పునాదులు కదిలి కూలిపోయే అవకాశం ఉన్నదని తమకు న్యాయం చేయాలనిన స్థానిక కాలనీ వాసులు శనివారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో కలిసి బాక్స్ డ్రైన్ నిర్మించే స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల ఇండ్లకు నష్టం జరిగేలా బాక్స్ డ్రైన్ నిర్మించడం కుదరదని, నాలాలు ఆక్రమించుకొని బహుళ అంతస్తులు నిర్మించుకున్న వారిని ఉపేక్షించిన అధికారులు, 50 గజాల స్థలంలో ఇండ్లు కట్టుకున్న పేద ప్రజలకు అన్యాయం చేయడం సమంజసం కాదన్నారు. ప్రజలకు నష్టం జరిగే ఏ ఒక్క పనికి కూడా తన సహకారం ఉండదన్నారు. ప్రత్యామ్నాయ మార్గం నుండి బాక్స్ డ్రైన్ నిర్మించే విధంగా మ్యాపింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ సత్యాలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు బద్దం పరశురామ్ రెడ్డి, చందు, శేఖర్ గౌడ్, పేపేర్ సీను, జె కె సాయి గౌడ్, శివకుమార్ గౌడ్, వడ్డెర రాజులు, స్థానిక మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి సహకరిస్తా

● మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మౌలాలి డివిజన్ అభివృద్ధికి సహకరిస్తానని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. శనివారం మౌలాలి డివిజన్ పరిధిలోని సాయినాథ్ పురం ఆఫీసర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన ఓ ప్రత్యేక సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని, కాలనీలో స్థానికంగా ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు తమకు షెడ్డు వేయడానికి సహకరించి, పార్కు అభివృద్ధికి సహకరించినందుకు మైనంపలికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ మల్కాజిగిరి బీ బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, కాంగ్రెస్ మౌలాలి డివిజన్ అధ్యక్షులు పోతుల వినోద్ యాదవ్, చంద్రశేఖర్, చుంకు శ్రీనివాస్, లోహిత్ రెడ్డి, వేంకటేశ్వర రావు, వంశీ, మోహన్, శ్రీనివాస్, సలీం, ఫారుక్, లోకనాథం, సంపత్ గౌడ్, మిర్యాల రామచందర్, ఇస్తారి, తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుడిపై ఏసీపీ ప్రతాపం

● కొడుకుతో తగాద పెట్టుకున్నాడని పోలీస్ రుసరుస
● దాడిచేసిన అధికారిపై ఎదురు తిరిగిన స్థానికులు
● మేడిపల్లి పీఎస్‌లో బాధితుల ఫిర్యాదు



నవతెలంగాణ-బోడుప్పల్

ఓ అమాయకుడిపై పోలీసు ఉన్నతాధికారి దౌర్జన్యానికి దిగడం అందరినీ నివ్వెరపరిచింది. తన కొడుకుతో తగాదాకు దిగాడని రుసరుసలాడిన సదరు అధికారి.. ఆ అమాయకుడితోపాటు మరో వ్యక్తిపై దాడికి దిగాడు. ఈ దౌర్జన్యాన్ని చూడలేని స్థానికులు పోలీసు అధికారికి ఎదురు తిరగడం గమనార్హం. మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన "సామాన్యులకు రక్షణ ఎక్కడ" అనే ప్రశ్నలను లేవనెత్తుతోంది. పూర్తి వివరాల్లోకి వెళితే..రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి చెంగిచెర్లలోనీ హెచ్‌పి పెట్రోల్ బంక్‌లో కనకదుర్గ కాలనీలో నివాస ముంటున్న లక్ష్మీనారాయణ పెట్రోల్ పోసుకొని వెళ్తుండగా వెనుక ఉన్న ఏసీపీ కొడుకు బైక్‌కు లక్ష్మీనారాయణ బండి తగిలింది. దీంతో ఇద్దరి మధ్య మాటమాట పెరగడంతో బైక్ తాళం తీసుకొని నీ సంగతి చెపుతానంటూ తన తండ్రి ఆక్టోపస్ ఏసీపీ అరుణ్ కుమార్‌కు ఫోన్ చేసి పిలిపించాడు. దీంతో ఏసీపీ అరుణ్ కుమార్ హడవుడిగా పెట్రోల్ బంక్‌కు పోలీస్ స్టిక్కర్‌తో ఉన్న స్కార్పియో వాహనంలో వస్తూనే లక్ష్మీనారాయణతో పాటు అడ్డుగా వచ్చిన వ్యక్తి గల్లా పడుకొని ఇష్టారాజ్యంగా బూతులు తిడుతూ పోలీస్ వాహనం ఎక్కించే ప్రయత్నం చేయగా అక్కడి ప్రజలు ఎదురుతిరిగి మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏసీపీపై ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల సాక్షిగా పోలీస్ అధికారి సామాన్యులపై ప్రతాపం చూపిస్తే తమకు రక్షణ ఎక్కడ అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

ఫిర్యాదు అందింది విచారణ చేస్తున్నాం
-మేడిపల్లి సీఐ గోవింద్ రెడ్డి

వాహనాలు తగిలిన సంఘటనలో ఇరు వర్గాల వ్యక్తులు పరస్పరం దాడులు చేసుకున్న సంఘటనపై ఇరు వైపులా నుండి ఫిర్యాదులు వచ్చాయి. సంఘటన జరిగిన స్థలంలో ఉన్న సీసీ టీవీ పుటేజీ ఆధారంగా విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం.

నాలా పనుల కోసం కార్పొరేటర్ నిరసన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి డివిజన్ బాలసరస్వతీ నగర్‌లో వరద నీటి నివారణకు నాలా పనులు జరుగుతున్నాయని, అయితే ఈ పనులలో నాలా పనులు పలు ప్రయివేట్ భూముల నుండి వెళ్తున్నాయని, దీనికోసం ల్యాండ్ అక్విరె చేసుకొనుటకు ఇంజనీరింగ్ విభాగం అధికారులు ప్రతిపాదనలను తయారు చేయగా కార్పొరేటర్ ల్యాండ్ అక్విసిషన్ ఆఫీసర్‌తో మాట్లాడి శాంక్షన్ చేయించారు. కాగా స్థానిక అధికారుల నిర్లక్ష్యంతో ఫైల్ పలు చోట్ల ఆగిపోయింది. ఎన్నో సార్లు చెప్పినా అధికారుల తీరులో మార్పు లేకపోవడంతో కార్పొరేటర్ శ్రవణ్ స్థానిక మహిళలతో కలిసి టౌన్ ప్లానింగ్ కార్యాలయంలో బైటాయించి శనివారంనిరసన తెలిపారు. దీంతో జీహెచ్‌ఎంసీ మల్కాజిగిరి సర్కిల్ డీసీ రాజు వద్ద ఆగి ఉన్నట్లు తెలుసుకున్న అధికారులు ఫైల్ క్లియర్ చేసి ప్రధాన కార్యాలయానికి పంపడంతో నిరసన ముగించారు. ఈ కార్యక్రమంలో సుమతి, లక్ష్మి, గీతా, సుబ్బారావు, రమేష్ మహేష్, నవీన్, మోహన్ లాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ-కీసర

దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని సిద్దార్థ నగర్ కాలనీ కమ్యూనిటీ హాలులో శనివారం నూతనంగా ఏర్పడిన ఆర్యవైశ్య సంఘం దమ్మాయి గూడ మున్సిపాలిటీ మొదటి నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం ఇంగు వెంకటేశం గుప్తా చేయించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆర్యవైశ్య సంఘం మహాసభ అధ్యక్షుడు బెలిదె రమేష్ గుప్తా, బచ్చు నగేష్ గుప్తా, బల్లి శ్రీనివాస్ గుప్తా, బెజుగం శ్రీనివాస్ గుప్త, రెబెల్లి శ్రీనివాస్ గుప్త, శ్రావణ్ గుప్తా, కీసర మండల పరిధిలోని వైశ్య సంఘం నాయకులు, మండల, జిల్లా సంఘం నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఇంగు వెంకటేశం గుప్తా ఆర్య వైశ్య మహాసభ ఉద్దేశ్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ అధ్యక్షుడు రాము మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధికి పాటు పడతామన్నారు. రాబోయే మూడేండ్లలో మేడ్చల్ జిల్లాలోనే ఆదర్శ వంతమైన సంఘంగా రూపుదిద్దు కుంటుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు సంఘం సభ్యులు, మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మల్లాపూర్‌లో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ - చర్లపల్లి

మల్లాపూర్ సబ్ స్టేషన్ 33/11కేవీ పరిధిలోని బెల్ ఫీడర్ పరిధిలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని మల్లాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లాపూర్ఇండస్ట్రియల్ ఏరియా, నోమ ఫీడర్ పరిధిలో చాణిక్య నగర్, సూర్య నగర్, గోకుల్ నగర్, చాణిక్యపురి, మోడీ వెంచర్స్, చండియా నగర్, బాబా నగర్, ఎస్ వి నగర్, గ్రీన్ హిల్స్ కాలనీ, న్యూ భవాని నగర్, బ్రహ్మపురి కాలనీ, వెంకటరమణ కాలనీ, నాగలక్ష్మినగర్, పటన్ బస్తీ, జన్నురం, మల్లాపూర్ విలేజ్ భవాని నగర్, కె ఎల్ రెడ్డి నగర్, హెచ్ సి ఎల్ కాలనీ, మల్లాపూర్ విలేజ్ (పార్ట్), ఎస్ వి నగర్, మై ఫ్లవర్ పార్క్, మల్లాపూర్ మస్జిద్, పాఠన్ బస్తీ ప్రాంతాలలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

పట్నం నరేందర్‌ను పరామర్శించిన నాయకులు



నవతెలంగాణ - చర్లపల్లి

చర్లపల్లి జైల్లో ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని, జైల్లో ఉన్న లగచర్ల రైతులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. కేటీఆర్‌తో పాటు నరేందర్ రెడ్డి భార్య, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, సాయి జెన్ శేఖర్, తదితరులున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

● నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి
● కేజీఆర్ కళాశాలలో రక్తదాన శిబిరం



నవతెలంగాణ-కీసర

ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడటంలో రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తారని నాగారం మున్సిపల్ కమిషనర్ ఎస్ భాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలోని కేజీఆర్ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్ పారిశ్రామిక వేత్తల విభాగం సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజం మనకేం చేసిందని కాకుండా మనం సమాజానికి సాధ్యమైన మేరకు సాయం చేయాలన్నారు. రక్తదానం ఒక మహత్తరమైన దానమని ఎన్నో ప్రాణాలకు ఆసరా అని అన్నారు. ఒక్క సారి రక్త దానం చేస్తే తిరిగి తాజా రక్తం ఉత్పత్తి అవుతుందన్నారు. రక్తదాతలకు ఎప్పుడైనా రక్తం అవసరమైతే రక్తాన్ని పొంద వచ్చని ఆర్గనైజర్లు తెలిపారు. ఈ శిబిరంలో కళాశాల చైర్మెన్ గోవిందరెడ్డి, ప్రిన్సిపాల్ విజయ కుమార్ రక్తదానం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ రమణ రావు, నాగరాజు, సింధూజ, రాజశేఖర్ రెడ్డి శిల్పిక, పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ - పోచారం

ఘట్కేసర్ మండలం పోచారం మున్సిపల్ పరిధిలో శనివారం పోచారం మున్సిపల్ కార్యాలయంలో ఎడ్ల చిన్నకు రూ. 19500, కొలగాని విఘ్నేష్‌కు రూ.12,500 సీఎంఆర్ఎఫ్ చెక్కులను మున్సిపల్‌చైర్మెన్ కొండల్‌రెడ్డి పంపిణీ చేశారు. సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు

సంక్షేమ వెల్ఫేర్ హాస్టల్స్ తనిఖీ



● మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

నవతెలంగాణ-కీసర

కీసర మండలంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ హాస్టళ్లను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టళ్లలోని వంట గదులను, స్టోర్ రూమ్, భోజనశాలలను పరిశీలించారు. విద్యార్థుల అవసరాలను తీర్చాలని వారి భద్రత పట్ల శ్రద్ధ చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్, తహశీల్దార్ అశోక్ కుమార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు పరిశీలన



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి, పర్వతాపూర్ ప్రధాన రోడ్డుకు మరమ్మతు పనులను రెండో డివిజన్ కార్పొరేటర్ సుభాష్ నాయక్, 15వ డివిజన్ కార్పొరేటర్ బండారి మంజుల రవీందర్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరద నీటి కారణంగా గుంతలు పడడంతో గత కొన్నేండ్లుగా ప్రజలకు ఇబ్బందులు పడుతుండడంతో శాశ్వత పరిష్కారం చేపడుతున్నామన్నారు. సమగ్ర కుటుంబ సర్వే కారణంగా పనుల్లో జాప్యం జరిగినా ఎట్టకేలకు శనివారం గ్రీన్ ల్యాండ్ కాలనీ కమాన్ నుండి పంచవటి కాలనీ రోడ్డు నెంబర్-2 వరకు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయన్నారు. రెండో డివిజన్‌ను ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కొందరి అత్యుత్సాహంతో అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, వారికి ఈ పనులు చెంప పెట్టులా బుద్ధి చెప్తాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవీందర్, జయేందర్, బలరాం, వీజీ కాలనీ అధ్యక్షులు ఆర్. పాపయ్య, సుకురు, సౌత్ పంచవటి కాలనీ అధ్యక్షులు నరసింహారావు, నాగేశ్వరరావు, పంచవటి కాలనీ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన డ్రయినేజీ పనులు ప్రారంభం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

నేరేడ్ డివిజన్ యాప్రాల్ పరిధిలోని చిన్న కందిగూడలో డ్రయినేజీ వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు దృష్టికి తీసుకుపోగా వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి చిన్న కందిగూడలో డ్రయినేజీ నిర్మాణానికి రూ. 20లక్షల ఫండ్‌ను సాంక్షన్ చేయించారు. శనివారం నేరేడ్‌మెట్ డివిజన్ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో డ్రయినేజీ నిర్మాణా పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేండ్లుగా డ్రయినేజీ వ్యవస్థ లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి చొరవతో డ్రయినేజీ సమస్య పరిష్కారం కానుందన్నారు. సమస్యలను తమ దృష్టికి తెస్తే మైనంపల్లికి చెప్పి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నేరేడ్‌మెట్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ ఎస్ఆర్ ప్రసాద్, ఇందిరా చంద్రశేఖర్, కుట్టి శ్రీనివాస్ యాదవ్, కె చెన్నారెడ్డి, గోకుల్, మహేష్, లింగం, మహేందర్ కుమార్, కే ప్రవీణ్ కుమార్, రామ్ కుమార్, అనిల్ కుమార్, రాజేష్, రాజశేఖర్, వెంకటేష్, కె సురేందర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి

- కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్



నవతెలంగాణ - చర్లపల్లి

మహిళలు అన్ని రంగాల్లో స్వశక్తితో ఎదగాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ అన్నారు. శనివారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా డివిజన్‌లోని మహిళలకు గ్రైండింగ్ మిషన్లు, సామాగ్రి పంపిణీ చేశారు. మహిళలు స్వశక్తితో ముందుకు సాగేలా వారికి కొన్ని ఆధునిక గ్రైండర్ మిషన్ పరికరాలను అందజేశారు. వాటితో స్వయం ఉపాధి పొంది మరికొంత మందికి ఆదర్శంగా నిలబడేలా చేయూతనిచ్చారు. డివిజన్‌లోని మహిళా రాజకీయ నాయకురాళ్ల కుటుంబం కోసం స్వయంగా ఉపాధి పొంది గొప్ప స్థాయికి ఎదగాలని కార్పొరేటర్ ఆశించారు. గ్రైండింగ్ మిషన్ తీసుకున్న వారిలో చర్లపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సత్యమ్మతో పాటు, నవనీత, సంధ్య, రమారెడ్డి, నిర్మల, అరుణ, మున్ని, గిరిజ, శిరీష ఉన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అపస్మారక స్థితిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... కేపీహెచ్‌బీ రోడ్డు నెం:3లో అపస్మారక స్థితిలో ఉన్న ఒక అజ్ఞాత పురుషుడు కనిపిం చాడు. అతన్ని గమనించిన స్థానికులు 108కి కాల్ చేయగా, అంబులెన్స్ సర్వీస్ ఆ ప్రదేశానికి చేరుకుని.. ఆ వ్యక్తి బాధపడుతూ ఉన్నట్టు గుర్తించారు. వెంటనే అతనిని గాంధీ ఆస్పత్రికి తరలిం చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. అతను అపరిచితుడు, బిచ్చగాడు అని తెలిసింది. అనారోగ్య సమస్యల కారణంగా అతను మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పలు ప్రాంతాల్లో ప్రజాపాలన కళాయాత్ర



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలు-2024"లో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా 'తెలంగాణ సాంస్కృతి క సారథి' కళాకారుల 2 బృందాలు "ప్రజా పాలన కళాయాత్ర" శనివారం నిర్వహిం చారు. ఇందులో భాగంగా శామిర్‌పేట మండలం తూముకుంట మున్సి పాలిటీ శామిర్‌పేట, బాబాగూడ, బొమ్మరాసిపేట పరిసర ప్రాంతాల్లో, దుండిగల్ మున్సిపల్ పరిధిలోని మల్లంపేట్, బౌరంపేట్, శంభీపూర్‌లలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పాటలతో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమాల్లో దుండిగల్ మున్సిపల్ కమిషనర్ కె.సత్యనారాయణ, మేనేజర్ సునంద, రాంచందర్, రవీందర్ రెడ్డి, పెంటేష్, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో 30వ స్నాతకోత్సవం



- పాల్గొన్న ఎల్టీఐ మైండ్‌ట్రీ అధ్యక్షులు సుధీర్ చతుర్వేది

నవతెలంగాణ-దుండిగల్

ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగంలో ఉన్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎల్టీఐ మైండ్‌ట్రీ అధ్యక్షులు సుధీర్ చతుర్వేది తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి పరిధిలోని విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (వీజేఐఎం) బాచుపల్లి క్యాంపస్ కళాశాలలో 30వ స్నాతకో త్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సుధీర్ చతుర్వేది మాట్లాడుతూ ఇప్పుడున్న పరిస్థి తులలో సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు సర్వం అందు బాటులో ఉందన్నారు. కానీ, నిజాయితీగా చెప్పాలంటే అత్యంత అనిశ్చిత కాలంలో ఉన్నామన్నారు. భౌగోళిక, వాతావరణ, జనాభా, శక్తి సంక్షోభంలో ఉన్నామని.. ఆర్టిఫి షి యల్ ఇంటెలిజెన్స్ ఆధారిత మార్పులను ఎదుర్కొంటు న్నామని తెలిపారు. అయితే, ప్రతి సంక్షోభం ఒక ప్రమా దాన్ని, ఒక అవకాశాన్ని అందిస్తుందని ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడం అంత సులభం కాదన్నారు. దీని కోసం పోరాడాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాలను చేజిక్కిం చుకోవడానికి కొన్ని విషయాలలో జాగ్రత్తగా ఉండాల న్నారు. ఉత్సుకతతో ఉండాలని తెలిపారు. మనలో ఉన్న ప్రత్యేకతను తెలుసుకోవాలన్నారు. దానిని సమర్థవంతంగా ఉపయోగించాలని. ధైర్యంగా శక్తివంతంగా ఉండాలని తెలి పారు. పాజిటివ్ దృక్పథం అలవర్చుకోవాలన్నారు. మంచి వ్యక్తిగా ఉండాలని పేర్కొన్నారు. శాంతి దూతగా పేరు తెచ్చుకోవాలన్నారు. పని పూర్తి చేసే వ్యక్తిగా గుర్తింపు పొందాలన్నారు. మార్పు తీసుకురావడానికి ప్రయత్నించా లన్నారు. ఈ సందర్భంగా విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ భరత్ భూషణ్ సింగ్ మాట్లాడుతూ నాణ్యత, నిజాయితీ విజ్ఞాన ఇనిస్టిట్యూట్ ప్రధాన విలువలు అన్నారు. ఈ విలువలను కొనసాగించ డానికి నిబద్ధతతో ఉన్నామని , ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, థాయ్‌లాండ్, హార్వర్డ్ బిజినెస్ పబ్లికేషన్‌తో విద్యాపరమైన సహకారాలు ఉన్నాయని తెలిపారు.

ఈ సందర్భంగా విజ్ఞాన జ్యోతి వైస్ ప్రెసిడెంట్ వీ రాజశేఖర్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోని అగ్రశ్రేణి ప్రైవేట్ బిజినెస్ స్కూల్‌లలో వీజేఐఎం ఒకటిగా ఉంద న్నారు. వీజేఐఎం మన దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థులలో కూడా అత్యంత డిమాండ్ ఉన్న వ్యాపార పాఠశాలల్లో ఒకటిగా మారాలని కోరుకుంటున్నా నన్నారు. 2024లో వ్యాపారం, పరిశ్రమలు, నిర్వహణ విద్య ల్యాండ్‌స్కేప్‌ను రూపొందించే ముఖ్యమైన సమస్య లను పరిష్కరించడం అత్యవసరం అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అత్యంత వేగంగా విస్తరిస్తుందన్నారు. వ్యాపా ర కార్యకలాపాల నుంచి కస్టమర్ సర్వీస్ వరకు దాని పరిధి విస్తృతం అవుతుందన్నారు. మా విద్యార్థులు ఈ సాంకేతిక తను ఉపయోగించడంలో నైపుణ్యం పొందడం అత్యంత అవసరమని అన్నారు. వ్యాపారులు సైబర్ బెదిరింపులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సైబర్ భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. అనంతరం ప్రతిభ సాధించిన విద్యార్థులకు మెడల్స్' సర్టిఫికెట్లు అందజేశారు ఈ కార్యక్రమంలో విజ్ఞాన జ్యోతి జనరల్ సెక్రటరీ కోడె దుర్గా ప్రసాద్, విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ చైర్మన్ కే హరిశ్చంద్ర ప్రసాద్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఆర్ ఇనిస్ట్యూట్ ఆఫ్ ఫార్మసీలో యూనివర్శిటీ ఆఫ్ ఫ్రైండ్లే యూఎస్‌ఏ ఇన్నోవేషన్స్ సదస్సు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలి టీ పరిధిలోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ, నవంబర్ 22, 23వ తేదీల్లో "అంతర్జాతీయ ఆరోగ్య సంర క్షణలో అభివృద్ధి చెందుతున్న. అవకాశాలను అన్వేషించ డం" అనే థీమ్‌తో రెండు రోజల పాటు యూనివర్శిటీ ఆఫ్ ఫైండ్లే, యుఎస్‌ఏ, అవేనిడ ఇన్నోవేషన్స్, హైదరాబాద్ అంతర్జాతీయ సదస్సును నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ మొదలైన భారతదేశం అంతటా వివిధ రాష్ట్రాల నుండి దాదాపు 400 మంది ప్రతినిధులు నమోదు చేసుకుని ఈ సదస్సులో పాల్గొన్నారు. దాదాపు 80 మంది విద్యార్థులు మౌఖిక పోస్టర్ ప్రదర్శనల పోటీలలో చురుకుగా పాల్గొ న్నారు. ఈ సదస్సు కార్యక్రమంలో జెఎన్‌టీయూ హైదరాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ సునీతారెడ్డి, యూనివర్సిటీ ఆఫ్ ఫైండ్‌లే ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్, ఫార్మ్ యూనివర్సిటీ ఆఫ్ ఫైండ్‌లే విద్యార్థులు, సువర్ణ స్వాస్థ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ విజయ్, అవెనిడా ఇన్నోవేషన్స్ సీఈవో డాక్టర్ కార్తీక్, పలు బహుళజాతి కంపెనీలు, ఆస్పత్రులకు చెందిన పలువురు పరిశ్రమ నిపుణులు సదస్సులో పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ అవకాశాల గురించి పాల్గొనే వారికి అవగాహ న కల్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఆర్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మెన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ ఈ సదస్సు నిర్వాహకులందరికీ అభినందనలు తెలిపారు. విద్యార్థులు ప్రస్తుత అప్‌డేట్‌లపై అవగాహన పొందేందుకు ఈ తరహా సదస్సులు దోహదపడతాయని ఆయన అన్నారు. ఇంకా కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నక్కా జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణాభ మల్లిక్, ఆర్గనైజింగ్ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యలకు పరిష్కార మార్గాలు చూపాలి..



- రెక్టర్ ప్రొఫెసర్ విజయ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

సమాజంలో పాతుకుపోయిన సమస్యలకు పరిష్కార మార్గాలను చూపేలా నూతన ఆవిష్కరణలు చేయాలని రెక్టర్ ప్రొఫెసర్ విజయ్ కుమార్ రెడ్డి అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జెఎన్టీయూహెచ్) యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీలో నూతన విద్యార్థులకు ఘనంగా స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ రెక్టర్ ప్రొఫెసర్ విజయ్ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యా రు.ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ రెక్టర్ ప్రొఫెసర్ విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జెఎన్టీయూలో ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థికి అభినందనలు తెలిపారు. వినూ త్నమైన టీజర్ల ప్రదర్శన ద్వారా అనేక ఆవిష్కరణలను పరిచయం చేయడం చూసి గర్వపడుతు న్నాన్నారు. రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం లో ఉన్న సదుపాయాలను సమర్థవం తంగా వినియోగిం చుకోవాలన్నారు. అధునాతన ప్రయోగ శాలలు, లైబ్రరీ, ఇండోర్ స్టేడియం, క్రికెట్ గ్రౌండ్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్ కోర్ట్ వంటి అన్ని వనరులు విద్యార్థుల అభివృద్ధికి దోహదపడతాయన్నారు. విద్యార్థులు తమ రంగాలలో వినూత్న ఆలోచనలు చేయాలని, విజ్ఞానాన్ని విస్తరించుకోవాలని ఈ కార్యక్రమం ద్వారా పిలుపు నిచ్చా రు. క్యాంపస్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్.నరసింహరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో స్నేహభావంతో ఉండాలన్నారు. యూనివర్సిటీ కాలేజీలో 2024-25 విద్యా సంవత్సరానికి పలు డిపార్ట్‌మెంట్‌లో చేరిన విద్యార్థు లకు కాలేజీలో చదువుతున్న ఆయా డిపార్ట్‌మెంట్ విద్యార్థు లు స్వాగతం తెలియచేశారు. పలు సంస్కృతీ కార్యక్రమం లో విద్యార్థులు నిర్వహించడం జరిగింది. కొత్తగా చేరిన విద్యార్థులు యూనివర్సిటీ కాలేజీ లో గల పలు సౌకర్యాలు ల్యాబ్‌లు ఆయా డిపార్ట్‌మెంట్‌లో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం పూర్తి స్థాయిలో కొత్త విద్యార్థులకు పెద్ద స్క్రీన్ మీద చూపించారు. ఈ కారక్రమా నికి బోధన భోదనేతరా సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రొఫెసర్ వి.పార్వతి సిఆర్‌సి చైర్మెన్ అధ్వర్యంలో జరిగింది.

అభివృద్ధి పనులలో నాణ్యత పాటించాలి



- కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అభివృద్ధి పనులలో నాణ్యత పాటించాలని బాలాజీ నగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు అన్నారు. శనివారం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నం 5, జెన్ హాస్పిటల్ వద్ద , రోడ్ నెంబర్ 2, హనుమాన్ గుడి వెనుక నూతన డ్రయినేజీ పైప్ లైన్‌ను స్థానిక కార్పొరేటర్ విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బం ది కలగకుండా సాధ్యమైనంత త్వరగా పనులను, నాణ్యత లోపం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. నాయకులు పాతూరి గోపి, నాగేశ్వర్ రావు, జాన్ మోసెస్, నాగేశ్వర్ రావు, కృష్ణా, స్వప్న, మమత, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మధు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా హత్య కేసును చేధించిన దుండిగల్ పోలీసులు

- మహిళపై ఉన్న సొమ్మును కాజేయడం కోసం నమ్మించి హత్య చేసిన మరో మహిళ
- రూ.2 లక్షలు విలువ గల సొమ్మును స్వాధీనం చేసుకొని మహిళను రిమాండ్‌కు తరలించిన పోలీసులు



నవతెలంగాణ-దుండిగల్

మహిళపై ఉన్న సొమ్మును కాజేయడం కోసం పథకం ప్రకారం ఆమెను నమ్మించి హత్య చేసిన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆమెను నిజా మాబాద్ నుంచి తీసుకొని దుండిగల్ మున్సిపల్ పరిధిలోకి తీసుకువచ్చి, కల్లు త్రాగించి నిర్మానుష్య ప్రదేశంలోకి తీసు కెళ్లి తలపై కర్రతో దాడి చేసి హత్య చేసింది. ఆమెపైనున్న సొమ్ముతో పరారైంది. పోలీసులు విచారణ చేపట్టి పూర్తి ఆధారాలతో హత్య చేసిన మహిళను అరెస్టు చేసి మీడియా సమక్షంలో శనివారం రిమాండ్‌కు తరలించారు. పోలీసు లు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల14వ తేదీన రాత్రి 8 గంటల సమయంలో మొబైల్ పోలీస్ వాహనానికి ఫోను ద్వారా దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని కాకతీయ లేఅవుట్ సర్వేనెంబర్ 62-1-ఏ1 బహదూర్‌పల్లి నిర్మా నుష్య ప్రదేశంలో సుమారు 40 -45 సంవత్సరాల వయ సు గల గుర్తు తెలియని మహిళ మృతదేహం పడి ఉందని.. సమాచారం అందడంతో సంఘటన స్థలానికి పోలీసు లు చేరుకున్నారు. కేసు నమో దు చేశారు. మేడ్చల్ అసిస్టెంట్ కమిషనర్ బి.శ్రీని వాస్ రెడ్డి ఆదేశాలతో దుండిగల్ సీఐ.పి.సతీష్ నేతృత్వంలో.. కేసు దర్యాప్తు కొనసాగించారు. ఎట్టకేలకు పూర్తి ఆధారాలతో నేరస్థురాలు గంగమణిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

నిజామాబాద్ జిల్లా బాన్సువాడ, సంగమేశ్వర కాలనీకి చెందిన బుసి బోయిన గంగమణి, భర్త నరసింహులు లేబర్ వృత్తి కొనసాగిస్తూ ఉండేవారు. నేరచరిత గల గంగమని అదే ప్రాంతానికి చెందిన నాగయ్య, భార్య అంజమ్మ వృత్తి లేబర్. మహిళ బంగారం కాజేయడం కోసం గంగమని పథకం ప్రకారం అంజమ్మను నమ్మించి.. హైదరాబాదులోని దుండిగల్ మున్సిపాలిటీ గండి మైసమ్మకు తీసుకువచ్చి కల్లు కాంపౌండ్‌లో మద్యం తాగించింది. దగ్గరలోని కాకతీయ లేఅవుట్ నిర్మానుష్య ప్రదేశంకు తీసుకువచ్చి గంగామణి తనతో తెచ్చుకున్న కర్ర తో అంజమ్మ తలపై మోదీ హత్య చేసింది. ఒంటిపైనున్న బంగారు గొలుసుతోతో పాటు, వెండి పట్టీలు, ఫోన్ తీసు కుంది. ఏమి తెలియనట్లు గంగమణి వెళ్లి పోయింది. పోలీ సులు విచారణలో భాగంగా వారిరువురు బోధన్ డిపోకు చెందిన బస్సులో జీరో టికెట్ పై వచ్చారని, వెళ్లేటప్పుడు ఒక్క గంగమనే వెళ్లిందని సీసీ పుటేజీలతో సహా పోలీసులు సమాచారం సేకరించారు. నిందితురాలు గంగమణి హత్య చేసిందని నిర్ధారణ కావడంతో.. ఆమె వద్దనుండి సొమ్ము ను, సెల్ ఫోను, ఆభరణాలు స్వాధీనం చేసుకొని పోలీసు అధికారులు మీడియా సమావేశం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ మేడ్చల్ జోన్ ఎన్ కోటిరెడ్డి, మాట్లా డుతూ ఈ కేసులో సీసీ పుటేజీలు కేసు చేధించేం దుకు దోహద పడ్డాయని గతంలో సైతం పలు కేసులలో అధికారులు, సిబ్బంది ఎంతో చాకచక్యంతో చేదించినం దుకు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ బి.శ్రీనివాస్ రెడ్డి, సీఐ.పి.సతీష్, డిఐ.బి.సతీష్, ఎస్సై.టి.శంకర్, ఎం. రామ్మోహన్ రెడ్డి ఈ వెంకటయ్య, జె .రజినీకాంత్, హమీ ద్, నరసింహ, మేడ్చల్ జోన్ డిప్యూటీ కమిషనర్ అభినందించారు.

'క్రీడలనూ చదువులో భాగం చేయాలి'



నవతెలంగాణ-సిటీబ్యూరో

క్రీడలనూ చదువులో భాగం చేయాలని పలువురు వక్తలు అన్నారు. ది క్రీక్ ప్లానెట్ స్కూల్ వార్షిక క్రీడోత్సవా నికి గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం వేదికైంది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా వింగ్ కమాండర్ శ్రీకాంత్, ఇండియన్ అథ్లెట్ నందిని అగసారా హాజరు కాగా.. అతిథులుగా ది క్రీక్ ప్లానెట్ స్కూల్ చైర్మెన్ బొల్లినేని శ్రీనయ్య, వైస్ చైర్మెన్ పాండురంగా చారి, ఫౌండర్ అండ్ డైరెక్టర్ నరేంద్ర ప్రసాద్, అకడమిక్ హెడ్ జయశ్రీ నాయర్, సీఓఓ డాక్టర్ జీవని గద్దె, అకాడమిక్ ఆఫీసర్ అనుపమ దేవి, వివిధ శాఖల ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విశిష్ట అతిథి క్రీడాజ్యోతిని వెలిగించి విద్యార్థి క్రీడా నాయకులకు అంద జేశారు. మస్కట్ రిలీజ్ చేసి బెలూన్లు గాలిలోకి వదల డంతో కార్యక్రమం ప్రారంభమైంది. సీనర్జిటిక్ ఎక్స్ట్రా విగాంజ దీ బ్లెస్సింగ్ గ్లోరీ ఆఫ్ ది క్రీక్ థీమ్‌తో సాగిన ఈ కార్యక్రమం ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకుంది. విద్యార్థులు ప్రదర్శించిన డ్రిల్స్, మార్షల్ ఆర్ట్స్, యోగా, కరాటే, కోలాటం ఆహుతులను ఆకర్షించాయి. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులందరికీ విశిష్ట అతిథి చేతుల మీదుగా సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేశారు. గతేడాది ఆలిండియా సీనియర్ సెకండరీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, ఉపాధ్యా యులను ఈ సందర్భంగా యాజమాన్యం సత్కరించింది. ఈ క్రీడల్లో దాదాపు 6వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. కొక్కో, కబడ్డీ, ఫుట్బాల్, త్రో బాల్, వాలీబాల్ పోటీల్లో దాదాపుగా 1500 మెడల్స్‌ని విద్యార్థులు గెలుచుకున్నారు. టేబుల్ టెన్నిస్, రన్నింగ్ స్విమ్మింగ్, స్కేటింగ్, చదరంగం వంటి వ్యక్తిగత ఆటల పోటీల్లో 357 బంగారు, 357 రజత, 357 కాంస్య పతకాలను విద్యార్థులు గెలుచుకు న్నారు. 113 విన్నర్, 113 రన్నర్ ట్రోఫీలను వివిధ శాఖల విద్యార్థులు గెలుచుకున్నారు. క్రీడోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో దాదాపుగా 15 వేలకు పైగా సర్టిఫికెట్స్‌ను విద్యార్థులకు అందజేశారు.

కాంగ్రెస్ పథకాలను ప్రజలకు తెలియజేయాలి



- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవు తున్న సందర్భంగా.. ఈ సంవత్సర కాలంలో చేపట్టిన విప్లవాత్మక పథకాల అమలు, కార్యక్రమాలను రాష్ట్రంలోని ప్రతి గడప గడపకు చెరవేసేలా విస్తృత స్థాయిలో కార్యక్ర మాలను చేపట్టాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ంలోని హెచ్ఏఎల్ కాలనీలోని సిటీ ప్యాలెస్‌లో శనివారం ప్రజపాలన విజయోత్సవ సమావేశంలో కూన శ్రీశైలం గౌడ్ పాల్గొని మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల లబ్ధిదారులతో కలిసి పెద్ద ఎత్తున సంబు రాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, నియోజక వర్గ ఇన్‌చార్జి కోలన్ హన్మంత్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతి రెడ్డి, కంటెస్టడ్ కార్పోరేటర్ కూన శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మెన్ బొంగునూరు ప్రభాకర్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు డి.శ్రావణ్ కుమార్, కార్యక ర్తలు, నాయకులు తదితరులుపాల్గొన్నారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

- కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగా రావు అన్నారు. శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్, వెంకటేశ్వర నగర్ మల్లికార్జున వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్, వెంకటేశ్వర నగర్ రోడ్ నెంబర్ 14లో జరుగుతున్న మురుగునీటి పైపులైను(సీవరేజ్), రిక్షా పుల్లర్స్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లలో జరుగుతున్న పనులను సంబంధిత అధికారులు, కాలనీ వాసులతో కలిసి, కార్పొరేటర్ పర్యవే క్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వెంకటేశ్వర్ నగర్ రోడ్ నెంబర్ 13, 14, 21లలో మంజూ రైన సిమెంట్ రోడ్డు పనులను, వీలైనంత తొందరగా ప్రజ లకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సీసీ రోడ్డు పనులలో ఎక్కడ కూడా నాణ్యత తగ్గకుండా ప్రజలకు ఇబ్బంది కలగకుండా, పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు.

ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ శ్రావణి, హెచ్ఎండబ్ల్యూఎస్ ఎస్ బి.మేనేజర్ ప్రియాంక, స్థానిక నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు, లింగయ్య, సోమయ్య, నర్సింలు, రమేష్ రావు పాల్గొన్నారు.

నేడు శెట్టిబలిజ సంఘాల వనభోజన మహోత్సవాలు...



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పవిత్ర కార్తీకమాసం పురస్కరించుకొని ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రగతినగర్, 11 గంటలకు కూకట్‌పల్లి, మధ్యాహ్నం 12:30 కు దిల్ సుఖ్ నగర్, 2 గంటలకు ఈసీఐఎల్ ప్రాంతాల శెట్టిబలిజ సంఘాల ఆధ్వర్యంలో.. నిర్వహిస్తున్న కార్తీకమాస వనభోజన కార్యక్రమాలకు వై.ఎఫ్.సి.ఏ జంట నగ రాల అధ్యక్షులు దంపనబోయిన శ్రీనివాస్‌తో పాటు వై.ఎఫ్.సి.ఏ. కార్య వర్గం, గవర్నింగ్ బాడీ అడ్ హాక్ కమిటీ సభ్యు లు సంయుక్తంగా ముఖ్య అతిథు లుగా హాజరవ్వనున్నట్టు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల శెట్టిబలిజ కుల బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

25 న ఈపీఎస్ -95 పెన్షనర్ల ధర్నాను జయప్రదం చేయండి..

నవతెలంగాణ-దుండిగల్

ఈపీఎస్ పెన్షనర్ల సమస్యలపై ఆల్ ఇండియా కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఈపియస్ పెన్షనర్స్ అసోసియేషన్(ఏఐసీసీఈపీఎఫ్ పిఏ) పిలుపు మేరకు.. 25 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటలకు బర్కత్ పురా ప్రావిడెంట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరుగు తుంది. కావున ఈపీఎస్ పెన్షనర్లు అందరూ హాజరై జయప్రదం చేయాలని (టీపీఆర్‌పీఏ) కూకట్‌పల్లి ఏరియా కమిటీ అధ్యక్షుడు ఎల్‌డీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కే. శంకర్‌రావులు తెలిపారు.



దుండిగల్ మున్సిపాలిటీ వైస్ ప్రెసిడెంట్ గడ్డం.విజయ్ చంద్ర ముదిరాజ్ పుట్టినరోజు సందర్భంగా.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం హన్మంతన్న శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.
నవతెలంగాణ-దుండిగల్



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లిలో శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ14 వార్షికోత్సవంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి.పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు సుఖః సంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు , సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-దుండిగల్

మహారాష్ట్రలో విజయంపై సంతోషం వ్యక్తం చేసిన సురభి..



నవతెలంగాణ-కూకట్‌పల్లి

మహారాష్ట్ర ఎన్నికల్లో మరోసారి ఎన్డీఏ మహాయుతి కుటమి ఘనవిజయం సాధించిన సందర్భంగా.. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి. రవీందర్ రావు తమ సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మీద, ప్రధాని మోది పైన నమ్మకంతో, మహారాష్ట్ర ప్రజలు మహా యుతి కూటమి కి పట్టం కట్టడంతో, ప్రధాని ఆధ్వర్యంలో.. దేశాన్ని ముందుకు నడుపుతూ ప్రపంచంలో అగ్రగామిగా నిలబడుతున్నాడన్న నమ్మకం ప్రజల్లో మరింత బలపడిందన్నారు. కాబట్టి, ప్రజలు బీజేపీ సారథ్యంలోని కూటమికి విజ యం అందించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ ఒరవడి కేవలం మహారాష్ట్రతో ఆగిపోదు.. ఇది ఆరంభం మాత్రమే దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో రాబోయే రోజుల్లో ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని ఆయన దృఢ నమ్మకం వ్యక్తంచేశారు.

కూకట్‌పల్లిలో బీజేపీ నాయకుల సంబురాలు..

మహారాష్ట్ర ఎన్నికల్లో మరోసారి ఎన్.డి.ఎ మహాయుతి కుటమి ఘనవిజ యం సాధించంది. ఈ సందర్భంగా కూకట్‌పల్లి బీజేపీ నాయ కుల సంబరాలు అంబరాన్నంటాయి. కూకట్‌పల్లి డివిజన్‌లోని వడ్డేపల్లి రాజేశ్వరరావు, బీజేపీ క్యాంపు కార్యాలయం వద్దకు, బీజేపీ నాయకులు అందరూ పెద్దసంఖ్యలో చేరుకుని, టపాసులు కాల్చి, స్వీట్లు తినిపించారు. మరాఠా ప్రజలు నరేంద్ర మోడీ నాయకత్వంపై నమ్మకంతో, బీజేపీ కూటమినీ గెలిపించారు. ప్రజల నమ్మకాన్ని మహాయుతి కూటమి కాపాడుతుందని.. భటెన్గేతో కటెంగే' విభజించబడితే అంతం అవుతం కలిసి ఉంటేనే కలదు సుఖము అన్న, బీజేపీనీ మరాఠా ప్రజలు నమ్మి గెలిపించారు అని బీజేపీ నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓ.బి.సి మోర్చ నాయకులు శ్రీనివాస్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు అనంత నాగరాజు, యువ నాయకులు దుర్గాప్రసాద్ రావు, దినేష్, శంకర్ రెడ్డి, విశాల్, సంతోష్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని



నవతెలంగాణ-ఓయూ

ఈ నెల 8 నుంచి 10 వరకు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 14 హ్యాండ్ బాల్ చాంపియన్ షిప్ హైదరాబాద్ జట్టు తరపున 'లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల' విద్యార్థినీ డి.అంజన సౌమ్య అత్యంత ప్రతిభ కనపరిచింది. ఈ నెల 25 నుంచి 29 వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని మహాశముందు జిల్లాలో జరిగే జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనారు. ఆమెకు లిటిల్ ఫ్లవర్ విద్యా సంస్థ చైర్మెన్ డా.కె. సదానంద్, ప్రిన్సిపాల్ మేడమ్ కె.జ్యోతిసదానంద్ ప్రధానోపాధ్యాయురాలు లక్కీ సామ్యూల్, పీఈటీ జి.రమేష్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు. తమ విద్యా సంస్థలాలో విద్యాతో పాటుగా క్రీడలకు పెద్ద పీఠం వేస్తున్నట్లు తెలిపారు. ఆటల ద్వారా గుర్తింపే కాకుండా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని చెప్పారు. పలువురు విద్యార్థిని అభినందిస్తు శుభాకాంక్షలు తెలియజేశారు.

కష్టజీవి జీవన విధానమే సంస్కృతిలో ప్రతిబింబిస్తుంది



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనవర్సిటీ బిజినెస్ మేనేజ్మెంటు విభాగం హెడ్ ప్రొ.వై జహంగీర్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన 'విరాసత్' సాంస్కృతిక ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా రాష్ట్ర సాంస్కృతిక చైర్‌పర్సన్ డా.వెన్నెల పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి అత్యున్నత మానవీయ విలువలు కలిగి ఉన్నదని అన్నారు. అణచివేతకు ఎదురొడ్డి పోరాడే లక్షణం కలిగిన తెలంగాణ సమాజంలో భాగమైన విద్యార్థి లోకం ఆ విలువలను భావితరాలకు అందించడంలో ముందుండాలని ఆమె పిలుపునిచ్చారు. ఎంబీఏ విద్యార్థులు నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీన్, సీనియర్ ప్రొ.శ్రీరాములు, ప్రొ.స్మితా సాంబ్రాణి, బీఓఎస్ అధ్యక్షులు, డా.విద్యాసాగర్ రావు, డా.సమున్నత, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి



నవతెలంగాణ-ఓయూ

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా, బహుజన ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో 'ఛలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. తమ సహాయ సహకారాలు బహుజన ఆశయ సాధన సమితికి వెళ్ళవేళలా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బహుజన ఆశయ సాధన సమితి అధ్యక్షుడు గొల్లమందల గోపాల్ మాట్లాడుతూ.. ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని బహుజనులు పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస రావు, సిద్దుపేట కోఆర్డినేటర్ శ్రీకాంత్, రాజు, వేల్పుల గోవింద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన మహిళలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు ప్రాంతంలో నీటి కోటాను పంపించడంతో శనివారం మహిళలు ఎమ్మెల్యే శ్రీ గణేష్‌కు కృతజ్ఞతలు చెప్పారు. రెండో వార్డ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పి.నరేష్ ఆధ్వర్యంలో వార్డుకు చెందిన పలువురు మహిళలు పికెట్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంకి వెళ్లి ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ.. గతం కంటే ప్రస్తుతం నీరు సక్రమంగా సరఫరా అయ్యేది కాదని వారానికి రెండు రోజులు కూడా మంచినీకరు వచ్చేది కాదని ఈ సమస్య ఎమ్మెల్యే శ్రీ గణేష్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దృష్టికి తీసుకుపోవటంతో ప్రస్తుతం కంటోన్మెంట్ ప్రజలకు నీరు సమృద్ధిగా సరఫరా అవుతుందన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం 6.9 ఎంజిడిల నీరు సరఫరా అవుతుంది. దీంతో కంటోన్మెంట్ వాసులు నీటి కొరత తీరిందని తెలిపారు. అందుకు ప్రతీకగా రెండవ వార్డ్‌కు చెందిన స్థానిక కాంగ్రెస్ నాయకులు, మహిళలు ఎమ్మెల్యేని కలిసి సన్మానించామని పేర్కొన్నారు.

మానుకోటలో కేటీఆర్ సభను అడ్డుకుంటాం

- గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్



నవతెలంగాణ-ఓయూ

ఈ నెల 25న బీఆర్ఎస్ పార్టీ మానుకోటలో నిర్వహించే సభను అడ్డుకుంటామని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ తొమ్మిదిన్నర సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు గిరిజన లంబాడీలను పట్టించుకోని కేటీఆర్ ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని, హరితహారం పేరు మీద లక్షలాది ఎకరాలు గిరిజనులు సాగు చేస్తున్న భూములను గుంజుకోలేదా అని గుర్తు చేశారు. అధికారులు గిరిజనుల మీద చేసిన దాడిని అప్పుడే మర్చిపోయావా కేటీఆర్ అని విమర్శించారు. ఈ రోజు లగచర్ల సంఘటనలో మమ్మల్ని రాజకీయంగా వాడుకోవాలని కుట్ర చేస్తున్నారని తెలిపారు. అరెస్టు భయంతోనే కేటీఆర్ లంబాడీలను ముందు పెట్టి రాజకీయం చేస్తున్నారని వికారాబాద్ జిల్లాలో జరిగిన సంఘటనకు మానుకోటలో ధర్నా పెట్టడం రాజకీయం కాదా అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీని రాజకీయంగా సమాధి చేసేంత వరకు లంబాడీలు నిద్రపోరని ఇలాంటి చిల్లర రాజకీయాలు కేటీఆర్ మానుకోవాలని లేదంటే తగిన బుద్ధి చెప్తామని శరత్ నాయక్ అన్నారు.

కోట నీలిమకు బస్తీవాసులు కృతజ్ఞతలు



నవతెలంగాణ-బేగంపేట్

గొల్ల కొమరయ్య బస్తీనుంచి ఎల్లమ్మ ఆలయం వరకూ ఉండే నిర్వాసితుల ప్రాంతంలో డ్రయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో, ఈ ప్రాంత నివాసులు లీకేజీ సమస్యలను ఎదుర్కొన్నారు. 2021లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోలేదు. డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించకుండా అధికారులు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం ద్వారా సమస్యను మరింత పెంచి డ్రయినేజీ వ్యవస్థను గాలికొదిలేశారు. తద్వారా మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ, అటు నివాసులకూ, ఇటు రోడ్డుపై వెళ్ళేవారికీ దుర్గంధాన్నీ, అనారోగ్యాన్నీ వ్యాపింపజేస్తుంది. గొల్ల కొమరయ్య కాలనీ వాసులు సనత్ నగర్ కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమకు సమస్యను విన్నవించగా, సత్వరమే ఆప్రాంతాన్ని సందర్శించి పురపాలక సంఘ అధికారులకు డ్రయినేజ్ లీకేజీ తీవ్రతను చెప్పి కేవలం ఒక్కనెలలో లీకేజీ వ్యవస్థను కట్టడిచేసి, తద్వారా మురుగు వాసన, ఆనారోగ్యాల బారినపడకుండా ఆ ప్రాంత నివాసులను కాపాడినందుకు కృతజ్ఞతగా బన్సీలాల్ పేట స్థానిక నాయకులు జిఎల్.రమేష్ బాబు, పాండు గౌడ్, మల్లం రమేష్, శ్రీనివాస్ ముదిరాజ్, కలీం, జగదీష్, నాయరాణ, కృష్ణ తదితరులు ధన్యవాదాలు తెలిపారు.

సికింద్రాబాద్‌లో బీజేపీ సంబరాలు



నవతెలంగాణ-ఓయూ

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన సందర్భంగా సికింద్రాబాద్ అసెంబ్లీ సీతాఫల్మండి డివిజన్లో కన్వీనర్ కందడి నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాత్రి విజయోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేకల సారంగపాణి, రవి ప్రసాద్ గౌడ్, కనకట్ల హరి, ప్రభు గుప్తా, మధ్యర్ల శ్యాంసుందర్, వెంకటేష్ గౌడ్, పోచయ్య యాదవ్ సెతి మహేష్ అనిత సాయి దత్తు రవీందర్ శ్రీనివాస్ చారి అంబాల రాజేశ్వరరావు రామ వర్మ ఆదర్శ్ డివిజన్ అసెంబ్లీ జిల్లా నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో అగ్రగామిగా 'ఉస్మానియా'

- ఉత్తమ ఎన్‌సీసీ క్యాడేట్స్ ఉత్పత్తి కేరాఫ్ ఓయూ
- క్రమశిక్షణ, దేశభక్తితో ముందుకు..
- అనేక జాతీయ పథకాలు, జాబ్స్‌తో సత్తా..
- నేడు జాతీయ ఎన్‌సీసీ దినోత్సవం

నవతెలంగాణ-ఓయూ

1948 జూలై 15న ప్రారంభమైన జాతీయ క్యాడేట్ కార్ప్స్ నేడు 75వ వార్షికోత్సవం జరుపుకుంటుంది. భారత ప్రధాని నరేంద్ర మోడీ ఒకప్పటి ఎన్సీసి క్యాడేట్ ఎన్‌సీసీ దేశ రక్షణలో రెండవ వలయంగా పిలుస్తారు. సుమారు 15 లక్షల మంది విద్యార్థి యువకు లతో కూడిన అతిపెద్ద స్వచ్ఛంద సంస్థ. ఇందులో ఆర్మీ, నౌకాదళం, వైమా నిక దళాలకు సంబంధించి మూడు విభాగాలు ఉంటా యి. ఐక్యత, క్రమశిక్షణ అనే నినాదంతో ప్రారంభ మైన ఎన్‌సీసీ ఎంతోమం ది యువకు లను ఆదర్శ ప్రాయులుగా తీర్చిదిద్దింది.



దేశం కోసం ఏ త్యాగానికైనా సిద్ధపడే వీరులను తయారు చేసి దేశాన్ని కాపాడే త్రివిధ దళాల్లో అధికారులుగా తయారు చేసింది. పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులను మిలిటరీ వాతావరణంలో శారీరక, మానసిక దఢత్వానికి సంబంధి.ంచిన శిక్షణ అందిస్తారు. ఎన్‌సీసీ ముఖ్య ఉద్దేశం వ్యక్తిత్వం, క్రమశిక్షణ, సాంగత్యం, లౌకికవాదం, సాహస స్ఫూర్తి, నిస్వార్థపూరిత ఆలోచనలను పెంపొందించి శిక్షణతో కూడిన సంఘటితమైన, ప్రేరేపించబడిన మానవ వనరులను సమాజం కోసం తయారు చేస్తుంది. అలాగే దేశంలోని యువతను త్రివిధ దళాల్లో చేరే విధంగా ప్రేరేపించడం ఎన్‌సీసీ ఉద్దేశం. దేశవ్యాప్తంగా మొత్తం 17 డైరెక్టరేట్లు, 99 గ్రూప్ హెడ్ క్వార్టర్స్, 837 యూనిట్లు రెండు ఆఫీసర్ ట్రైనింగ్ అకాడమీలు ఉన్నాయి. ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీలో ఉంది. ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు అనేక అంశాల్లో కఠిన శిక్షణనిస్తారు. ముఖ్యం గా శారీరక దఢత్వానికి సంబంధించిన శిక్షణ డ్రిల్, ఫైరింగ్, ఆయుధాల శిక్షణ, సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రాతి నిత్యం, జాతీయ సమైక్యత, మ్యాప్ రీడింగ్ తదితర అంశాల్లో పూర్తిస్థాయిలో శిక్షణను ఇస్తారు. ఎన్‌సీసీలో చేరి న విద్యార్థులకు ప్రధానంగా మూడు రకాలైన ఏ,బీ,సీ సర్టి ఫికెట్లు వారి ప్రతిభ, శిక్షణ ఆధారంగా ఇస్తారు. ఈ సర్టిఫి కెట్ల ద్వారా దేశవ్యాప్తంగా అనేక ఉద్యోగ నోటిఫికేషన్లలో రి జర్వేషన్లు కల్పిస్తారు. అంతేకాకుండా ప్రతిష్ఠా త్మకమైన సం స్థల్లో రిజర్వేషన్లు కూడా అందజే యడం జరు గుతుంది. ఎన్‌సీసీ సర్టిఫికెట్ పాస్ అయిన విద్యార్థులకు త్రివిధ దళాల్లో ఆఫీసర్లుగా నేరుగా ప్రవేశించే అవకాశం ఉంటుంది.

శిక్షణ శిబిరాలు..

జాతీయస్థాయి క్యాంపులకు ఎన్‌సీసీలో ప్రాధాన్యం సంతరించుకుంది. వీటిలో అంతర్జాతీయ స్థాయిలో జరిగే యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం, రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్, ప్రత్యేక జాతీయ సమైక్యత శిబిరం, తాల్ సైనిక్ క్యాంప్, షూటింగ్, పర్వతారోహణ, ట్రెక్కింగ్ క్యాంప్, ఆర్మీ అనుబంధ క్యాంప్ ప్రధానమైనవి.. ఈ ప్రత్యేక క్యాంపుల్లో పాల్గొన్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఉద్యోగ పోటీ పరీక్షల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పిస్తారు.

ఉత్తమ ఎన్‌సీసీ క్యాడేట్ల తయారీ కేంద్రంగా ఉస్మానియా..

ఉస్మానియా యూని వర్సిటీ పరిధిలోని సైఫాబాద్ సైన్స్ కళాశాల, నిజాం, సికింద్రాబాద్ పీజీ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల లు ఎన్ సీసీ యూనిట్లు కలిగి, అనేక మం ది విద్యార్థులను భాధ్యత కలిగిన భావి భారత పౌరులుగా తీర్చి దేశ సేవలో పంపుతున్నాయి.



నిచిత

సైఫాబాద్ నుంచి త్రివిధ దళాల్లో అధికారులుగా అనేక క్యాడేట్లు..

సైఫాబాద్ నుంచి కేవలం ఒక సంవత్సరంలో పది మం ది ఆర్మీ, నౌకా దళంలో అధికారులుగా ఎంపిక య్యారు. 29మంది క్యాడేట్ లు జాతీయ క్యాంపులో ఉ త్తమ ప్రతిభ కనబరిచి పత కాలు సాధించి ఉస్మానియా కీర్తిని దేశవ్యాప్తంగా చాటారు.



సిద్ధార్థ

పేదరికం అధిగమించి నేవీ ఆఫీసర్‌గా నిచితా

నిచిత..సైఫాబాద్ కళాశాలలో ఎన్‌సీసీలో చేరి,తల్లి ప్రోద్బలంతో కష్టపడి, తాము దేంట్లో తక్కువ కాదని మహిళా శక్తిని చాటి నౌక దళంలో అధికారిగా చేరారు..

క్యాంపులో ధీరులు

సిద్ధార్థ: హిమాలయ పర్వత అధిరోహణలో 16410 అడు గుల ఎత్తులో ఉన్న పర్వతాన్ని అధిగమించారు.



భూక్యా శ్రీధర్

భూక్యా శ్రీధర్: ఇండియన్ మిలిటరీ అకాడమీ,డెహ్రాడూన్ అనుబంధ శిక్షణ కు ఎంపికయ్యాడు.

తన్మయి: క్లాసికల్ డాన్సర్ గా ప్రావీణ్యం వున్న తన్మయి భారత రాష్ట్రపతి ముందు ప్రదర్శన చేయడంతో పాటు ప్రస్తుతం ముందస్తు రిపబ్లిక్ డే క్యాంప్ శిక్షణ లో వుంది. కొసమెరుపు..ఎన్ని క్యాంపులు చేసినా, చదువులో ఎప్పుడూ ముందుండే వీళ్ళను ఆదర్శంగా తీసుకొని, నేటి యువత ఎన్‌సీసీలో చేరి దేశం కోసం తమ వంతు భాధ్యత నెరవేర్చాలని ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా ఈ ప్రత్యేక కథనం.

కమ శిక్షణ, దేశభక్తి పెంపొందిస్తుంది

ఎన్‌సీసీ విద్యార్థులకు విద్యార్థి దశలో క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందిస్తుంది. మా క్యాడేట్స్ రక్తదానం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ చిత్ర పటాన్ని గీసి జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి పొందారు.

-ఓయూ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ ఫ్లయింగ్ ఆఫీసర్ డా.సుమన్

నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు పోతున్నాం

రానున్న రోజుల్లో ఇంకా ఎంతోమంది ఎన్సిసి క్యాడేట్లను దేశ రక్షణలో ముందు వరుసలో పంపడానికి నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు పోతున్నం.ఎంపికైన క్యాడెట్లకు అభినందనలు.. అధికారులకు ధన్యవాదాలు

-లెఫ్టినెంట్ పల్లాటి నరేష్, ఎన్‌సీసీ అధికారి

(1. అసోసియేట్ ఎన్సిసి అధికారి,సైఫాబాద్, లెఫ్టినెంట్ పల్లాటి నరేష్
2.ఓయూ ఇంజనీరింగ్ కళాశాల ఎన్సిసి ఫ్లయింగ్ ఆఫీసర్ డా.డి.సుమన్
3.శ్రీధర్,ఇండియన్ మిలిటరీ అకాడమీ క్యాంప్,డెహ్రాడూన్
4.నిచిత, నేవీ అధికార,
5.ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటాన్ని గీసిన ఎన్సిసి ఇంజనీరింగ్ క్యాడేట్స్)

ఆలయ నిర్వాహకులతో జోనల్ కోఆర్డినేషన్ సమావేశం



- డీసీపీ రష్మీ పెరుమాళ్ ఆధ్వర్యంలో సమావేశం
- హాజరైన 350 ఆలయాల ప్రతినిధులు, పోలీసులు

నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ ఆధ్వర్యంలో శనివారం సిక్కు విలేజ్ గాయత్రి గార్డెన్ నార్త్ జోన్ పరిధిలోని ఆలయాల ప్రతినిధులు, పోలీసులతో జోనల్ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జోన్ పరిధిలోని బేగంపేట్, బోయిన్పల్లి, కారానా, బొల్లారం, మహంకాళి, మార్కెట్, రాంగోపాల్ పెట్, మరరేడ్పల్లి, తిరుమలగిరి బొల్లారం పోలీస్ స్టేషన్స్ పరిధిలో ఉన్న దేవాలయాల కమిటీ ప్రతినిధులు, పోలీసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ఆలయ ప్రతినిధులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు ఆలయాలలో తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, సనాతన ధర్మం గుడిని ఎలా రక్షించుకోవాలని, నిబంధనలు ఎలా పాటించాలని, టెంపుల్ కమిటీ మెంబర్స్ జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు ఇచ్చారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే చట్టాన్ని చేతుల్లో తీసుకోకుండా 100 డయల్ చేసి సమస్యలను తెలియజేయాలని కోరారు. ముందుగా దేవాలయాలలో సీసీ కెమెరాలు, ప్రరారీ, గ్రిల్స్, గేట్స్ సేఫ్టీగా అమర్చుకోవాలని, గుడి ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచాలని, మెరుగైన సూచనలను కమిటీ సభ్యులకు చెప్పారు. పోలీస్ పెట్రోలింగ్ ద్వారా వాళ్ల పరిదిలో ఉన్న దేవాలయాలను ప్రతి పోలీస్ స్టేషన్ సిబ్బంది సందర్శించడం జరుగుతుందని. ప్రతిరోజు టెంపుల్ జీపీఎస్ డేటాను పరీక్షించి ఇస్తారని డీసీపీ తెలియజేశారు. అవసరం ఉన్నపుడు తక్షణమే 10 నిమిషాలలో స్టేషన్ చేరుకోవాలని కూడా ఎస్‌హెచ్‌ఓలకు ఆమె ఆదేశాలు జారీ చేశారు .

న్యాయ వ్యవస్థలో జరిగే అన్యాయాలపై పోరాటం చేయాల్సిందే

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



నవతెలంగాణ-బంజారా హిల్స్

భారత న్యాయవ్యవస్థలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు జరుగుతున్న అన్యాయాలపై సమిష్టిగా పోరాడుదామని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు అన్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బ్యాక్వర్డ్ క్లాస్ ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉన్నత న్యాయ వ్యవస్థలో సామాజిక న్యాయము-ప్రస్తుత పరిస్థితులు అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం శనివారం నిర్వహించారు. అసోసియేషన్ కన్వీనర్ లింగయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్, బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్లు హాజరై ప్రసంగించారు. వారు మాట్లాడుతూ.. 78 సంవత్సరాల స్వతంత్ర భారతంలో ప్రజాస్వామ్యంలో అతి కీలకమైన వ్యవస్థలో అత్యధిక వర్గాలకు అన్యాయం జరగడం విచారకరమని అన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానంలో ఇప్పటివరకు 231 మంది అగ్రకులాలకు చెందిన వారు న్యాయమూర్తులుగా నియామకం కాగా బీసీలు నలుగురు, ఐదుగురు ఎస్సీలు మాత్రమే ఆ స్థానాన్ని పొందగలిగారని అన్నారు. న్యాయ వ్యవస్థలో 97% అగ్రకులాలదే పై చేయిగా ఉందని అన్నారు. ఈ మేరకు బడుగు బలహీన వర్గాలకు ఏ స్థాయిలో అన్యాయం జరుగుతుందో అర్థమవుతుందని తెలిపారు. రాష్ట్ర హైకోర్టులలో కూడా ఇదే కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ వ్యవస్థలలో అన్యాయం జరిగితే న్యాయం చెప్పాల్సిన న్యాయవ్యవస్థలోని ఈ తరహా అన్యాయం జరుగుతుందని అన్నారు. న్యాయస్థానాలు ఇస్తున్న తీర్పులపై కూడా అగ్రవర్ణ ముద్ర ఉంటుందన్న ఆరోపణలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థలో సామాజిక న్యాయం కోసం రాజ్యాంగాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. బీసీ ప్రధానిగా ఉండి కూడా బీసీలకు ఇతర బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ఈ నేపథ్యంలోనే న్యాయవ్యవస్థలో వివక్షను దూరం చేసి అర్హత కలిగిన అన్ని వర్గాల వారికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకై భవిష్యత్తులో వివిధ కార్యక్రమాలతో ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. అడ్వకేట్ అసోసియేషన్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయా పార్టీల నేతలు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంతో పాటు జాతీయస్థాయిగా పనిచేసే వివిధ న్యాయవాదులు, సామాజికవేత్తలు, రాజకీయవేత్తలు, విశ్లేషకులు స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

ఫుట్ పాత్ ఆక్రమణలు కూల్చివేత

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గంలో మారేడుపల్లి ప్రధాన రోడ్లకు ఇరువైపుల ఫుట్ పాతుల ఆక్రమణలను శనివారం మున్సిపల్ పోలీస్ అధికారుల కంటోన్మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో తొలగించారు. వ్యాపారస్తులు కొన్ని సంవత్సరాలుగా పుట్పాతులపై ఆక్రమణలను షెడ్లను వేసుకుని వ్యాపారాలు సాగిస్తు దీంతో తీవ్ర..ట్రాఫిక్ అంతరాయానికి కారణమవుతున్న విషయం అధికార దృష్టికి వెళ్లింది. ఈ క్రమంలో కూల్చివేతలు చేపట్టారు, నిర్మాణాలను కూల్చివేశారు. మారేడుపల్లి ప్రభుత్వ పాఠశాల నుంచి మారేడుపల్లి పోలీస్ స్టేషన్ వరకు రహదారికి ఇరువైపుల ఫుట్ పాతులపై వెలసిన షెడ్లను తొలగించారు. గత కొంతకాలంగా మారేడుపల్లి రహదారిలో ట్రాఫిక్ జామ్ నెలకొంటుంది. ఈ క్రమంలో వాహనదారులు, ఫుట్ పాతులపై నడిచే బాటసారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫిర్యాదులు అందుకున్న సంబంధిత అధికారులు మారేడు పల్లి ప్రధాన రహదారిలో ఇరువైపులా ఫుట్ పాతులపై అక్ర మంగా వెలిసిన దాదాపు 60 షెడ్లను కూల్చివేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూల్చివే తలు నిర్వహించారు. జీహె చ్ఎంజీ విభాగం డీసీపీ సుస్మిత, ఐపీఎస్ అధికారి విశ్వప్రసాద్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, కంటోన్మెంట్ బోర్డ్ హెల్త్ సూపర్డెంట్ దేవేందర్, ఏసీపీ శంకర్ రాజు, మారేడుపల్లి ఇన్స్పెక్టర్ వెంకటేష్, ట్రాఫిక్ సీఐ భాస్కర్, పర్యవేక్షణలో కూల్చివేతలు జరిగాయి. హెల్త్ ఇన్స్పెక్టర్ చౌహన్, జీహెచ్ఎంసీ సూపర్వైజర్ ప్రకాష్, లా అండ్ ఆర్డర్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.





జి.నారాయణమ్మ కాలేజీలో విద్యార్థులకు ఉపకార వేతనాలు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జి.నారాయణమ్మ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఫర్ ఉమెన్స్ స్టూడెంట్ క్లబ్ సభ్యులు మా కళాశాల నుంచి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు స్కాలర్షిప్ పొందడంపై, విద్యార్థులు కొత్త అవకాశాలపై అవగాహన పెంచుకొని, భవిష్యత్తు స్కాలర్షిప్లకు అర్హులుగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం ఒంటిగంట నుండి మూడు గంటల వరకు క్లబ్బు ఫ్యాకల్టీ కన్వీనర్లు, డాక్టర్ ఆర్ లక్ష్మి హెచ్ అండ్ ఎం విభాగం క్లబ్ సభ్యులు, పానల్ డిస్కషన్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి విద్యార్థి సంఘమును బట్టి ఆదరణ లభించింది. 200 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఎంతో ఉత్సాహంగా క్యాంపస్ లోని అన్ని శాఖల విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పార్టిసిపేట్లో ఉత్సాహంతో పాటు మాకు ప్రేక్షకుల నుంచి ఆదరణ లభించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఈ కార్యక్రమానికి వారి ప్రశంసలు అందించారు. ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నాము. ఓవరాల్‌గా ఏరి డైట్ హర్ స్కాలర్షిప్ ఎడిషన్ ఈవెంట్ గ్రాండ్‌గా సక్సెస్ అయింది. భవిష్యత్తులో ఇలాంటి ఈవెంట్స్ క్లబ్ నిర్వహించాలని మేము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



నవ-తెలంగాణ-బేగంపేట్

కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మహిళకు మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అండగా నిలిచారు. మోండా డివిజన్ నాలా బజార్‌కు చెందిన లావణ్య కొద్ది రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నది. ఆమెను కుటుంబ సభ్యులు వైద్యుల వద్దకు తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు కిడ్నీ మార్పిడి చేయాలని సూచించారు. దీంతో ప్రయివేట్ ఉద్యోగం చేస్తూ చాలీచాలని జీతంతో కుటుంబాన్ని పోషిస్తున్న అమె భర్త సంపత్ దిక్కుతోచని స్థితిలో పడ్డారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు నాగులు సహకారంతో ఎమ్మెల్యేను కలిసి చికిత్స కోసం సహకారాన్ని అందించాలని కోరారు. వెంటనే ఆయన చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 2 లక్షల రూపాయలు చెక్కును అమె భర్త సంపత్‌కు శనివారం వెస్ట్ మారేడ్ పల్లిలో అందజేశారు. ఆర్థిక సహాయం మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు సంపత్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నాగులు, అమర్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో ఆర్ఎస్ ప్రవీణ్ బర్త్‌డే వేడుకలు



నవతెలంగాణ-ఓయూ

మాజీ ఐపీఎస్ అధికారి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు శనివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట పార్టీ రాష్ట్ర యువజన నాయకులు పీహెచ్డీ స్టూడెంట్ ఆర్.ఋషిపాక గణేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ..ప్రవీణ్ కుమార్ తన ఏడెండ్ల ఐపీఎస్ సర్వీస్‌ను వదులు కొని ప్రజాక్షేత్రంలో అడుగుపెట్టి పేద ప్రజల గొంతుకగా నిలబడుతూ, బీఆర్ఎస్ పార్టీలో కీలక పాత్ర పోషిస్తున్నారు, గురుకులాల సెక్రటరీగా ఉండి వేలాది మంది బిడ్డల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసి, అక్షరజ్ఞానంతోనే బతుకులు మారుతాయని తెలియజేసిన మార్గదర్శకుడు ప్రవీణ్ కుమార్ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కోఠి విజయరావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు రుద్రవరం సునీల్, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులూ జంగయ్య యాదవ్, కొంపెల్లి నరేష్, మిథున్, నాగారం ప్రశాంత్, ఏనుత్తుల మహేందర్ పాల్గొన్నారు.

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో బ్రాండెడ్ అభరణాల ప్రదర్శన



నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షో రూమ్‌లో అద్వితీయమైన బ్రాండెడ్ ఆభరణాల ప్రదర్శనను అతిధులుగా శ్రావ్య, వనిత, మౌనిక, సయ్యద్ మసారాలు శనివారం ప్రారంభించారు. ప్రదర్శనల వివాహ సంబరాల కోసం రత్న ఆభరణాల సముదాయం టెక్నిక్స్ హస్తకళ నైపుణ్యతతో తయారైన అభరణాలు భారతీయ ప్రాచీన సాంప్రదాయ ఆభరణాలు చిన్నారులకు స్టార్లెట్ ఆభరణాలను ప్రదర్శించారు. ఈ ఆభరణాల ప్రదర్శన హబ్సిగూడ షోరూంలో ఈనెల 22 తేదీ నుంచి డిసెంబర్ 01వరకు నిర్వహించబడుతుంది. బంగారు ఆభరణాల తరువు చార్జీలపై 25% వరకు తగ్గింపు జాన్ స్టోన్ అన్కట్ అన్కట్ ఆభరణాల తరుగు చార్జీలపై 25% తగ్గింపు వజ్రాల విలువపై 25% తగ్గింది డిసెంబర్ 8 వరకు ఉంటుంది అని స్టోర్ హెడ్ మహమ్మద్ అహ్మద్ సోఫి, మేనేజర్ నిగేష్ తెలిపారు.

సీఎంఆర్‌లో 'యూపీఎస్సీ మాస్టర్ క్లాస్' సెమినార్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్‌లోని సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో మీడియా గ్రూప్, కేపీ 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ సంయుక్తంగా "ఫస్ట్ అటెంప్ట్‌లో సివిల్ సర్వీసెస్ ఎలా క్రాక్ చేయాలి: యూపీఎస్సీ మాస్టర్ క్లాస్" అనే సెమినార్‌ను నిర్వహించారు. 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మెన్ పి. కృష్ణ ప్రదీప్ మాట్లాడుతూ సివిల్ సర్వెంట్స్‌కు ఉన్న అధికారంతో ఎటువంటి సమస్యనైనా పరిష్కరించొచ్చు అని అన్నారు. ఉదాహరణగా మాజీ హరియాణా ముఖ్యమంత్రిని వ్యతిరేకించి తన నైతికతను నిరూపించిన ఐఏఎస్ అధికారిని రజనీ సేఖరి సిబాల్ గురించి విద్యార్థులకు వివరించారు .ఆమె చేసినటు వంటి ధైర్యం, 2013లో ఆ ముఖ్యమంత్రిని జైలుకు వెళ్ళేటట్టు చేసిందని విద్యార్థులకు చెప్పారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, వారిని భవిష్యత్తు నాయకులుగా తయారు చేయడం తమ అకాడమీ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చీఫ్ మెంటార్ డా. భవానీ శంకర్ మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా తమ అకాడమీ అందిస్తున్న ప్రాముఖ్యమైన కోచింగ్‌పై విద్యార్థులకు వివరించారు. ప్రతి సంవత్సరం యూపీఎస్సీలో కనీసం 20 ర్యాంకులు సాధిస్తూ, రాబోయే ఐదు సవత్సరాలలో 100 ర్యాంకులు సాధించాలనే లక్ష్యంగా తమ సంస్థ పని చేస్తుందన్నారు. సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ డైరెక్టర్ డా. రాజి రెడ్డి మాట్లాడుతూ , ఈ సెమినార్‌లో నిపుణుల ఇచ్చిన సలహాలను గమనించి నోట్స్ తయారు చేసుకోవాలన్నారు. త్వరలోనే క్యాంపస్‌లో సివిల్ ఆస్పిరెంట్స్ క్లబ్ ప్రారంభించనున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డా. శ్రీనివాస్, డీన్ (ఎఫ్ఎస్ఏ), 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఫైనాన్స్ డైరెక్టర్ వరుణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.ప్రశాంత్, జీ5 మీడియా గ్రూప్ డైరెక్టర్ గిరి ప్రకాష్ పాల్గొన్నారు.

నగరంలో గంజాయి సరఫరా

- రూ.50లక్షల విలువగల 114 కిలోల గంజాయి స్వాధీనం
- ఏడుగురి అరెస్ట్



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో ఏడుగురు సభ్యులు గల గంజాయి ముఠాను నార్కొటెక్ పోలీసులు, కాచిగూడ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. ఏడుగురి నుంచి రూ.50లక్షల విలువగల 114కిలో గంజాయితోపాటు 8 సెల్‌ఫోన్లు, రూ.3200నగదును స్వాధీనం చేసుకున్నారు. శనివారం బషీర్‌బాగ్‌లోని సీసీఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీపీ వై.వీ.ఎస్.సుధీంద్ర వివరాలను వెల్లడించారు. ఓంగోల్‌కు చెందిన బీ.గోవింద్, రాజమండ్రికి చెందిన ఏ.ప్రకాష్‌కుమార్, అనకాపల్లికి చెందిన ఏం.మోహన్‌రావు, ఒంగోల్‌కు చెందిన ఆర్.డీ.హరిప్రసాద్, అనకాపల్లికి చెందిన కే. రమణలు గంజాయిని సప్లయ్ చేస్తూ పలుసార్లు పోలీసులకు పట్టుబడి జైలుకెళ్లిన నిందితులు. జైలునుంచి తిరిగి వచ్చాక వీరంతా ఒక ముఠాగా ఏర్పాడ్డారు. సులువుగా డబ్బులు సంపాదించాలని తిరిగి గంజాయిని సరఫరా చేస్తున్నారు. ఒడిస్సాలో కిలో గంజాయిని రూ.1500లకు కొనుగోలు చేస్తున్న నిందితులు రూ.5000కు విక్రయిస్తున్నారు. అనకాపల్లికి చెందిన ఎల్.గంగాధర్, వై. గంగాధర్‌లతో కలిసి (ట్రాన్స్‌పోర్టు) గంజాయిని నగరానికి తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న నార్కొటెక్ పోలీసులు, కాచిగూడ పోలీసులతో కలిసి ప్రత్యేక నిఘా వేశారు. నిందితులు కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో సరఫరా చేస్తున్న సమయంలో అరెస్టు చేశారు. సమావేశంలో నార్కొటెక్ ఇన్‌స్పెక్టర్ జీ.ఎస్.డానియేల్, ఎస్ఐ సీ.వెంకటరాములు, కాచిగూడ ఎస్‌హెచ్‌వో కే.చంద్రకుమార్, ఎస్ఐ హెచ్.నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ వేదికపై మూడు టైటిళ్లు..



- దేశానికే గర్వకారణంగా నిలిచిన రత్న మెహెరా

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రతిష్టాత్మక మిసెస్ ఆసియా ఇంటర్నేషనల్-2024 పోటీల్లో రత్న మెహెరా, భారతదేశం గర్వపడేలా చేశారు. ఈ అంతర్జాతీయ వేదికపై మూడు టైటిళ్లను గెలుచుకోవడం ద్వారా దేశానికే గర్వకారణంగా నిలిచారు. ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో జరిగిన ఈ ఈవెంట్‌లో చైనా, జపాన్, కొరియా, సింగపూర్, మలేషియా, థాయిలాండ్, వియత్నం, తైవాన్‌లతో సహా వివిధ ఆసియా దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 18 మంది పోటీదారులు ఉన్నారు. ఈ పోటీల్లో స్వీయ-పరిచయం, జాతీయ దుస్తులు, ప్రతిభ ప్రదర్శన, ప్రశ్న-జవాబు విభాగాలు, బహుళ ర్యాంప్ వాక్‌లతో సహా అనేక రౌండ్లు ఉన్నాయి. నేషనల్ కాస్ట్యూమ్ రౌండ్ సమయంలో రత్న మెహెరా నెమళ్లు, పులుల క్లిష్టమైన చిత్రాలతో అలంకరించిన చీరను ధరించి, భారతదేశం గొప్ప వారసత్వం, సహజ సౌందర్యాన్ని గౌరవించారు. ఆమె నెమలి ఈకలతో కూడిన కిరీటం భారతదేశ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిధ్వనింపజేస్తూ న్యాయతను ప్రతిబింబిస్తుంది. సంప్రదాయ ఆభరణాలతో రూపాన్ని పూర్తి చేస్తూ, ఆమె భారతీయ స్త్రీత్వం కాలాతీత అందం, బలాన్ని ప్రసరింపజేశారు. ఈ నెల 19వ తేదీన జరిగిన గ్రాండ్ ఫినాలేలో రత్న మెహెరా మూడు ప్రతిష్టాత్మక టైటిల్స్‌తో కిరీటాన్ని పొందారు. మిసెస్ ఆసియా ఇంటర్నేషనల్ రన్నర్-అప్, మిసెస్ ఎలిగాన్స్ ఆసియా ఇంటర్నేషనల్, మిసెస్ పాపులారిటీ ఆసియా ఇంటర్నేషనల్ పొందారు. మెహెరా ఇదే మొదటిసారి కాదు. ఆమె గతంలో మిసెస్ ఇండియా తెలంగాణ-2023 రన్నరప్ క్రౌన్‌ను గెలుచుకున్నారు. మిసెస్ ఇండియా-2024 విజేత కిరీటాన్ని పొందడం ద్వారా మరింత గొప్ప విజయాన్ని సాధించారు. ఈ సందర్భంగా మెహెరా మాట్లాడుతూ "ఇలాంటి గౌరవనీయమైన వేదికపై నా దేశానికి ప్రాతినిధ్యం వహించడం గౌరవంగా ఉంది. ఈ టైటిళ్లను గెలవడం ఈ ప్రయాణంలో నాకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరి కృషి, పట్టుదల, మద్దతుకు నిదర్శనం" అని తెలిపారు.

సగౌర చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



నవతెలంగాణ- సిటీబ్యూరో

అంధ బాలుర పాఠశాల దారుసిఫాలో సగౌర చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు రెండు జతల చొప్పున యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సగౌర చారిటబుల్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణ, మెంబర్ డాక్టర్ సూర్య ప్రకాష్, దాత డాక్టర్ ప్రదీప్ కుమార్ తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖుద్సియా, మందడి వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ సత్యనారయణ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని అవకాశాలని వినియోగించుకుని ఉన్నత స్థానంలో ఎదగాలని ఆకాంక్షించారు.

వసతి గృహాన్ని ఆకస్మికంగా కలెక్టర్ తనిఖీ



నవతెలంగాణ- సిటీబ్యూరో

వసతి గృహంలోని పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి వార్డెన్ ను ఆదేశించారు. శనివారం సాయంత్రం మల్లెపల్లి ప్రభుత్వ మైనార్టీ పోస్ట్ మెట్రిక్ గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని పరిసరాలను, వసతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహంలోని పిల్లలకు ఎలాంటి ఆరోగ్యకర సమస్యలను ఉత్పన్నం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, వసతి గృహం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, శీతాకాలంలో పిల్లలకు జలుబు, జ్వరాలు రాకుం డా చూడాలని వార్డెన్‌ను ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు ప్రత్యేక అధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టి. రవి, హాస్టల్ వార్డెన్ అంకుష్ పాషా తదితరులు ఉన్నారు.

రసరమ్యతగా నాటి లవ కుశ చిత్ర సన్నివేశాలు నర్తించిన బాలలు

నవతెలంగాణ-కల్చరల్



సుమారు 50 ఏండ్ల క్రితం విడుదలై సినీ పరిశ్రమలో చరిత్ర సృష్టించిన లవ కుశ చిత్రం లోని పాటలు పద్యాలను చిన్నారులు అక్షింతల గీతిక, శాన్వీ ఠాగూర్ లు లవ కుశ పాత్రలు లో నటిస్తూ రస రమ్యతగా నర్తించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వద్దనున్న కళా భారతి ఆడిటోరియంలో సుస్వర సుగుణ కళా భారతి నిర్వహణలో సంస్థ నిర్వాహకుడు రవి మన్యు కుమారుడు కుందనం చంద్ర మౌనేష్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా అన్న ప్రసాద వితరణ తో పాటు సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. మా రామ లక్ష్మితో కలసి రవి మన్యూ అలనాటి సినిమాలలో ఘంటసాల సుశీల పాడిన యుగళ గీతాలు మధురంగా ఆలపించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో మనోహర్ వ్యాఖ్యానం లో రవి మన్యు ఇతర అతిథులతో కలసి కళాకారులను సత్కరించారు

నేటి తరం మహిళలకు విజయ భారతి స్ఫూర్తి



- ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ పూర్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవ రావు

నవతెలంగాణ-కల్చరల్

నేటి తరం మహిళలు అందరికీ విజయ భారతి జీవితం స్ఫూర్తినిస్తుందని సమైక్య ఆంధ్ర ప్రదేశ్ పూర్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవ రావు అన్నారు బొజ్జ తారకం ట్రస్ట్, బోయి విజయ భారతి స్మారక సంచిక కమిటీ నిర్వహణలో తెలుగు విశ్వవిద్యాలయం లోని ఎన్ టీ ఆర్ కళా మందిరం లో డాక్టర్ విజయ భారతి ఆత్మ కథ విజయ గాథ,స్మారక సంచిక నిశ్శబ్ద విప్లవ తరంగిణి ల ఆవిష్కరణ సభ జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న కాకి మాధవ రావు విజయ గాథ సంపుటి నీ ఆవిష్కరించి మాట్లాడారు ప్రముఖ కవి కుమార్తె హక్కుల నాయకుడు భార్య ఐనప్పటికీ స్వీయ వ్యక్తిత్వం తో ఎదిన మహిళ విజయ భారతి అని కొనియాడారు. నిశ్శబ్ద విప్లవ తరం గిణి ప్రత్యేక సంచిక ను ప్రొఫెసర్ రమా మేల్కొటే ఆవి ష్కరించి మాట్లాడారు విజయ భారతి సాహిత్యం స్త్రీ అంశా లతో కూడుకున్నవి ఇనపటికి ఆమె ను స్త్రీవాద రచయిత్రి గా పేర్కొనలేము అన్నారు ఆమె సామాజిక చైతన్యం కలిగిన నిశబ్ద తరంగం అన్నారు విజయ భారతి సంపూర్ణ వ్యక్తిత్వం సంపుటి లో ప్రముఖుల వ్యాసాల వల్ల తెలు స్తుందన్నారు ఆచార్య కోయి కోటేశ్వర రావు ప్రొఫెసర్ జి సుధా రాణి గ్రంథాలు పరిచయం చేశారు సతీష్ చందర్ గుత్తా జ్యోత్స్న డాక్టర్ మహిత బొజ్జ తదిత రులు పాల్గొన్నారు దళిత స్త్రీ శక్తి నాయకురాలు ఝాన్సీ స్వాగతం పలికిన సభలో కె సజయ వందన సమర్పణ చేశారు

స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

- కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. శనివారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్‌లో కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ స్థానిక ప్రజలతో కలిసి పాదయాత్ర నిర్వహించి బస్తీలలో సమస్యలు అడిగి తెలుసుకొని ప్రేమ్ నగర్‌లో నూతనంగా వేయనున్న సీసీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బస్తీ ప్రజలు బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జాఫర్, వంజరి ప్రకాష్, జమీల్,రహీమ్, శ్రీనివాస్, శ్రీకాంత్, రజాక్, సంతోష్ చారి, వర్క్ ఇన్స్‌స్పెక్టర్ దుర్గ, రమేష్, లైన్మెన్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



నగరానికి చెందిన శ్వేత ప్రసాద్ కర్ణాటక సంగీతం విభాగంలో 2022-23 బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారం అందుకున్నారు. శుక్రవారంని ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ కార్యదర్శి అరుణిష్ చావ్లా, సంయుక్త కార్యదర్శి ఉమ నందూరి, సంగీత నాటక అకాడమీ విస్ చైర్మెన్ సంధ్య ఈ అవార్డు అందచేశారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

కుల సంఘాల ఇబ్బందులు, సూచనలను ప్రభుత్వానికి నివేదిస్తాం

- పారదర్శకంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే
- కమిషన్ ఆధ్వర్యంలో బీసీల స్థితిగతులపై అర్జీల స్వీకరణ
- ఉమ్మడి 10 జిల్లాల్లో బీసీల స్థితిగతులపై బహిరంగ విచారణ పూర్తి
- రాష్ట్రంలో చివరి దశకు సమగ్ర కుటుంబ సర్వే
- రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మెన్ గోపిశెట్టి నిరంజన్



నవతెలంగాణ-సిటీబ్యూరో

కులవత్తుల,కుల సంఘాల,ఇబ్బందులు, సమస్యలు సూచనలను ప్రభుత్వానికి నివేదిస్తామని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మెన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. శనివారం రాష్ట్రంలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల వారి స్థితిగతుల అధ్యయనంలో భాగంగా హైదరాబాద్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ విచారణలో కమిషన్ కుల సంఘాలు, కులవత్తుల వారి నుంచి అర్జీలు స్వీకరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వెనుకబడిన తరగతుల సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన స్థితిగతులు, వారికీ కావాల్సిన అవకాశాలు, తదితర అంశాలపై జిల్లాల వారీగా బహిరంగ విచారణ చేపట్టామన్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి 9 జిల్లాలోని బీసీల స్థితిగతులపై కమిషన్ బహిరంగ విచారణ చేపట్టిందని చివరిగా శనివారం హైదరాబాద్ జిల్లాలో బహిరంగ విచారణ చేపట్టామన్నారు. రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే విజయవంతగా చివరిదశకు చేరుకుందని ఇప్పటివరకు 90 శాతం పైగా సర్వే జరిగిందని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో 70 శాతానికి పైగా సర్వే జరిగిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సర్వేలో ప్రజలు చురుకుగా పాల్గొంటున్నారని తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వేలో నోడల్ అధికారిగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కీలక పాత్ర పోషించారన్నారు. బహిరంగ విచారణలో కుల సంఘాలు, వివిధ కుల వత్తుల వారి అర్జీలను స్వీకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. అంతకు ముందు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాలు, నమోదు కేంద్రం, నోటరీ డెస్క్, రిసెప్షన్ కౌంటర్‌లను కమిటీ సభ్యులతో కలసి చైర్మెన్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి సామజికంగా, విద్యాపరంగా అలాగే వారి వత్తులు, స్థితి గతులు అధ్యాయనానికి రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమిషన్ ఏర్పాటు చేసిందని అలాగే రాజ్యాంగంలో ఆర్టికల్ 3 ప్రకారం బీసీల అభివృద్ధితో పాటు మెరుగైన పాలన జరుగుతుందన్నారు. బీసీల స్థితిగతులు తెలుసుకునేందుకు మేధావులు, ఎన్జీవోలు, కుల సంఘాలు, ప్రజలతో బహిరంగ విచారణ చేసి సలహాలు, సూచనలు, సమస్యలు తెలుసుకుందన్నారు. అదేవిధంగా హైదరాబాద్‌లో బీసీ కమిషన్ ఆధ్వర్యంలో బహిరంగ విచారణ జరుగుతుందని ముందస్తుగా విస్తృతంగా ప్రచారం చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి రంగు, అదనపు కలెక్టర్ రెవెన్యూ ముకుంద రెడ్డి, డీఆర్ఓ ఈ వెంకటాచారి, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ప్రత్యేక అధికారి సతీష్, బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి.ఆశన్న, ఆర్డీఓలు రామకష్ణ, సాయి రామ్, వసతి గృహాల అధికారులు అర్జీదారులు పాల్గొన్నారు.

పాతబస్తీ అభివృద్ధికి కలిసి పనిచేయాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు డీజీ నర్సింహారావు
- మూసీ నిర్వాసితులకు అండగా సీపీఐ(ఎం) పోరాటం
- సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు ఎండీ అబ్బాస్
- పాతబస్తీలో ఘనంగా పార్టీ 4వ మహా సభలు





నవతెలంగాణ-ధూల్‌పేట్

పాతబస్తీ అభివృద్ధికి కలిసి పనిచేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు డీజీ నర్సింహ రావు అన్నారు. పాతబస్తీ హుస్సేన్ అలం కామ్రేడ్ సయ్యద్ ఇబ్రహీం నగర్ పాల్కి గార్డెన్ లో సీపీఐ(ఎం) సౌత్ కమిటీ జిల్లా కార్యదర్శి ఎండీ అబ్బాస్ ఆధ్వర్యంలో పార్టీ 4వ మహా సభలు ఘనంగా నిర్వహించారు. పురాణపూల్ నుంచి గార్డెన్ వరకు ర్యాలీగా వెళ్లారు. దారి పొడవునా ఎర్ర జెండాలు, తోరణాలు, స్వాగత గుమ్మాలు స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాతబస్తీలో ప్రజా సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం సరి కాదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడితే ముందు రోజుల్లో మీ పార్టీలు కనిపించవన్నారు. మూసీ ప్రక్షాళన, సుందరీకరణ పేరుతో పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునేది లేదని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు ఎండీ అబ్బాస్ అన్నారు. నిర్వాసితులకు అండగా సీపీఐ(ఎం) ఉంటుందన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తుందన్నారు. సుందరీకరణ అంటే ప్రజలను రోడ్డున పడేయడం కాదన్నారు. రవాణా రంగం, చిరు వ్యాపారుల, ప్రజల సమస్యల పరిష్కారానికి పార్టీ పోరాటం చేస్తుందన్నారు. ప్రభాకర్, పీఎస్ఎన్ మూర్తిలు మాట్లాడుతూ.. కార్మికుల, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. కమిటీ సభులు తదితరులు పాల్గొన్నారు..

నూతన కమిటీ..

సీపీఐ(ఎం) సౌత్ జిల్లా నూతన కార్యదర్శిగా ఎండీ అబ్బాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 16 మందితో ఏర్పాటైన నూతన జిల్లా కమిటీలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.శ్రావణ కుమార్, పి. నాగేశ్వర, ఎంమీనా, ఎల్ కోటయ్య, విఠల్ నియమితులయ్యారు.

కల్యాణలక్ష్మి ఆడపడుచులకు వరం లాంటిది

- ఎమ్మెల్యే ముఠా గోపాల్

నవతెలంగాణ-ముషీరాబాద్

పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి షాదీ ముబారక్ వరం అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ అన్నారు. శనివారం కవాడిగూడ డివిజన్ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ముషీ రాబాద్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ముషీరాబాద్, ఎమ్మార్వో కార్యాలయా నికి సంబంధించిన 157 షాదీ ముబారక్ చెక్కులు, కల్యాణ లక్ష్మి 107 చెక్కులను, హిమాయత్ నగర్ ఎమ్మార్వో కార్యాలయానికి సంబంధించి 21 చెక్కుల పంపిణీని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ జి.రచన శ్రీ, ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియ నవీన్ గౌడ్, హాజరై లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా పేదింటి ఆడపడుచులకు వరం అన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ తహసీల్దార్ రాణా ప్రతాప్ సింగ్, డివిజన్‌ల అధ్యక్షులు వలల శ్యామ్, రాకేష్, వై. శ్రీనివాస్, బల్ల శ్రీనివాస్ రెడ్డి, కొండ శ్రీధర్ రెడ్డి, బీజేపీ నాయకులు జి.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ నగర కార్యాలయంలో విజయోత్సవాలు



నవతెలంగాణ-అంబర్‌పేట

దేశంలో బీజేపీ, నరేంద్ర మోడీ నాయకత్వం పట్ల ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు తెలిపారు. మహారాష్ట్రలో ప్రజలు ఇచ్చిన విజయం దీనికి నిదర్శనమన్నారు. మహారాష్ట్రలో బీజేపీ విజయాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్, మిగతా ప్రతిపక్షాలు విష ప్రచారం చేసినప్పటికీ అనేక కుట్రలకు పాల్పడినప్పటికీ.. ప్రజలు లెక్కచేయకుండా బీజేపీకి భారీ విజయాన్ని కట్టబెట్టారని సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, దేశ, ధర్మ రక్షణకు బీజేపీ పెద్దపీట వేస్తుండటంతో ప్రజలు ఆశీర్వదిస్తున్నారని చెప్పారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకునేందుకు కాంగ్రెస్ పార్టీ చేసిన కుట్రలకు ప్రజలు గట్టి గుణపాఠం చెప్పారని తెలియజేశారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ విజయాలను నమోదు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర ఫలితం బీజేపీ కార్యకర్తలకు ఉత్సాహం నింపిందని, ఈ విజయం స్ఫూర్తితో రాష్ట్రంలో మరిన్ని విజయాల కోసం పనిచేస్తారని చెప్పారు.

మోడీ అభివృద్ధి మంత్రం పని చేసింది

బీజేపీ ఓబీసీ మోర్చా సోషల్ మీడియా నేషనల్ మెంబర్ పెరిక సురేష్

మహారాష్ట్రలో ప్రధాని నరేంద్ర మోడీ అభివృద్ధి మంత్రం పనిచేసిందని, ఇది జాతీయవాద పార్టీ విజయమని బీజేపీ ఓబీసీ మోర్చా సోషల్ మీడియా నేషనల్ మెంబర్ పెరిక సురేష్ తెలిపారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమి, యూపీలోని జరిగిన ఎన్నికల్లో యోగీ సారథ్యంలో ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలు ఘన విజయం సాధించడం పట్ల సురేష్ హర్షం వ్యక్తం చేశారు. మోడీ నాయకత్వంలోని అభివృద్ధి, సుపరిపాలన తాజా ఎన్నికల్లో గెలిచాయని పేర్కొన్నారు. మహారాష్ట్ర ప్రజలు చారిత్రాత్మక విజయం అందించారని హర్షం వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో బీజేపీ చరిత్ర సృష్టించిందని, ఎన్డీఏ కూటమికే ప్రజలు పట్టం కట్టారని చెప్పారు.

'ఎంపీజే సామాజిక, సంక్షేమ సంస్థ'



నవతెలంగాణ-ధూల్‌పేట్

మూవ్మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) ఓ సామాజిక, సంక్షేమ, రాజకీయేతర సంస్థ అని ఆ సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ముహమ్మద్ అబ్దుల్ అజీజ్ చెప్పారు. శనివారం ఆయన పాతబస్తీ డారుల్ షిఫా కార్యాల యంలో మీడియాతో మాట్లాడుతూ.. కుల, మత విచక్షణ లేకుండా భారత పౌరుల రాజ్యాంగ బద్ధమైన, హక్కులు, బాధ్యతలను గుర్తుచేస్తూ, వారి కర్తవ్యా న్ని గుర్తు చేస్తుందన్నారు. తమ సంస్థ కార్యకర్తలు తెలంగాణలోని అన్ని జిల్లాల్లో విస్తరించి ఈ బాధ్యతల్ని నిర్వర్తిస్తూ ఉన్నారని తెలిపారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఆయా పార్టీల అభ్యర్థులు గతంలో చేసిన వాగ్దానాలను గుర్తుచేసి, ప్రజాభిప్రాయాన్ని మలచటంలో ఎంపీజే ఉడతాభక్తిగా- తన వంతు పాత్రను పోషిస్తూ ఉందన్నారు. ప్రభుత్వ సంస్థల్లో అవినీతికి వ్యతిరేకంగా గొంతు విప్పి, ప్రమాణబద్ధమైన వ్యవస్థ కొరకు పాటుపడుతూ ఉందని ఆయన తెలిపారు.

అరుంధతి సేవా మండలి ఆధ్వర్యంలో నేడు దసరా-దీపావళి ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-ధూల్‌పేట్

గోషామహల్ నియోజక వర్గం చుడీ బజార్ అరుంధతి సేవా మండలి ఆధ్వర్యంలో 24న ఆదివారం 'దసరా-దీపావళీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మిద్దె కృష్ణ, ఎం.ధర్మేంధర్లు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని 36 మాదిగ బస్తీలకు ప్రధాన కేంద్రంగా కొనసాగుతున్న మండలి భవనంలో సమ్మేళనం ఉంటుందన్నారు. అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



ప్రియాంక గాంధీ నాలుగు లక్షల పైచీలుగా మెజారిటీతో విజయం సాధించడంతో బర్కత్‌పూరలో సంబరాలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కేపీ మురళీ కృష్ణ

నవతెలంగాణ-అంబర్‌పేట

ఫుట్‌పాత్‌ల ఆక్రమణల కూల్చివేత





నవతెలంగాణ-ధూల్‌పేట్

బెంగళూర్ ప్రధాన రహదారి బదుర్‌పురా ఫ్లైఓవర్ సమీపంలో ఉన్న ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను ఫలక్‌నుమా సర్కిల్10 టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ సర్కిల్ 10లో ఉన్న ఆక్రమణ ఫుట్‌పాత్‌లను కలాపత్తార్ ఇన్‌స్పెక్టర్, బదుర్‌పురా ఇన్‌స్పెక్టర్‌ల పోలీస్ బందోబస్తుతో తొలగించారు. బదుర్‌పురా వద్ద ఫ్లైఓవర్ వంతెన నుండి జూ పార్క్ కాంపౌండ్ సుఖ సాగర్ హోటల్, తాడ్‌బన్ ఎక్స్ రోడ్ వరకు ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారులు పేర్కొన్నారు. జూ పార్క్ నుండి అరాం ఘర్ ప్రధానఫ్లై ఓవర్ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఎలాంటి అంతరాయం కలగకుండా ఉన్నతాధికారుల ఆదేశాలతో కూల్చివేతలు చేపట్టామని తెలిపారు. కూల్చివేతలు చార్మినార్ జోన్ టౌన్ ప్లానింగ్ సీపీ మాజీద్, టౌన్ ప్లానింగ్ విభాగం ఫలక్‌నుమా సర్కిల్ 10 డీసీపీ మెహ్రా పర్యవేక్షించారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. సెక్షన్ ఆఫీసర్ మహేందర్ ప్రాజెక్ట్ డివిజన్ డీఈ ఖష్, ఏఈ ఫైసల్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగించుకోవాలి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నవతెలంగాణ-అంబర్‌పేట

అర్హులైన వారందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌అన్నారు. శనివారం అంబర్పేట్ నియోజక వర్గానికి చెందిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అంబర్‌పేట ఎమ్మార్వో వీరాభయి, కార్పొరేటర్లు, ఇ.విజయ్ కుమార్ గౌడ్, పద్మ వెంకట్ రెడ్డిలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమ కోసం నిరంతరం కృషి చేస్తున్నానని అర్హులైన వారందరూ సంక్షేమ పథకాలు ప్రజల హక్కు అనీ ప్రతి ఒక్కరు సద్వియోగించుకోవాలని దళారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



'మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయకుండా మోడీ ప్రభుత్వం కుట్ర'



- ఎన్ఎఫ్ఐడబ్ల్యూ సదస్సులో వక్తల ఆగ్రహం
- మహిళా రిజర్వేషన్ కోసం ఇంకేంత కాలం ఎదురుచూడాలని నిలదీత
- కేంద్రంపై ఒత్తిడి తెచ్చి మహిళా రిజర్వేషన్లు సాధించుకోవాలని పిలుపు

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

అనేక కుంటిసాకులతో 'మహిళా రిజర్వేషన్'ను అమలు చేయకుండా ప్రధాని మోదీ ప్రభుత్వం కుట్రకు పాల్పడుతోందని పలువురు వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలు కోసం ఇంకేంత కాలం వేచి చూడాలని కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని వారు నిలదీశారు. దేశవ్యాప్త జనగణన నియోజకవర్గాల పునర్ విభజనతో ముడిపెట్టకుండా మహిళా రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) 22వ నిర్మాణ జాతీయ మహా సభల సందర్భంగా 'తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో 'మహిళా రిజర్వేషన్ చట్టం-2023'ను జనాభా లెక్కలు, నియోజకవర్గ పునర్విభజనకు సంబంధం లేకుండా వెంటనే అమలు చేయాలి' అనే అంశంపై రాష్ట్ర సదస్సు శనివారం హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తేల సృజన అధ్యక్షతన జరిగిన సదస్సును భారత జాతీయ మహిళా సమాఖ్య జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.రజని ప్రారంభించగా, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ సీనియర్ నాయకులు పశ్యపద్మ, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ పి.ప్రేమ్ పావని, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదాలక్ష్మి, ఉపాధ్యక్షురాలు ఎస్. ఛాయాదేవి తదితరులు ప్రసంగించారు.ఎలాంటి షరతులు లేకుండా 2029 ఎన్నికల్లో 'మహిళా రిజర్వేషన్' అమలయ్యే విధంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని, ఆ దిశగా క్షేత్రస్థాయి నుంచి మహిళలలో చైతన్యం తీసుకురావాలని వక్తలు పిలుపునిచ్చారు. 'మహిళా రిజర్వేషన్' జాయింట్ సెలెక్ట్ కమిటీ చైర్ వ్యవహరించిన మహిళా సమాఖ్య నాయకురాలు గీత ముఖర్జీ రిజర్వేషన్ అమలు కోసం పార్లమెంట్ అన్ని రాజకీయ పార్టీలకు చెందిన మహిళా ఎంపీలను ఒక తాటిపైకి తీసుకొచ్చారని కొనియాడారు. డాక్టర్ కె.రజని ప్రారంభోపన్యాసం చేస్తూ మహిళలు అనేక రంగాలలో రాణించినప్పటికీ, ప్రభుత్వ నిర్ణయాల్లో భాగస్వామ్యమైనప్పుడే పరిపూర్ణత లభిస్తుందన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు రానున్న 2029 ఎన్నికల్లో అమలయ్యే విధంగా మహిళలంతా దృష్టి కేంద్రీకరించాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ సీనియర్ నాయకులు పశ్య పద్మ అన్నారు. పి.ప్రేమ్ పావని మాట్లాడుతూ ప్రజా, మహిళా పోరాటాలతోనే కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెంచడం ద్వారా మహిళా రిజర్వేషన్ల అమలు సాధ్యమౌతుందన్నారు. నేదునూరి జ్యోతి మాట్లాడుతూ ఎన్నికల్లో ఓట్లు పొందేందుకే మహిళా రిజర్వేషన్ అమలుపై కేంద్రంలోని బీజేపీ కుంటి సాకులు చెప్పిందని విమర్శించారు. మండ సదాలక్ష్మి మాట్లాడుతూ మహిళా రిజర్వేషనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉస్తేల సృజన మాట్లాడుతూ ఎలాంటి షరతులు విధించకుండా మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్. ఛాయాదేవి మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్‌ల బిల్లును చట్టం చేసి వెంటనే అమలు చేయకుంటే దేశ జనాభాలో సగ భాగమైన మహిళలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సదస్సులో మహిళా సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం.నళినిరెడ్డి, బండి జంగమ్మ సహాయ కార్యదర్శులు ఫైమీద, లతాదేవి, కోశాధికారి జయలక్ష్మి, ఎన్ఎఫ్ఐడబ్లు సీనియర్ నాయకురాలు జ్యోష్యబట్ల కల్పన, పోటు కళావతి తదితరులు ప్రసంగించారు.

సదరన్ ట్రావెల్స్ - ట్రావెల్ హంగామా సేల్

- దేశీయ, అంతర్జాతీయ యాత్రికుల కోసం మెగా ఆఫర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

టూరిజం, హాస్పిటాలిటీ రంగంలో దేశంలోని ప్రముఖ సంస్థల్లో ఒకటైన సదరన్ ట్రావెల్స్ అతిపెద్ద డిస్కౌంట్ సేల్ 'ట్రావెల్ హంగామా సేల్ 2024' అందిస్తోంది. ఈ గ్రాండ్ ట్రావెల్ హంగామా సేల్ నవంబర్ 22 నుంచి భారత దేశంలోని తమ సంస్థ కార్యాలయాలలో అందుబాటులోకి తీసుకొచ్చారు. ట్రావెల్ హంగామా సేల్ సమయంలో, సదరన్ ట్రావెల్స్, అంతర్జాతీయ, దేశీయ టూర్ ప్యాకేజీలపై బెస్ట్ డిస్కౌంట్‌తోపాటు ఆకర్షణీయమైన బహుమతులను అందిస్తుంది. ఈ మేరకు శనివారం 'ట్రావెల్ హంగామా సేల్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కోవిడ్ తర్వాత, ట్రావెల్, టూరిజం పరిశ్రమ దేశీయంగా, అంతర్జాతీయంగా గొప్ప పురోగతి చవిచూసింది. సదరన్ ట్రావెల్స్ ఈ పురోగతిలో ముందంజలో ఉంది. సదరన్ ట్రావెల్స్ బుకింగ్‌లలో గత సంవత్సరంతో పోలిస్తే 150శాతం వద్ధి రేటును సాధించామని సదరన్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ. కష్ణ మోహన్ అన్నారు. ఆయన మాట్లాడుతూ సదరన్ ట్రావెల్స్ దేశీయంగా, అయోధ్య, వారణాసి, కామాఖ్య వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, కాశ్మీర్, కేరళ, సిక్కిం, గోవా, వంటి సుందరమైన ప్రదేశాలను ప్రకతి ప్రేమికులకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అంతే కాకుండా అంతర్జా తీయ ప్రయాణికుల కోసం యూరోప్, శ్రీలంక, వియత్నాం, కంబోడియా, దుబాయ్ షాపింగ్ ఫెస్ట్ వంటి సుందరమైన ప్రదేశాలను తక్కువ ఖర్చుతో సందర్శించుకోవచ్చన్నారు.

టోకెన్ అడ్వాన్స్‌తో తమకు నచ్చిన టూర్

ట్రావెల్ హంగామా సేల్‌లో ప్రయాణికులు తమకు నచ్చిన ఏదైనా టూర్ ప్యాకేజీని ఎంచుకుని భారీ డిస్కౌంట్‌లో పొందవచ్చన్నారు. తమకు నచ్చిన టూర్ రూ. 5000 టోకెన్ అడ్వాన్సుతో బుక్ చేసుకోవచ్చు. ఈ అడ్వాన్స్‌లను టూర్లకు వినియోగించుకోవచ్చు. ఈ సంవత్సరం, సదరన్ ట్రావెల్స్ దేశీయ, అంతర్జాతీయ గమ్యస్థానాలకు 2500కుపైగా కస్టమైజ్డ్, గ్రూప్ ప్యాకేజీలను ప్రారంభించింది. యూరప్, జపాన్ చెర్రీ బ్లోసమ్, ఆఫ్రికా, స్కాండినేవియా ఆస్ట్రేలియా, దుబాయ్, యూఎస్ఏ, కెనడాతో పాటు ఫార్ ఈస్ట్ ఆసియా, ప్యాకేజీలను అంది స్తున్నారు. దేశీయ ప్రయాణికుల కోసం, రాజ స్థాన్, కేరళ, అండమాన్, చార్ ధామ్ యాత్ర, హిమాచల్, కాశ్మీర్, ఈశాన్య, తమిళనాడు, గుజ రాత్ వంటి ప్రదేశాలు ఉన్నాయి. తక్కువ బడ్జెట్ లో ప్రయాణం, ఫ్యామిలీ హాలిడేస్, హనీమూ న్‌లు, వెల్‌నెస్ రిట్రీట్‌లు, సాహస యాత్రలు లేదా గ్రూప్ యాత్రల కోసం వెతుకుతున్నా, ట్రావెల్ హంగామా సేల్‌లో అన్నీ ఉన్నాయి.

అనేక రకాల సేవలకు కేరాఫ్ సదరన్ ట్రావెల్స్

1970 న్యూ ఢిల్లీలో సదరన్ ట్రావెల్స్ స్థాపించారు. సదరన్ ట్రావెల్స్‌ను భారత ప్రభుత్వం పర్యాటక మంత్రిత్వ శాఖచే గుర్తించబడిన సంస్థ. దేశవ్యాప్తంగా ఐదు దశాబ్దాల నైపుణ్యం, అనేక శాఖలతో, సదరన్ ట్రావెల్స్ వ్యక్తిగత గుర్తింపు ఉంది. గ్రూప్ టూర్స్, ఇన్సెంటివ్స్ టూర్స్ వీసాలు, హోటల్ బుకింగ్‌లతో సహా అనేక రకాల సేవలను అందిస్తోంది. సదరన్ ట్రావెల్స్ న్యూఢిల్లీ, జైపూర్, విజయవాడలో 200 కంటే ఎక్కువ గదులతో హోటళ్లను కలిగి ఉంది. గౌరవనీయులైన భారత ప్రధానమంత్రిచే ఇటీవల ప్రారంభించబడిన వారణాసిలోని కాశీ టెంపుల్ కారిడార్‌లో ప్రతిష్టాత్మకమైన భీమ శంకర్ అతిథి గహాన్ని నిర్వహిస్తోంది. మరిన్ని వివరాలకు కాల్ : 98480 23236 లేదా www.southerntravelsindia.comలో సంప్రదించాలి.

ఈ ట్రావెల్ హంగామా సేల్ ముఖ్యాంశాలు:

- ఇంటర్నేషనల్ అండ్ డొమెస్టిక్ హాలిడే ప్యాకేజీలపై గరిష్టంగా 70శాతం క్యాష్‌డిస్కౌంట్ ఆఫర్‌లు.
- 2500 కంటే ఎక్కువ అంతర్జాతీయ అండ్ దేశీయ ప్యాకేజీ టూర్లపై భారీ తగ్గింపు.
- మహాధమాకా లక్కీ డ్రాలో కియా కార్, బైక్స్, సింగపూర్ ల్యాండ్ ప్యాకేజీ, 10 గ్రాముల గోల్డ్ కాయిన్‌తోపాటు మరెన్నో గెలుచుకునే అవకాశం కలదు.

మనుషులు ఎన్నో రకాలు

నేను గీతికకు ప్రేమతో...

ఎలా ఉన్నావు చిట్టితల్లి... నేను రాస్తున్న ఉత్తరాలు వీలున్నప్పుడల్లా చదువుతున్నందుకు చాలా సంతోషం. ఉత్తరాల్లో ఉన్న గొప్పతనం అదే. జాగ్రత్తగా దాచుకుని, గుర్తు వచ్చినప్పుడల్లా చదువుకోవచ్చు. ఇవాళ నీకు మనుషుల మనస్థత్వాల గురించి చెబుతాను. మనుషులు రకరకాలుగా ఉంటారు.

అమ్మ లేఖ



ఆలోచనలూ అంతే. కొందరు ఎదుటి వారిని ఇబ్బంది పెట్టి ఆనందిస్తూ ఉంటారు. ఇలాంటి వారు మన చుట్టూనే, మనతోనే ఉంటారు. కానీ వారి మనసు ఎలాంటిదో అర్థం చేసుకోవడం చాలా అవసరం. కొందరి ఆలోచనలను త్వరగా గుర్తించగలం, కొందరిని కొంచం ఆలస్యంగా. వీళ్ళు ఎలా ఉంటారంటే ఎదుటి వాళ్ళు అందంగా ఉన్నా భరించలేరు. ఐశ్వర్యం, చదువు, సంతోషంగా ఉంటే ఓర్చుకోలేరు. ఎదుటి వాళ్ళను మాటలతో బాధ పెట్టి చాలా సంతోష పడుతుంటారు.

మనల్ని పది మందిలో అవమానించడం, సూటి పోటీ మాటలు అనటం, ఒక వైపు మనతో మంచిగా మాట్లాడుతూనే హాని చేయడం లాంటివి చేస్తుంటారు. వాళ్ళను మనం మార్చలేము. ఎందుకంటే మంచి చెప్పినా వీళ్లకు చెడుగానే అనిపిస్తుంది. ఇటువంటి వారితో చాలా జాగ్రత్తగా ఉండాలి సుమా. వారితో మంచిగా ఉంటూనే దూరంగా ఉండాలి. మనల్ని బాధపెట్టే వాళ్లకు దూరంగా ఉండటమే మంచిది. వారితో ఎటువంటి వాదనలకీ దిగకూడదు. ఎప్పుడైనా ఎక్కడైనా కనిపించినా ఒక పలకరింపుతో సరిపెట్టుకోవాలి.

ఎదుటి మనిషి సంతోషాన్ని, ఎదుగుదలను చూసి ఓర్చుకోలేరు. కొందరు మొదట్లో బాగానే ఉన్నా, తర్వాత తర్వాత వాళ్ల మాటల్లో ఎప్పుడో ఒకప్పుడు బైట పడుతుంటారు. అప్పుడు జాగ్రత్త పడాల్సిందే. జీవితంలో ఎన్నో రకాల మనుషులు ఎదురవుతూ ఉంటారు బంగారు తల్లీ. ఎవరినీ మనం మార్చ లేము కనుక జాగ్రత్తగా ఉంటూ, లౌక్యంగా వ్యవహరించాలి తల్లి. జాగ్రత్తగా ఉంటావు కదూ..!



ప్రేమతో అమ్మ
\- పాలపర్తి సంధ్యారాణి

ఆకులతోనూ మేలే..

బీట్‌రూట్ ఆరోగ్యానికి చాలా మంచిదని అందరికీ తెలుసు. అయితే దీని ఆకులు కూడా ఆరోగ్యానికి మేలని నిపుణులు చెబుతున్నారు. బీట్‌రూట్ ఆకులలో శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి చాలా అద్భుతంగా పని చేస్తాయి. బీట్‌రూట్ ఆకులను తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలేంటో తెలుసుకుందాం.



- బీట్‌రూట్ ఆకులలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది.
- బీట్‌రూట్ ఆకులలో నైట్రస్ ఉంటుంది. ఇది శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్, ఆక్సిజన్ స్థాయిలను నిర్వహించడానికి సహాయపడుతుంది. ఇది రక్తపోటును అదుపులో ఉంచుతుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.
- ఈ ఆకులలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే హాని నుండి చర్మాన్ని కాపాడతాయి. యాంటీఆక్సిడెంట్‌లతో పాటు అవసరమైన విటమిన్లు కూడా ఉంటాయి. ఈ పోషకాలు కొల్లాజెన్‌ను పెంచడం ద్వారా చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి.
- బీట్‌రూట్ ఆకుల రుచి తీపిగా ఉంటుంది.. కాబట్టి జ్యూస్ చేసుకుని తాగవచ్చు లేక కర్రీగా కూడా చేసుకోవచ్చు. అదీకాకపోతే పకోడా కూడా తయారు చేసుకోవచ్చు.



శారదా సిన్హా... ఉత్తర భారత సంగీత ప్రియుల గుండెల్లో గూడు కట్టుకున్న గాయిని. జానపదాలు ఆమె గొంతులో నాట్యమాడతాయి. ఛత్ పూజ పాటలకు ఆమె పెట్టింది పేరు. పలు బాలివుడ్ గీతాలకూ తన గాత్రాన్ని అందించి వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఎన్నో అద్భుతమైన పాటలతో భారతీయ సంగీత ప్రపంచంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. జానపద గాయినిగా, బీహార్ గాన కోకిలగా గుర్తింపు తెచ్చుకున్న ఆమె ఇటీవల క్యాన్సర్‌తో కన్నుమూశారు. అటువంటి గొప్ప గాయని సంగీత ప్రయాణం మీకోసం...

బీహార్ గాన కోకిల

శారదా బీహార్‌లోని సుపాల్ జిల్లాలోని రఘోపూర్ అనే మారుమూల గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులకు కలిగిన తొమ్మిది మంది సంతానంలో ఈమె ఒక్కతే ఆడపిల్ల. దాంతో తల్లిదండ్రులు అల్లారు ముద్దుగా పెంచుకున్నారు. శారదకు చిన్నతనం నుండి సంగీతమంటే ఎంతో ఆసక్తి. ఆమె ఇష్టాన్ని గమనించిన ఇంట్లో వాళ్ల ఆ వైపుగా ఆమెను ప్రోత్సహించారు. తల్లిదండ్రుల సహకారంతో మగధ్ మహిళా కళాశాల, ప్రయాగ్ సంగీత్ సమితి నుంచి సంగీత పాఠాలు నేరుకున్నారు. తర్వాత లలిత్ నారాయణ్ మిథిలా యూనివర్సిటీ నుంచి సంగీతంలో పీహెచ్‌డీ చేశారు.

పెండ్లి తర్వాత

శారదకు చిన్న వయసులోనే పెండ్లి చేశారు. అయినా సంగీతంలో పై చదువులు చదవడానికి, ఆ రంగంలో నైపుణ్యాలు నేర్చుకోవడానికి భర్త ఆమెకు ఎంతో చేదోడుగా నిలిచారు. బిహార్‌లోని సిహామా అనే గ్రామానికి చెందిన బ్రజ్కిశోర్ సిన్హాను 1970లో ఆమె వివాహం చేసుకున్నారు. వీరికి ఓ కొడుకు, కూతురు ఉన్నారు. శారదా గాయినిగా ఎదగడానికి భర్త ప్రోత్సహించినా అత్తగారు మాత్రం మొదట్లో ససేమిరా అన్నారు. అస్సలు అంగీకరించలేదు. పెండ్లి తర్వాత ఆడపిల్లలు ఇలా బయటకు వెళ్ళి పాటలు పాడటం ఏంటని ఆమె బలమైన అభిప్రాయం. అయితే బ్రజ్కిశోర్ తన తల్లిని ఒప్పించి భార్య కెరీర్‌కు ఎలాంటి ఆటంకాలు లేకుండా చేశారు. అలా భర్త అడుగడుగునా ప్రోత్సహించడం వల్లనే తాను ఈ స్థాయికి చేరుకున్నానని ఆమె అనేక ఇంటర్వ్యూల్లో పంచుకున్నారు.

బాలివుడ్‌లో తనదైన ముద్ర

బీహార్, ఝార్ఖండ్, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఎక్కువగా జరుపుకునే ఛత్ పూజ పండగ నేపథ్యంలో శారద ఎన్నో పాటలు పాడారు. అలాగే భక్తి గీతాలు, భజన పాటలు ఆలపించేవారు. భోజ్‌పురి, మైథిలీ భాషల్లోనూ వందలాది జానపద గీతాల్ని పాడారు ఆమె. కొన్ని బాలీవుడ్ పాటలు సైతం పాడారు. బాలీవుడ్‌లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'మైనే ప్యార్ కియా' సినిమాలోని 'కహే తో సే సజ్నా' అనే పాట పాడారు. ఇది హిట్‌గా నిలిచింది. తర్వాత 'హమ్ ఆప్కే హై కౌన్, గ్యాంగ్స్ ఆఫ్ వాసేపూర్ అనే సినిమాల్లోనూ పాటలు పాడారు. బాలీవుడ్‌లో తన కంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అలాగే మహరాణి వెబ్‌సిరీస్ కోసం ఆమె పాడిన నిర్మోహియా అనే పాట ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. ఈ సీరిస్ ప్రేక్షకుల్లో ఆదరణ పొందడానికి ఈ పాటే కారణం అనడంలో అతిశయోక్తిలేదు.

పురస్కారాలు...

భక్తి గీతాలు, భజనలు, జానపదాలు, మెలొడీస్, రొమాంటిక్.. ఇలా విభిన్న సంగీత పాటలు పాడుతూ భారతీయ సినీ సంగీత ప్రియుల్ని ఓలలాడించారు శారద. బిహార్ గానకోకిలగా గుర్తింపు తెచ్చుకున్నారు. వాయిస్ ఆఫ్ ఛత్ పూజ అన్న బిరుదు కూడా అందుకున్నారు. సంగీత రంగంలో తాను చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆమెకు 1991లో పద్మశ్రీ, 2018లో పద్మ భూషణ్ పురస్కారాలతో ఆమెను గౌరవించింది. 2000లో సంగీత నాటక అకాడమీ పురస్కారం కూడా అందుకున్నారు.



క్యాన్సర్‌తో కన్నుమూశారు

2017 నుంచి ఒక రకమైన బ్లడ్ క్యాన్సర్తో బాధపడిన ఆమె ఆరోగ్యం ఇటీవలే క్షీణించింది. ఇక ఈ ఏడాది సెప్టెంబర్‌లో భర్తను కోల్పోయిన శారద ఆపై కోలుకోలేకపోయారు. దీంతో గత కొన్ని రోజులు ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స పొందారు. కానీ పరిస్థితి విషమించడంతో నవంబర్ 5వ తేదీన తుది శ్వాస విడిచారు. భారతీయ సినీ సంగీత ప్రియుల్ని శోకసంద్రంలో ముంచి కన్నుమూశారు. ఆమె మృతికి పలువురు ప్రముఖులు, అభిమానులు ఎందరో సంతాపం తెలుపుతూ ట్వీట్లు చేశారు.

ఎన్నికల వాగ్దానాలను అమలు చేయండి..

(మొదటిపేజీ తరువాయి)

సంఘాల నాయకులు, ఉద్యమకారులపై కేసులు పెట్టారని గుర్తు చేశారు. ఈ కేసులన్నీ తక్షణమే రద్దు చేస్తామంటూ సీఎం హామీ ఇచ్చారనీ, ఇంత వరకు రద్దు కాలేదని చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఆ కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 20 జిల్లాల్లో 69 కేంద్రాల్లో సుమారు లక్ష మందికిపైగా పేదలు ప్రభుత్వ భూముల్లో మూడేండ్లుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని అన్నారు. కొన్ని చోట్ల అధికారులు ఈ గుడిసెలను ధ్వంసం చేశారని చెప్పారు. అర్హులైన పేదలందరికీ 120 గజాల ఇంటి స్థలం ఇవ్వడంతోపాటు ఇల్లు కట్టుకోవడానికి రూ.ఐదు లక్షలు సహాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కోటి మంది కార్మికులు 73వ షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పనిచేస్తున్నారని వివరించారు. వారికి 2012 నుంచి కనీస వేతనాలను సవరించలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జనవరిలో కనీస వేతనాల సవరణ కోసం డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను జారీ చేసిందని చెప్పారు. పెరుగుతున్న అవసరాలు, ధరలను పరిగణనలోకి తీసుకోలేదని అన్నారు. ఒక్క రూపాయి పెంచకుండా గతంలో ఉన్న వేతనాన్నే ప్రతిపాదించిందని వివరించారు. దానివల్ల కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఆ నోటిఫికేషన్‌ను సవరించి కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు ఎన్నికల సందర్భం గా ఇచ్చిన వాగ్దానం మేరకు ఏడాదికి రూ.12 వేలు సహాయం చేయాలని కోరారు. ఉపాధి హామీ చట్టాన్ని పట్టణ ప్రాంతాలకూ వర్తింపజేయాలని చెప్పారు. రైతు భరోసాను తక్షణమే అమలు చేయాలని అన్నారు. దొడ్డు బియ్యానికీ రూ.500 బోనస్ వర్తింపజేయాలని సూచించారు. పత్తి, మొక్కజొన్నలకు కూడా ఇవ్వాలని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పీఆర్సీ విడుదలైన ప్రతి సందర్భంలో ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకూ వర్తింపజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దాన్ని ఆపేసిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అమలు చేసిన విధానాన్ని తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. గ్రామపంచాయతీ కార్మికులకు బకాయి ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే బడ్జెట్ కేటాయించాలనీ, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వం కొంత మంది జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇవ్వడానికి అంగీకరించిందని చెప్పారు. ఆ ప్రక్రియలో జరిగిన లోపం వల్ల కొంత మంది సీనియర్ జర్నలిస్టులకు నష్టం జరుగుతు న్నదని అన్నారు. ప్రభుత్వం అంగీకరించిన వాటితోపాటు అదే సీనియార్టీ ఉన్న ఇతర జర్నలిస్టులకూ వారు ఏ సొసైటీల్లో ఉన్నప్పటికీ ఆయా సొసైటీల ద్వారా ఇంటి స్థలాలు ఇవ్వాలని సూచించారు. ఆరు దశాబ్దాలుగా ఉమ్మడి రాష్ట్రం నుంచి కొనసాగుతున్న సొసైటీలో ఉన్న సభ్యులు కూడా నష్టపోతున్నారనీ, ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

మిల్లుకు వెళ్లిన ధాన్యం వెనక్కి రావడంతో రైతు దంపతుల ఆత్మహత్యాయత్నం

(మొదటిపేజీ తరువాయి)

రామకృష్ణారెడ్డి 245 బస్తాలు, చెవుల తండాకు చెందిన గుగులోతు కీమా 180 బస్తాలు. మొత్తంగా 688 బస్తాల వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో తేమ శాతం పరిశీలించి సంబంధిత ఏఈఓ ధ్రువీకరించి కాంటా వేశారు. లారీలో ఎక్కించి కోదాడలోని వెంకట రమణ ట్రేడర్స్ బాల భాస్కర రైస్ మిల్లుకు ఈనెల 17న పంపించారు. కానీ మిల్లు వారు ధాన్యాన్ని పరిశీలించి.. రంగు మారిందని. మాకొద్దు అంటూ కొర్రీలు పెట్టారు. దీంతో రైతులతో మాట్లాడి క్వింటాకు మూడు కిలోల చొప్పున కటింగ్ ఉంటుందని చెప్పారు. మళ్లీ క్వింటాకు 7 కిలోల చొప్పున కటింగ్ ఉంటేనే ధాన్యాన్ని దిగుమతి చేసుకుంటామంటూ.. ధాన్యాన్ని దించుకోకుండానే లారీని శనివారం వెనక్కి పంపించారు. దీంతో తీవ్రంగా మనస్తాపానికి చెందిన గుగులోతు కీమా దంపతులు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నం చేసుకున్నారు. అక్కడే ఉన్న రైతులు వారించడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న తుంగతుర్తి తహసీల్దార్ దయానందం ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చి రైతుల గోసను విన్న అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్ పౌరసరఫరాల అధికారితో మాట్లాడారు. రైతులకు చెందిన ధాన్యం లారీని వేరే మిల్లుకు పంపిస్తున్నట్టు చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

కరుగుతోన్న విదేశీ మారకం నిల్వలు

(మొదటిపేజీ తరువాయి)

నేపథ్యంలోనే నవంబర్ 15తో ముగిసిన వారానికి ఫారెక్స్ నిల్వలు 17.8 బిలియన్ డాలర్లు తరిగి పోయి 657.89 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. గడిచిన ఆరు వారాల్లో మొత్తంగా 30 బిలియన్ డాలర్ల మారకం నిల్వలు తగ్గాయి. సెప్టెంబర్‌లో ఆల్‌టైం రికార్డ్ 704.89 బిలియన్లుగా ఉన్న ఫారెక్స్ రిజర్వుల నుంచి 47 బిలియన్లు కరిగిపోయాయి. అమెరికా ఎన్నికల ఫలితాల తర్వాత అమెరికా డాలర్లకు డిమాండ్ పెరగడం, బాండ్లపై రాబడి పెరిగిందని.. ఇతర కరెన్సీల విలువ తగ్గిందని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఇండియా ఎకనమిస్ట్ గౌర సేన్ గుప్తా పేర్కొన్నారు.

గడిచిన వారంలో డాలర్‌తో రూపాయి మారకం విలువ రికార్డ్ స్థాయిలో 84.41కు పడిపోయింది. శుక్రవారం ఇంట్రాడేలో 84.50 కనిష్ఠ స్థాయిని తాకి తుదకు 84.50 వద్ద ముగిసింది. స్టాక్ మార్కెట్ల వరుస పతనం... ముఖ్యంగా విదేశీ సంస్థాగత మదుపర్లు తమ ఈక్విటీలను తరలించుకుపోవడమూ రూపాయి విలువపై ఒత్తిడిని పెంచింది. అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి విలువ క్రమంగా పడిపోతున్న నేపథ్యంలో ఆర్‌బిఐ తన వద్ద ఉన్న డాలర్లను భారీగా విక్రయిస్తోంది. దీంతో రూపీ విలువకు స్థిరత్వాన్ని అందించాలని భావించింది. సెప్టెంబర్ చివరి నుంచి నెల రోజుల్లోనే 26 బిలియన్ డాలర్ల రిజర్వులను విక్రయించింది. భారత కరెన్సీలో ఈ విలువ దాదాపు రూ.2.20 లక్షల కోట్లు. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ గెలిచిన తర్వాత డాలర్ క్రమంగా బలపడుతోంది. ఇతర కరెన్సీలపై ఒత్తిడి పెరుగుతోంది. దీంతో సెంట్రల్ బ్యాంకులు తమ స్థానిక కరెన్సీల మారకపు రేటు ప్రభావితం కాకుండా తాత్కాలిక రక్షణ కోసం డాలర్లను విక్రయిస్తున్నాయని నిపుణులు భావిస్తున్నారు.

రూ.26,533 కోట్ల ఎఫ్‌పీఐలు వెనక్కి

భారత స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్‌పీఐ) తమ పెట్టుబడులను భారీగా తరలించుకుపోయారు. ప్రస్తుత నవంబర్‌లో ఇప్పటి వరకు ఏకంగా రూ.26,533 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు నికరంగా రూ.19,940 కోట్ల ఈక్విటీలను విక్రయించారు. ఒక్క అక్టోబర్ నెలలో రూ.94,017 కోట్లను మార్కెట్ నుంచి బయటకు తీసుకున్నారు. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో అక్టోబర్ ప్రారంభం నుంచి ఎఫ్‌పీఐలు పెద్ద ఎత్తున తరలిపోతున్నాయి. చైనా తీసుకున్న ఉద్దీపన చర్యల కారణంగా తమ అమ్మకాలను కొనసాగించారు. దీనికి తోడు కార్పొరేట్ ఫలితాలు నిరాశాజనకంగా ఉండటంతో క్రమంగా తమ పెట్టుబడులను తగ్గించుకుంటున్నారు. శుక్రవారం ఒక్క సెషన్‌లోనే రూ.1,278.37 కోట్ల ఎఫ్ఐఐలు తరలిపోయాయి. కాగా.. దేశీయ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు (డీఐఐ) నికరంగా రూ.1,722.15 కోట్ల ఈక్విటీలను కొనుగోళ్లు చేశారు.

ఎరువుల పిడుగు

(మొదటిపేజీ తరువాయి)



జిల్లాల్లో సాగునీటి వనరులు, బోర్ల ద్వారా నీటి లభ్యత ఉన్నందున వరి పంట సాగు అధికంగా ఉండనుంది. సంగారెడ్డి జిల్లాలో 1.82 లక్షల ఎకరాల్లో పంటలు సాగవ్వనున్నాయి. బోర్లు, సింగూరు ప్రాజెక్టు కింద నీటి లభ్యత ఉన్నందున వరి పంట 1.2 లక్షల ఎకరాల్లో సాగవ్వనుంది. ఇప్పటికే ఖరీఫ్ వరి కోతలు, ఇతర పంటలు చేతికొచ్చినందున రైతులు యాసంగి సీజన్ సాగు పనుల్లోకి దిగారు. వరి నార్ల కోసం దుక్కలు దున్ని విత్తనాలు సిద్ధం చేసుకుంటున్నారు.

డీఏపీ బస్తాపై రూ.300 భారం

ఉన్నట్లుండి యాసంగి సీజన్‌కు ముందే డీఏపీ ఎరువు బస్తా ధర ఏకంగా రూ.300 పెంచారు. ఇప్పటి వరకు డీఏపీ బస్తా ధర రూ.1350 ఉండగా ప్రస్తుతం రూ.1650కి పెరిగింది. యాసంగీ సీజన్‌లో వరి, పండ్ల తోటలు, ఇతర పంటల సాగు కోసం యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, సింగిల్ సూపర్ ఫాస్పేట్, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వంటి ఎరువుల్ని వినియోగిస్తారు. రాష్ట్రంలో 1.50 లక్షల మెట్రిక్ టన్నుల వరకు డీఏపీ ఎరువుల్ని వివిధ పంటల సాగులో వినియోగిస్తారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో డీఏపీ ఎరువు 20 వేల మెట్రిక్ టన్నుల వరకు వినియోగిస్తారు. మార్కెట్‌లో డీఏపీ ధరలు విపరీతంగా పెరగడంతో డీఏపీ బస్తా కొనాలంటే రైతులకు గుండె దడ పుడుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 4 లక్షల డీఏపీ బస్తాల్ని వినియోగిస్తారు. ఆ లెక్కన బస్తాకు రూ.300 చొప్పున ఉమ్మడి మెదక్ జిల్లా రైతాంగంపై రూ.12 కోట్ల భారం మోపబడుతుంది. రాష్ట్రంలోనూ 30 లక్షల బస్తాల వరకు డీఏపీని వినియోగిస్తున్నారు. బస్తాకు రూ.300 చొప్పున భారం పడినందున రూ.90 కోట్ల వరకు రైతులు భరించాల్సి ఉంటుంది. సగటున రాష్ట్ర రైతాంగంపై కేవలం డీఏపీ ఎంపీఆర్(గరిష్ఠ రిటైల్ ధర) ప్రకారం కొనుగోలు చేసినా రూ.100 కోట్ల వరకు అదనపు భారం పడుతుండడంతో యాసంగి సాగు కష్టకాలంగా మారనుంది.

మార్కెట్‌లో నిల్వల్లేవు... బ్లాక్ మార్కెటింగ్

యాసంగి సీజన్ సాగు పనులు జరుగుతున్నా మార్కెట్‌లో అవసరమైన ఎరువుల నిల్వలు కనిపిస్తలేవు. ఎరువులకు నోడల్ ఏజెన్సీగా వ్యవహరించే మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖల ద్వారా ఎరువుల పంపిణీ చేస్తారు. ఫర్టిలైజర్ వ్యాపారులు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు విక్రయిస్తారు. వాస్తవంగా యాసంగి సీజన్‌కు అవసరమైన ఎరువుల్ని ముందే బఫర్ స్టాక్ ఉంచాలి. నవంబర్‌లో 65 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువుల్ని స్టాక్ నిల్వ ఉంచాల్సి ఉండగా ప్రస్తుతం 12 వేల మెట్రిక్ టన్నులు కూడా అందుబాటులో లేని పరిస్థితి ఉంది. దేశ వ్యాప్తంగా కూడా డీఏపీ కొరత నెలకొనడంతో రాష్ట్రంలోనూ అదే పరిస్థితి కనిపిస్తుంది. వాస్తవంగా అక్టోబర్‌లో 30 వేల మెట్రిక్ టన్నులు, నవంబర్‌లో 40 వేల మెట్రిక్ టన్నులు, డిసెంబర్‌లో 35 వేలు, జనవరిలో 30 వేల మెట్రిక్ టన్నుల వరకు నిల్వలు ఉంచి రైతులకు కొరత లేకుండా చూడాల్సిన మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖలు నిమ్మకు నీరెత్తినట్టు చూస్తున్నాయి. ఎరువుల వినియోగాన్ని బట్టి ముందే ఇండెంట్ పెట్టి స్టాక్ తెప్పించి స్థానికంగా ఏర్పాటు చేసిన రేక్ పాయింట్లలో నిల్వ ఉంచి స్థానిక అవసరాల్ని బట్టి పంపిణీ చేయాలి. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న కొద్దిపాటి నిల్వల్ని కూడా వ్యాపారులు బ్లాక్ చేసి పాత స్టాక్‌ను పెరిగిన ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నిల్వలు లేక, ఉన్నా ధరలు పెరగడంతో రైతుకు డీఏపీ దొరకడమే గగనంగా మారుతోంది.

డీఏపీ భారం మోపొద్దు: గొల్లపల్లి జయరాజు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు



డీఏపీ ధరలు పెరగడం వల్ల రైతులు నష్టపోనున్నారు. ఇప్పటికే సాగు వ్యయం విపరీతంగా పెరిగింది. డీజీల్, ఎరువులు, విత్తనాల ధరలు పెంచుతున్నారు. రైతులు పండించే పంటలకు మాత్రం కేంద్రం గిట్టుబాటు ధరల్ని ఖరారు చేసి మద్దతు ధరలుగా ప్రకటించడంలేదు. స్వామినాథన్ కమిషన్, ఇతర కమిషన్లు చేసిన సూచనలేవీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. పెంచిన డీఏపీ ఎరువు ధరల భారాన్ని రైతులపై వేయకుండా కేంద్రం భరించాలి. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలి.

లగచర్లలో జాతీయ మానవ హక్కుల కమిషన్

(మొదటిపేజీ తరువాయి)

బాధపడుతున్నామని స్థానికులు కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. తమకు న్యాయం చేయాలని కమిషన్ సభ్యులను కోరారు. బాధితులను ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాలని ఏఎన్ఎంను కమిషన్ సభ్యులు ఆదేశించారు. ఆదివారం కూడా విచారణ కొనసాగే అవకాశాలున్నట్టు సమాచారం. మరోవైపు లగచర్ల ఘటనపై సీఎస్, డీజీపీని రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఎన్‌హెచ్ఆర్సీ ఆదేశించింది. నివేదికలో ఎఫ్ఐఆర్‌ల స్థితి, న్యాయ కస్టడీలో ఉన్న వ్యక్తుల వివరాలు, భయంతో అడవుల్లో దాక్కున్న గ్రామస్తుల వివరాలు ఉండే విధంగా చూడాలని సూచించింది.

ఏజెన్సీ డీఎస్సీ వేయాలి

బీఈడీ కళాశాలలో రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయాలి

తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతంలో ఐటీడీఏ కేంద్రాల పరిధిలో స్పెషల్ ఏజెన్సీ డీఎస్సీ వేసి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలనీ, ఉట్నూర్, భద్రాచలం కేంద్రంగా కొనసాగుతున్న బీఈడీ కళాశాలల్లో రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయాలనీ తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు హైదరాబాద్ లో జరిగిన ఆ సంఘం రాష్ట్ర కమిటీలో ఈ అంశంపై చర్చించినట్టు తెలిపారు. రాష్ట్రంలో గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు స్పెషల్ ఏజెన్సీ డీఎస్సీ వేసి స్థానిక ఆదివాసీలతో భర్తీ చేయాలనీ డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్వహించిన జనరల్ డీఎస్సీ వల్ల ఆదివాసీ అభర్థులకు తీరని అన్యాయం జరిగిందని తెలిపారు. జనరల్ డీఎస్సీలో 29 జీవోతో ఆదివాసీ అభ్యర్థులు నష్ట పోయారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఐదో షెడ్యూల్ ప్రాంతంలోని గిరిజన ప్రాంతంలో స్పెషల్ డీఎస్సీ స్థానిక గిరిజన యువతకు ఉద్యోగ అవకాశలు కల్పించి ఉపాధ్యాయ కొరతను తీర్చాలని డిమాండ్ చేశారు. ఉట్నూర్, భద్రాచలం కేంద్రంగా బీఈడీ కళాశాలలు ఏర్పాటు చేసి 16 సంవత్సరాలైనప్పటికీ వాటిల్లో ఒక్క రెగ్యులర్ పోస్టు భర్తీ చేయలేదనీ, ఆదివాసీలకు ఉన్నత విద్యా అందించే ఆ కళాశాలలపై ప్రభుత్వాల నిర్లక్ష్యమెందుకని ప్రశ్నించారు. తక్షణమే మంజూరైనా రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయాలనీ డిమాండ్ చేశారు. గిరిజన ఉపాధ్యాయులకు ఏజెన్సీ పదోన్నతులు కల్పించాలనీ, ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టాలని స్పెషల్ ఏజెన్సీ డీఈవో పోస్టును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పోడు భూములకు పట్టాలు అందించాలనీ, పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్‌ను కూలీల ఖాతాల్లో వేయాలనీ, గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి రవికుమార్, ఎర్మ పున్నం, సహాయ కార్యదర్శి పొలం రాజేందర్ తనుష్, భీంరావు,నాయకులు మాలశ్రీ, అశోక్, విష్ణు, దామోదర్, భాగాల రాజన్న తదితరులు పాల్గొన్నారు

ధన్యవాదాలు-ఎస్‌డబ్ల్యూఎఫ్


నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీలో కార్మికోద్యమంపై ఆంక్షలు ఎత్తివేసి, గుర్తింపు ఎన్నికలు జరపాలనీ, ఉద్యోగ భద్రత కల్పించాలనీ, యూనియన్ కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకం కల్పించవద్దని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డిని కోరిన సీపీఎం, సీఐటీయూ రాష్ట్ర నాయకత్వాలకు టీజీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర కమిటీ ధన్యవాదాలు తెలిపింది. శనివారం సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య తదితరులు ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డిని కలిసి రాష్ట్రంలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చారని తెలిపారు. దానిలోనే ఆర్టీసీ కార్మికుల సమస్యల్ని కూడా ఏకరువు పెట్టారన్నారు. సీఐటీయూ ఎప్పుడూ కార్మికుల పక్షాన నిలుస్తూనే ఉందనీ, ఆర్టీసీ కార్మికోద్యమంపై ఆంక్షలు ఎత్తివేయాలని కోరుతూ గతంలో 40 వేల కరపత్రాలు పంచి, ఈనెల 19న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల ఎదుట ధర్నాలు చేశారని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు గుర్తుచేశారు.

జైస్వాల్,రాహుల్ అదరహో

బ్యాటర్ల వైఫల్యంతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ డిఫెన్స్‌ను మొదలెట్టిన టీమ్ ఇండియా.. పేసర్ల ప్రతాపానికి, ఓపెనర్ల మెరుపులు జతకలవటంతో ఆస్ట్రేలియాతో తొలి టెస్టులో పట్టు బిగించింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (90 బ్యాటింగ్), కెఎల్ రాహుల్ (62 బ్యాటింగ్) అజేయ అర్థ సెంచరీలతో కదం తొక్కారు. క్రికెట్ పుస్తకాల్లోని మౌళిక సూత్రాలు పాటిస్తూ, సహనంతో బ్యాటింగ్ చేసిన జైస్వాల్, రాహుల్ భారత్ ఆధిక్యాన్ని 200 పరుగుల మార్క్ దాటించారు. పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా (5/30) ఐదు వికెట్ల ప్రదర్శనతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 104 పరుగులకు కుప్పకూలింది. భారత్ 46 పరుగుల విలువైన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది.

- అజేయ అర్ధ సెంచరీలు బాదిన ఓపెనర్లు
- పేస్ దళపతి బుమ్రా ఐదు వికెట్ల ప్రదర్శన
- భారత్ రెండో ఇన్నింగ్స్ 172/0
- ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 104/10


యశస్వి జైస్వాల్ (90 బ్యాటింగ్)

నవతెలంగాణ-పెర్త్

యశస్వి జైస్వాల్ (90 బ్యాటింగ్, 193 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సులు), కెఎల్ రాహుల్ (62 బ్యాటింగ్, 153 బంతుల్లో 4 ఫోర్లు) అజేయ అర్ధ సెంచరీలతో అదరగొట్టారు. పిచ్ నెమ్మదిగా పేస్ నుంచి బ్యాటింగ్‌కు అనుకూలంగా మారుతుండగా.. భారత ఓపెనర్లు ఆసీస్ బౌలర్లను ఆడుకున్నారు. రెండో రోజు ఆటలో రెండు సెషన్ల పాటు బ్యాటింగ్ చేసిన భారత్ వికెట్ నష్టపోకుండా 172 పరుగులు చేసింది. 57 ఓవర్ల పాటు ఆసీస్ బౌలర్లు వికెట్ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అంతకుముందు, ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 104 పరుగులకు కుప్పకూలింది. మిచెల్ స్టార్క్ (26, 112 బంతుల్లో 2 ఫోర్లు), అలెక్స్ కేరీ (21, 31 బంతుల్లో 3 ఫోర్లు) ఆసీస్‌కు మూడెంకల స్కోరు అందించారు. భారత కెప్టెన్ జశ్‌ప్రీత్ బుమ్రా (5/30) ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 218 పరుగుల ముందంజలో కొనసాగుతోంది. తొలి రోజు ఆటలో ఏకంగా 17 వికెట్లు పతనం అవగా.. రెండో రోజు ఆటలో కేవలం మూడు వికెట్లు పడ్డాయి.

యశస్వి, రాహుల్ షో

తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగుల విలువైన ఆధిక్యం సాధించిన టీమ్ ఇండియాను ఓపెనర్లు తమదైన ఇన్నింగ్స్‌లతో తిరుగులేని స్థానంలో నిలబెట్టారు!. తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్ నుంచి పాఠం నేర్చుకున్న యశస్వి జైస్వాల్ బంతిని బలంగా బాదేందుకు చూడలేదు. క్రీజులో నిలబడి వికెట్ల మధ్య పరుగుపై ఫోకస్ పెట్టాడు. నెమ్మదిగా ఒక్కో పరుగూ జోడించిన జైస్వాల్.. 123 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు. జైస్వాల్ కెరీర్‌లో ఇదే అత్యంత నెమ్మదైన అర్ధ సెంచరీ. కమిన్స్‌పై ట్రేడ్‌మార్క్ అప్పర్‌కట్, స్టార్క్‌పై డీప్ స్క్వేర్‌లెగ్‌లో బౌండరీ, లయాన్ ఓవర్లో క్రీజు వదిలి సంధించిన సిక్సర్ యశస్వి ఇన్నింగ్స్‌లో హైలైట్. కెఎల్ రాహుల్ తొలి ఇన్నింగ్స్ జోరు కొనసాగించాడు. వివాదాస్పద డీఆర్ఎస్ నిర్ణయానికి బలైన రాహుల్.. రెండో ఇన్నింగ్స్‌లో అదే క్లాస్ చూపించాడు. ఏమాత్రం దూకుడు చూపకుండా అద్భుతంగా ఆడాడు. వేగంగా పరుగులు రాబట్టిన యశస్వికి మరో ఎండ్ నుంచి చక్కని సహకారం అందించాడు. మిచెల్ స్టార్క్, హాజిల్‌వుడ్‌ను ఎదుర్కొనేందుకు జైస్వాల్ క్రీజు లోపల నిలబడి బంతులను ఎదుర్కొన్నాడు. రాహుల్, యశస్వి తొలి వికెట్‌కు అజేయంగా 172 పరుగులు జోడించారు.

ఆస్ట్రేలియా పేసర్లు తొలి రోజు జోరు పునరావృతం చేయలేకపోయారు. కెప్టెన్ పాట్ కమిన్స్ ఏమాత్రం ప్రభావం చూపించలేకపోయాడు. జోశ్ హాజిల్‌వుడ్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. అతడిపై పరుగుల వేట కష్టమైంది. నిలకడగా బ్యాటర్లపై ఒత్తిడి పెంచినా.. వికెట్ మాత్రం పడలేదు. నాథన్ లయాన్ వ్యూహం ఫలించలేదు. జైస్వాల్‌ను ఊరించే ప్రయత్నంలో పరుగులు సమర్పించుకున్నారు కానీ విజయవంతం కాలేదు. ట్రావిశ్ హెడ్, లబుషేక్‌కు బంతి అందించినా ఉపయోగం లేదు. జైస్వాల్ 51 పరుగుల వద్ద ఉండగా స్లిప్స్‌లో ఇచ్చిన క్యాచ్‌ను ఉస్మాన్ ఖవాజా అందుకోలేదు. ఆ తర్వాతి బంతికే కెఎల్ రాహుల్ రనౌట్ ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ఒకట్రెండు సార్లు ఓపెనర్ల మధ్య కమ్యూనికేషన్ లోపించినా.. వెంటనే రాహుల్, జైస్వాల్ సరిచేసుకున్నారు. క్రీజులో ఎంతో సమయంతో బ్యాటింగ్ చేశారు. లంచ్ సెషన్లో 26 ఓవర్లలో 84 పరుగులు చేసిన ఈ జోడీ.. టీ సెషన్లో 31 ఓవర్లలో 88 పరుగులు సాధించారు.

బుమ్రాకు ఐదు వికెట్లు

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 104 పరుగులకు కుప్పకూలింది. బుమ్రా బూమ్‌బూమ్ ప్రదర్శనతో ఏ దశలోనూ 100 పరుగులు చేసేలా కనిపించని కంగారూలు.. టెయిలెండర్ల మెరుపులతో మూడెంకల స్కోరు అందుకుంది. 79/9తో భారత్ చేతిలో అత్యల్ప స్కోరుకు పరిమితం అయ్యేలే కనిపించిన ఆసీస్ (1981 మెల్‌బోర్న్ టెస్టులో భారత్ చేతిలో 83కు ఆలౌట్) స్టార్క్ అండతో బతికిపోయింది. హాజిల్‌వుడ్ (7)తో కలిసి 26 పరుగులు జోడించిన స్టార్క్ (26) ఆకట్టుకున్నాడు. అలెక్స్ కేరీ (21) వికెట్‌తో బుమ్రా ఐదు వికెట్ల ప్రదర్శన పూర్తి చేశాడు. ఆసియా ఆవల బుమ్రాకు ఇది 11వ ఐదు వికెట్ల ప్రదర్శన. 51.2 ఓవర్లలో ఆసీస్ 104 పరుగులు చేసింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగుల ఆధిక్యం సాధించింది.


కెఎల్ రాహుల్ (62 బ్యాటింగ్)


జశ్‌ప్రీత్ బుమ్రా (5/30)

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 150/10

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: ఉస్మాన్ ఖవాజా (సి) కోహ్లి (బి) బుమ్రా 8, మెక్‌స్వీనీ (ఎల్బీ) బుమ్రా 10, లబుషేన్ (ఎల్బీ) సిరాజ్ 2, స్మిత్ (ఎల్బీ) బుమ్రా 0, హెడ్ (బి) రానా 11, మార్ష్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 6, అలెక్స్ కేరీ (సి) పంత్ (బి) బుమ్రా 21, కమిన్స్ (సి) పంత్ (బి) బుమ్రా 3, స్టార్క్ (సి) పంత్ (బి) రానా 26, లయాన్ (సి) రాహుల్ (బి) రానా 5, హాజిల్‌వుడ్ నాటౌట్ 7, ఎక్స్‌ట్రాలు : 5, **మొత్తం : (51.2 ఓవర్లలో ఆలౌట్) 104.**

వికెట్ల పతనం: 1-14, 2-19, 3-19, 4-31, 5-38, 6-47, 7-59, 8-70, 9-79, 10-104.

బౌలింగ్ : జశ్‌ప్రీత్ బుమ్రా 18-6-30-5, మహ్మద్ సిరాజ్ 13-7-20-2, హర్షిత్ రానా 15.2-3-48-3, నితీశ్ కుమార్ రెడ్డి 3-0-4-0, వాషింగ్టన్ సుందర్ 2-1-1-0.

భారత్ రెండో ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ బ్యాటింగ్ 90, కెఎల్ రాహుల్ బ్యాటింగ్ 62, ఎక్స్‌ట్రాలు : 20, **మొత్తం :** (57 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 172.

బౌలింగ్ : మిచెల్ స్టార్క్ 12-2-43-0, జోశ్ హాజిల్‌వుడ్ 10-5-9-0, పాట్ కమిన్స్ 13-2-44-0, మిచెల్ మార్ష్ 6-0-27-0, నాథన్ లయాన్ 13-3-28-0, లబుషేన్ 2-0-2-0, ట్రావిశ్ హెడ్ 1-0-8-0.



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 సీజన్ ముంగిట ఆటగాళ్ల మెగా వేలానికి సిద్ధమైంది. సౌదీ అరేబియా రాజధాని జెడ్డా వేదికగా రెండు రోజుల పాటు క్రికెటర్లపై కాసుల వర్షం కురిపించేందుకు పది ఫ్రాంచైజీలు ఎదురుచూస్తున్నాయి. రిషబ్ పంత్, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్, జోశ్ బట్లర్‌లు నేడు వేలంలో ప్రధాన ఆకర్షణగా నిలువనున్నారు. ఈసారి వేలంలో అంచనాలకు మించి ధర దక్కించుకుని, జాక్‌పాట్ కొట్టేదెవరనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది.

జాక్‌పాట్ కొట్టేదెవరో!

- పంత్, అయ్యర్, రాహుల్‌పై ఫోకస్
- నేడు, రేపు ఐపీఎల్ ఆటగాళ్ల మెగా వేలం

నవతెలంగాణ-జెడ్డా

2025 ఆటగాళ్ల వేలం వేదిక :

ఐపీఎల్ నిర్వాహకులు గత సీజన్‌లో దుబాయ్‌లో ఆటగాళ్ల వేలం నిర్వహించారు. ఈసారి మెగా వేలానికి వేదికగా జెడ్డా నగరాన్ని ఎంచుకున్నారు. ఆది, సోమవారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి వేలం ప్రక్రియ షురూ కానుంది. స్టార్‌స్పోర్ట్స్, జియో సినిమాలో వేలం ప్రసారం అవుతుంది.

వేలంలో ఎంతమంది ఆటగాళ్లు :

2025 ఐపీఎల్ వేలంలో 574 మంది క్రికెటర్లు తమ అదృష్టం పరీక్షించుకోనున్నారు. 1574 మంది క్రికెటర్లు వేలంలోకి వచ్చేందుకు దరఖాస్తు చేసుకోగా.. 574 మందితో తుది జాబితాను సిద్ధం చేశారు. ఇందులో 366 మంది భారత, 208 మంది విదేశీ క్రికెటర్లు ఉన్నారు.

దిగ్గజ ప్లేయర్లు సైతం.. :

గతంలో మాదిరిగానే ఈసారి సైతం దిగ్గజ ప్లేయర్ల జాబితా వేలంలోకి రానుంది. రెండు సెట్ల పాటు దిగ్గజ ప్లేయర్లను వేలం వేయనున్నారు. జోశ్ బట్లర్, శ్రేయస్ అయ్యర్ రిషబ్ పంత్ కగిసో రబాడ, అర్షదీప్ సింగ్, మిచెల్ స్టార్క్‌లు తొలి సెట్‌లో.. యుజ్వేంద్ర చాహల్, లియాం లివింగ్‌స్టోన్, డెవిడ్ మిల్లర్, కెఎల్ రాహుల్, మహ్మద్ షమి, మహ్మద్ సిరాజ్‌లు రెండో సెట్‌లో ఉన్నారు. దిగ్గజ ప్లేయర్లలో ఒకరు నేడు జాక్‌పాట్ కొట్టే అవకాశం ఉందని అంచనా.

వేలంలో రానున్న బిగ్ క్రికెటర్లు! :

దిగ్గజ క్రికెటర్లు కాకుండా చాలామంది స్టార్ క్రికెటర్లు నేడు వేలంలోకి వస్తున్నారు. ఇషాన్ కిషన్, రవిచంద్రన్ అశ్విన్, హర్షల్ పటేల్, ఖలీల్ అహ్మద్, దీపక్ చాహర్, వెంకటేశ్ అయ్యర్, అవేశ్ ఖాన్, ముకేశ్ కుమార్, భువనేశ్వర్ కుమార్, ప్రసిద్ కృష్ణ, టి నటరాజన్, దేవదత్ పడిక్కల్, కృనాల్ పాండ్య, వాషింగ్టన్ సుందర్, శార్దుల్ ఠాకూర్, ఉమేశ్ యాదవ్ సహా పలువురు భారత క్రికెటర్లు మంచి ధర కోసం ఎదురుచూస్తున్నారు. విదేశీ క్రికెటర్లలో డెవిడ్ వార్నర్, గ్లెన్ మాక్స్‌వెల్, డుప్లెసిస్, డెవాన్ కాన్వే, టిమ్ డెవిడ్, రచిన్ రవీంద్ర, క్వింటన్ డికాక్, మార్కస్ స్టోయినిస్, శామ్ కరణ్, జానీ బెయిర్‌స్టోలు ఫ్రాంచైజీలను ఆకర్షించనున్నారు.



వేలంలో బిడ్ ఎలా జరుగుతుంది? :

వేలం ప్రక్రియ దిగ్గజ ప్లేయర్లతో మొదలవుతుంది. 12 మంది క్రికెటర్లు ఈ జాబితాలో ఉన్నారు. అనతరం, క్యాప్డ్ (జాతీయ జట్టుకు ఆడినవారు) ప్లేయర్లను బ్యాటర్లు, ఆల్‌రౌండర్లు, పేసర్లు, స్పిన్నర్లు, వికెట్ కీపర్లు వారీగా విభజించి వేలం వేస్తారు. ఆ తర్వాత అన్‌క్యాప్డ్ (జాతీయ జట్టుకు ఆడనివారు) ప్లేయర్లు వేలంలోకి వస్తారు. 116 మంది క్రికెటర్లను వేలం వేసిన తర్వాత.. వేలం స్పీడ్ పెరుగుతుంది. 117-574 వరకు ఎక్స్‌ప్రెస్ వేలం వేస్తారు. ఆ తర్వాత, వేలంలో అమ్ముడుపోని ఆటగాళ్ల జాబితాలో ఆసక్తిగల క్రికెటర్ల పేర్లను ఫ్రాంచైజీలు ఎంచుకోవాల్సి ఉంటుంది. రెండో రోజు మళ్లీ ఆ జాబితాను మాత్రమే వేలంలో వేస్తారు.

వేలంలో ఎంతమందిని తీసుకుంటారు? :

ఐపీఎల్ రూల్స్ ప్రకారం ప్రతి జట్టు కనిష్ఠంగా 18, గరిష్ఠంగా 25 మందిని తీసుకోవాలి. అంటే పది ఫ్రాంచైజీలు 250 మందిని తీసుకోవచ్చు. రిటెన్షన్‌తో ఫ్రాంచైజీలు ఇప్పటికే 46 మందిని అట్టిపెట్టుకున్నాయి. దీంతో వేలంలో గరిష్ఠంగా 204 మందిని తీసుకొవచ్చు. ప్రతి ఫ్రాంచైజీ గరిష్ఠంగా 8 మంది విదేశీ క్రికటర్లను ఎంచుకోవచ్చు. దీంతో 70 మంది విదేశీ క్రికెటర్లకు మాత్రమే నేడు అదృష్టం వరించనుంది.

ఏ ఫ్రాంచైజీ వద్ద ఎంత సొమ్ము ఉంది? :

వేలంలో ప్రతి ఫ్రాంచైజీ రూ.120 కోట్లను ఖర్చు చేయవచ్చు. పంజాబ్ కింగ్స్ మినహా అన్ని ఫ్రాంచైజీలు అట్టిపెట్టుకునే ఆటగాళ్ల కోసం పెద్ద మొత్తంలో వెచ్చించాయి. పంజాబ్ కింగ్స్ రూ.110.5 కోట్ల పర్సుతో వేలంలోకి రానుంది. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ రూ.83 కోట్లు, ఢిల్లీ క్యాపిటల్స్ రూ.73 కోట్లు, గుజరాత్ టైటాన్స్ రూ.69 కోట్లు, లక్నో సూపర్ జెయింట్స్ రూ.69 కోట్లు, చెన్నై సూపర్ కింగ్స్ రూ.55 కోట్లు, కోల్‌కత నైట్‌రైడర్స్ రూ.51 కోట్లు, ముంబయి ఇండియన్స్ రూ.45 కోట్లు, సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ.45 కోట్లు, రాజస్థాన్ రాయల్స్ రూ.41 కోట్లతో వేలంలోకి అడుగుపెడుతున్నాయి.

నవచిత్రం

అంతకు మించి..


రిషబ్ శెట్టి

ఇటీవల కాలంలో ప్రపంచ ప్రేక్షకుల మనసు దోచుకున్న 'కాంతారా' సిరీస్ నుంచి ఇప్పుడు 'కాంతారా చాప్టర్- 1' రాబోతోంది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది అక్టోబర్ 2న విడుదల చేస్తున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ సంస్థ అధికారికంగా ప్రకటించింది.

పాన్ ఇండియా సినిమాగా మరోసారి అందర్నీ ఆకర్షించేందుకు ఈ మూవీ సిద్ధంగా ఉంది.

ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కి నాయకత్వం వహిస్తున్న నటుడు-దర్శకుడు రిషబ్ శెట్టి తన పాత్ర కోసం ఎంతో శ్రమిస్తున్నారు. తన పాత్రలో రియాలిటీ ఉట్టిపడేలా కష్టపడుతున్నారు. కేరళ నుండి ఉద్భవించిన పురాతన యుద్ధ కళలలో ఒకటైన కలరిపయట్టులో రిషబ్ కఠినమైన శిక్షణ పొందారు.

కళలో ప్రావీణ్యం సంపాదించడానికి అంకిత భావంతో పని చేసి తన పాత్ర, సంప్రదాయానికి మచ్చుతునకలా నిలిచేలా చేశారు. సినిమాలో ఈ రోల్ హైలైట్ అవుతుందని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేశారు.

'కాంతారా చాప్టర్- 1' కొంకణ్ జానపద గొప్పతనాన్ని ప్రపంచానికి పరిచయం చేయనుంది. గ్రిప్పింగ్ కథనం, ఉత్కంఠభరితమైన విజువల్స్‌తో ఈ చిత్రం భారతదేశ సరిహద్దులను దాటి ప్రేక్షకులకు కనెక్ట్ చేస్తుంది. ఇప్పటికే వచ్చిన 'కాంతారా' మూవీ స్థానిక సంప్రదా యాల ప్రామాణికమైన వర్ణన, స్టోరీ టెల్లింగ్‌తో స్లీపర్ హిట్‌గా మారింది. ఈ ఫ్రాంచైజీకి ప్రపంచ స్థాయి ఫ్యాన్స్‌ని సొంతం చేసింది. ఈ చిత్రం సినీ చరిత్రలో మరో మైలురాయి అవుతుందని మేకర్స్ అన్నారు.

పవర్‌ఫుల్ ప్రతినాయకుడు



అజయ్ ధీషన్

విజయ్ ఆంటోని తాజాగా నటిస్తున్న మర్డర్ మిస్టరీ-క్రైమ్ థ్రిల్లర్ 'గగన మార్గన్'. లియో జాన్ పాల్ దర్శకుడు. విజయ్ ఆంటోని ఫిలింస్ కార్పొరేషన్ నిర్మిస్తుండగా, మీరా విజయ్ ఆంటోని సమర్పిస్తున్నారు.

ఈ చిత్రంలో విజయ్ ఆంటోని మేనల్లుడు (సోదరి కొడుకు) అజయ్ ధీషన్‌ను విలన్‌గా పరిచయం చేస్తూ మేకర్స్ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. యాక్షన్-ప్యాక్డ్ పోస్టర్‌ను చూస్తుంటే విజయ్ ఆంటోనీ, అజయ్ మధ్య భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు ఉండేలా కనిపిస్తోంది. ఈ రెండు పాత్రలు తలపడే సీన్లు ప్రేక్షకులకు ఆడ్రినలిన్ రష్ ఇచ్చేలా ఉంటాయని చిత్ర బృందం తెలిపింది.

ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల చేసిన విజయ్ ఆంటోని ఫస్ట్‌లుక్‌కి, టైటిల్‌కి మంచి స్పందన లభించింది. భిన్న కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ఈ సినిమా కచ్చితంగా ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే నమ్మకంతో మేకర్స్ ఉన్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే హృద్యమైన కుటుంబ చిత్రంగా త్వరలో థియేటర్లలోకి తీసుకొచ్చేందుకు యూనిట్ సిద్ధంగా ఉంది.

సముద్రఖని, మహానటి శంకర్, ప్రితిక, బ్రిగిడా, వినోద్ సాగర్, దీప్శిఖ, కలక్క పోవదు యారు అర్చన, కనిమొళి మరియు అంతగారం నటరాజన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచయిత, దర్శకుడు: లియో జాన్ పాల్, సంగీతం: విజయ్ ఆంటోని, సినిమాటోగ్రఫీ: యువ ఎస్ , ఆర్ట్ డైరెక్టర్: రాజా ఎ.


నాగ చైతన్య

ఫిబ్రవరి 7న 'తండేల్' రిలీజ్

నాగ చైతన్య నటిస్తున్న నూతన చిత్రం 'తండేల్'. ఇప్పటికే ఈ సినిమాపై అందరిలోనూ మంచి బజ్ క్రియేట్ అయ్యింది. దీన్ని మరింతగా పెంచుతూ ఇటీవల విడుదలైన ఫస్ట్ సింగిల్ 'బుజ్జి తల్లి' పాట అందరిలోనూ మరింత క్యూరియాసిటీని రేకెత్తించింది. దేవి శ్రీ ప్రసాద్ కంపోజ్ చేసిన ఈ ట్రాక్ మ్యూజిక్ చార్ట్‌లలో అగ్రస్థానంలో నిలిచి, ఇన్‌స్టంట్ హిట్ అయ్యింది.

నాగ చైతన్య, సాయి పల్లవి జోడిగా కనిపించిన 'బుజ్జి తల్లి' మెలోడిక్ మాస్టర్ ఫీస్‌గా నిలిచి, సినిమా మ్యూజికల్ జర్నీకి చార్ట్‌బస్టర్ టోన్‌ని సెట్ చేసిందని చిత్ర యూనిట్ తెలిపింది.

శనివారం నాగ చైతన్య పుట్టినరోజు. ఈ నేపథ్యంలో ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, మేకర్స్ పవర్ ప్యాక్డ్ యాక్షన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. చేతిలో బరువైన యాంకర్‌ను పట్టుకుని, వర్షపు తుఫాను మధ్య ఓడపై నాగ చైతన్య నిలబడి కనిపించారు. ఈ యాక్షన్ సీక్వెన్స్ సినిమాలో బిగ్గెస్ట్ ఎట్రాక్షన్‌గా నిలవనుంది. తండేల్ రాజు పాత్రను నాగచైతన్య పోషించిన విధానం భారతీయ సినిమాలో చిరకాలం గుర్తుండిపోతుంది. ఫిబ్రవరి 7న ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు దర్శక, నిర్మాతలు తెలిపారు.

డిసెంబర్‌లో నాగచైతన్య కొత్త సినిమా

శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర సంస్థ మరో భారీ ప్రాజెక్ట్‌ను సుకుమార్ రైటింగ్స్ అసోసియేషన్‌తో నిర్మాణం చేయనుంది. ఈ సంస్థలు సంయుక్తంగా గత ఏడాది సాయి దుర్గతేజ్, సంయుక్త మీనన్‌లతో కార్తీక్ దండు దర్శకత్వంలో 'విరూపాక్ష' చిత్రాన్ని నిర్మించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర సంచలనం సృష్టించడమే కాకుండా విమర్శకుల ప్రశంసలు కూడా అందుకుంది. ఇప్పుడు కార్తీక్ దండు దర్శకత్వంలోనే ఈ తాజా చిత్రాన్ని నాగచైనత్య హీరోగా నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు సుకుమార్ కూడా ఒక నిర్మాతగా ఉండటం మరో ఆకర్షణ. శనివారం నాగచైతన్య పుట్టిన రోజు సందర్భంగా ఈ కొత్త సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ఈ చిత్రం డిసెంబరులో షూటింగ్ ప్రారంభించుకోనుంది. భారీ బడ్జెట్‌తో, అత్యున్నత ప్రొడక్షన్ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.

పక్కా మాస్ సాంగ్..


శ్రీలీల, అల్లుఅర్జున్

అల్లు అర్జున్, డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న పాన్ ఇండియా సినిమా 'పుష్ప-2 - ది రూల్'. సుకుమార్ రైటింగ్స్ అసోసియేషన్‌తో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

ఇటీవల పాట్నాలో ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్ కనివిని ఎరుగని రీతిలో దాదాపు మూడు లక్షల వరకు హాజరైన అభిమానుల సమక్షంలో జరగడం విశేషం. ఈ ట్రైలర్ తరువాత సినిమాపై క్రేజ్.. అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పుష్పరాజ్‌గా అల్లు అర్జున్ నట విశ్వరూపం డిసెంబరు 5న ప్రపంచమంతా చూడబోతుంది. దర్శకుడు సుకుమార్ టేకింగ్... కల్ట్ మాస్ మేకింగ్ గురించి మాట్లాడుకోబోతున్నారు. ఇక ఈ చిత్రంలో అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న ప్రత్యేక పాట అప్‌డేట్ వచ్చేసింది. అల్లు అర్జున్, శ్రీలీలపై చిత్రీకరించిన 'కిస్సింగ్' పాటను నేడు (ఆదివారం) చెన్నైలో జరగనున్న గ్రాండ్ ఈవెంట్‌లో ఈ సాంగ్‌ను సాయంత్రం ఏడు గంటల రెండు నిమిషాలకు విడుదల చెయ్యబోతున్నారు. అల్లు అర్జున్ డ్యాన్సుల గురించి, డ్యాన్సుల్లో ఆయన ఎనర్జీ, ఈజ్, స్టయిల్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇక డ్యాన్సుల్లో తనకంటూ ఓ ముద్ర వేసుకున్న కథానాయిక శ్రీలీల. ఈకాంబోలో ప్రత్యేక గీతం అంటే ఇక ఫ్లోర్ ఫైరే... ఈ సాంగ్ పుష్ప-2లో మరో సన్సేషన్ సాంగ్‌గా నిలవబోతుంది. ఈ ఇద్దరి డ్యాన్సింగ్ ఫైర్‌కు దేవి శ్రీ ప్రసాద్ బాణీలు తోడైతే.. ఇక మాస్.. మాస్ జాతరే.. రెడీ టూ వాచ్ ఇండియాస్ బిగ్గెస్ట్ మాస్ సాంగ్ అని చిత్ర బృందం పేర్కొంది.

ఇంతటి స్పందన ఊహించలేదు


పి.జి.విందా

2004లో వచ్చిన అవార్డ్ విన్నింగ్ మూవీ 'గ్రహణం'తో సినిమాటోగ్రాఫర్‌గా సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన పి.జి.విందా తన అసాధారణ ప్రతిభతో అనతికాలంలోనే తనకంటూ ఓ ప్రత్యేకతను సొంతం చేసుకున్నారు. 'ది లోటస్ పాండ్' చిత్రంతో దర్శకుడిగానూ తనదైన ముద్ర వేశారు. రెండు దశాబ్దాలుగా సినీ రంగానికి సేవ చేస్తున్న పి.జి. విందా, ఎప్పటికప్పుడు నూతన సాంకేతికలను పరిచయం చేయడంలోనూ ముందుంటున్నారు. ఈ క్రమంలోనే సినిమా నైపుణ్యం, సాంకేతిక ఆవిష్కరణల గొప్ప వేడుక 'సినిమాటికా ఎక్స్‌పో'కు శ్రీకారం చుట్టారు. ఇటీవల హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో వైభవంగా 'సినిమాటికా ఎక్స్‌పో' సెకండ్ ఎడిషన్‌ను వైభవంగా నిర్వహించారు. హైదరాబాద్‌ను సినిమా, డిజిటల్ క్రియేటివిటీ కేంద్రంగా మలచడమే లక్ష్యంగా 'సినిమాటికా ఎక్స్‌పో' అడుగులు పడుతున్నాయి.

ఈ నేపథ్యంలో పి.జి. విందా మీడియాతో మాట్లాడుతూ, "గ్రహణం' సినిమా సమయంలో డిజిటల్ అంతగా లేదు. రాబోయే ఐదు, పదేళ్లలో డిజిటల్‌దే హవా ఉంటుందని అప్పుడే చెప్పాను. నా అంచనానే నిజమైంది. తెలుగు సినిమా పరిశ్రమ ఎంతో అభివృద్ధి చెందుతోంది. ఇక్కడ ఎందరో గొప్ప దర్శకులు, ప్రతిభగల సాంకేతిక నిపుణులు ఉన్నారు. అయితే కొన్ని కారణాల వల్ల సాంకేతికంగా వెనకబడిపోయాం. ముఖ్యంగా కొత్త కెమెరాలు, క్రేన్‌లు, ఇతర ఎక్విప్‌మెంట్‌లు మనకు ఆలస్యంగా పరిచయమవుతున్నాయి. అందుకే ఈ ఎక్స్‌పో నిర్వహించాలని తలపెట్టాం. దీని వల్ల ప్రపంచవ్యాప్తంగా త్వరలో మార్కెట్‌లోకి రాబోతున్న ఎక్విప్‌మెంట్ గురించి ముందే తెలుస్తుంది. దాంతో సాంకేతికంగా ఇంకా మెరుగైన సినిమాలను అందించగలం. తెలంగాణ ప్రభుత్వ మద్దతుతో మేము నిర్వహించిన సినిమాటికా ఎక్స్‌పో మొదటి ఎడిషన్‌కి గొప్ప స్పందన లభించింది. ఆ ఉత్సాహంతోనే రెండో ఎడిషన్‌ని నిర్వహించాం. దీనికి విశేష స్పందన లభించి, ఏకంగా 38 వేల మంది హాజరు కావడం అనేది ఆసియాలోనే రికార్డు. ఫిల్మ్ ఈ ఎక్స్‌పో ద్వారా సాంకేతికతను పరిచయం చేయడం మాత్రమే కాకుండా, యువ ప్రతిభను ప్రోత్సహిస్తూ వారికి తగు సూచనలు చేస్తూ, సెమినార్లు నిర్వహించాం. సుదీప్ ఛటర్జీ, సత్యాంశు సింగ్, ఇంద్రగంటి మోహన కృష్ణ వంటి సినీ ప్రముఖులు స్టోరీ రైటింగ్, సినిమాటోగ్రఫీ గురించి ఎంతో నాలెడ్జ్‌ని పంచారు. ఈ స్పందన చూసిన తర్వాత సినిమాటికా ఎక్స్‌పో మూడో ఎడిషన్ ను మరింత ఘనంగా నిర్వహించాలని భావిస్తున్నాము. పలు అంతర్జాతీయ సంస్థలు సైతం రావడానికి అంగీకారం తెలిపాయి. అలాగే ప్రభుత్వ భాష, సాంస్కృతిక శాఖ మద్దతుతో ఈ సినిమాటికా ఎక్స్‌పోని మరో స్థాయికి తీసుకెళ్ళాలి అనుకుంటున్నాం' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.